thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 52 | కరీంనగర్ శనివారం, 3 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా

న్యూఢిల్లీ : జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయబోతున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తద్వారా ఓటరు జాబితాను కచ్చితత్వంతో నవీకరించడంతో పాటు ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంచడానికి వీలవుతుందని పేర్కొంది. ఇందుకోసం మరణాలకు సంబంధించిన సమాచారాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) నుంచి ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు పొందుతామని తెలిపింది. మరణించిన వారి కుటుంబాల నుంచి సమాచారం వచ్చే వరకు వేచిచూడకుండా.. ఆర్‌జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారని ఎన్నికల సంఘం వెల్లడించింది.

# తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం ఫాలో అవ్వాలి: సీడబ్ల్యూసీ



ఢిల్లీలో అత్యవసరంగా సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణనను అభినందించింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన ప్రభుత్వం చేసిన కులగణన గురించి సమావేశంలో ప్రజెంటేషన్ ఇవ్వగా సీడబ్ల్యూసీ హర్షం వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా పూర్తి వివరాలతో కులగణనను నిర్వహించిందని, కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మోడల్‌ని ఫాలో కావాలని సూచించింది. పౌర సమాజం సామాజిక కార్యకర్తలు వివిధ సామాజిక వర్గాల లీడర్లను ప్రక్రియలో భాగస్వాములు చేశారని, అధికారులతో అంతర్గత కసరత్తు కాకుండా బహిరంగంగా ప్రజల నుంచి వివరాలు సేకరించారని సీడబ్ల్యూసీ వివరించింది. తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన పద్ధతిని కేంద్రం ఫాలో అవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గట్టిగా కోరుతోంది. ఈ నేపథ్యంలోనే పెహల్గాం ఉగ్రదాడి మృతులకు సీడబ్ల్యూసీ సంతాపం తెలిపింది. బాధిత కుటుంబాల బాధ.. మొత్తం దేశం బాధ అని పేర్కొంది. ఉగ్రదాడికి దేశం మొత్తం జవాబుదారీతనం అని, న్యాయం కోసం ఎదురు చూస్తోందని తెలిపింది. ఇది రాజకీయాలకు సమయం కాదని, పాకిస్తాన్‌కు గుణపాఠం నేర్పడానికి ఉగ్రవాదాన్ని నిర్ణయాత్మకంగా అరికట్టడానికి ఒక దేశంగా మన సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించాల్సిన సమయం అని వ్యాఖ్యానించింది. ఉగ్ర దాడికి సూత్రధారులు, నేరస్థులు పూర్తి పరిణామాలను ఎదుర్కోవాలని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌ను ఒంటరిగా చేసి శిక్షించడానికి భారత ప్రభుత్వం దృఢంగా, వ్యూహాత్మక స్పష్టతతో అంతర్జాతీయ సమన్వయంతో వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కోరుతోంది. బాధితుల కుటుంబాలకు నిరంతర నైతిక, సంస్థాగత మద్దతు ఇవ్వాలని కూడా కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. బాధిత కుటుంబాలకు పరిహారం మాత్రమే కాకుండా..దీర్ఘకాలిక పునరావాసం, మానసిక మద్దతు కల్పించాలని డిమాండ్ చేసింది. భద్రత నిఘాలో తీవ్రమైన లోపాలకు కాలపరిమితితో కూడిన జవాబుదారీతనం ఉండాలని కూడా సీడబ్ల్యూసీ సూచించింది.

## జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్.. కీలక ఆదేశాలు



నిజామాబాద్ : సమగ్ర అధ్యయనం జరిపిన మీదట రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావుతో కలిసి మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో పైలట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ల నేతృత్వంలో ప్రతి మండలానికి రెండు బృందాలను నియమించాలని, ప్రతీ బృందంలో తహసీల్దార్, సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ బృందాలు నిర్దేశిత గ్రామంలోనే ఉంటూ భూ సమస్యలపై ప్రజలు, రైతుల నుండి అర్జీలు స్వీకరిం చాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ వరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్నిలిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టా ఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు. కబ్జాలకు, అన్యాక్రాంతానికి గురైన ప్రభుత్వ భూలను సైతం గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుని పక్కాగా వాటి వివరాలను రికార్డులలో పొందుపర్చాలని ఆదేశించారు. కాగా, భూభారతి నూతన చట్టంపై రాష్ట్రంలో 605 మండలాలకు గాను ఇప్పటివరకు 590 మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహించడం జరిగిందని, 85,527 మంది పౌరులు, 1,62,577 మంది రైతులు అవగాహన సదస్సులలో పాల్గొన్నారని మంత్రి వివరించారు.

# పీసీసీ కార్యవర్గానికి....

# హైకమాండ్ గ్రీన్ సిగ్నల్!

## రెండు, మూడు రోజుల్లో ప్రకటన - కేవలం వర్కింగ్ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లకే కార్యవర్గం పరిమితం



# పదవుల పంకాలకు వేళాయె!

హైదరాబాద్ : పీసీసీ కార్యవర్గం ప్రకటనకు హైకమాండ్ ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఢిల్లీ వెళ్లిన పీసీసీ చీఫ్ రెండు రోజులపాటు అక్కడే ఉండి.. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ను కలిసి కార్యవర్గంపై చర్చించారు. పీసీసీ కార్యవర్గానికి వారి నుంచి ఆమోద ముద్ర వేయించుకున్నారు. దీంతో రెండు, మూడు రోజుల్లో కార్యవర్గం ప్రకటన వెలువడనుంది. అయితే మొదటి విడతలో కేవలం వర్కింగ్ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లను మాత్రమే ప్రకటించనున్నారు. మిగితా కార్యవర్గాన్ని డీసీసీ చీఫ్ లతోపాటు వెల్లడిస్తారు. నలుగురు నుంచి ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, 20 నుంచి 25 మందితో పార్టీ ఉపాధ్యక్షులను నియమించనున్నారు. నలుగురు నుంచి ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లలో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఒకరికి, బీసీ మహిళా కోటా నుంచి ఒకరికి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నుంచి ఒక్కొక్కరికి అవకాశం దక్కనుంది. అయితే రెడ్డి సామాజిక వర్గం నుంచి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీ చంద్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ చీఫ్ రోహిణ్ రెడ్డి తీవ్రంగా పోటీ పడుతున్నారు. బీసీ కోటాలో విప్ బీర్ల అయిలయ్య, మాజీ జడ్పీ చైర్ పర్సన్ సరితా యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఎస్సీ కోటాలో విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ రేసులో ఉన్నారు. ఎస్టీ కోటాలో ఎంపీ బలరాం నాయక్, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ పోటీ పడుతున్నారు. ఇక మైనార్టీ కోటాలో మాజీ ఎంపీ అజారుద్దీన్, నాంపల్లి ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్, మాజీ ఎన్ఎస్‌యూఐ నేత అజ్మతుల్లా హుస్సేనీ పదవి ఆశిస్తున్నారు. వీరిలో ఎవరి పేర్లకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనేది పీసీసీ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతున్నది. ఇక ప్రస్తుత కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శులుగా ఉన్న కొందరికి ఉపాధ్యక్షులుగా పదోన్నతి కల్పించనున్నారు.

10 ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండేలా ప్రతి జిల్లాకు కనీసం ఇద్దరు ఉపాధ్యక్షులను నియమించనున్నారు.

**మే నెల 20లోపు మిగితా కార్యవర్గం**... పీసీసీ కార్యదర్శులను, ఇతర కార్యవర్గాన్ని డీసీసీ అధ్యక్షుల నియామకంతోపాటు మే నెల 20 లోపు ప్రకటించనున్నారు. పీసీసీ చీఫ్ గా నియమితులైన దాదాపు 8 నెలల తర్వాత మహేశ్ గౌడ్ కార్యవర్గాన్ని ప్రకటించబోతున్నారు. 3 నెలల క్రితమే పీసీసీ కార్యవర్గ జాబితా ఫైనల్ చేసి, ప్రకటించే సమయంలోనే పార్టీ ఇన్?చార్జిగా ఉన్న దీపాదాస్ మున్షి బదిలీ కావడంతో.. ఆ జాబితాను పక్కన పెట్టారు. ప్రస్తుత ఇన్?చార్జి మీనాక్షి నటరాజన్ మళ్లీ ఈ జాబితాను పరిశీలించి, ఆ తర్వాత కొన్ని మార్పులు, చేర్పులతో కార్యవర్గ ప్రకటన మరింత ఆలస్యమైంది.




# అమరావతి నగరం కాదు.. ఒక శక్తి!

# 'అమరావతి'కి సహకరిస్తాం..

## ఏపీ కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలు: మోదీ

అమరావతి: అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని చెప్పారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. "దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది" అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు.

**చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు..** "టెక్నాలజీ నాతో మొదలైనట్లు చంద్రబాబు ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు అందిస్తుంది" అన్నారు.

**పవన్ జీ.. ఇది మనమే చేయాలి..** "ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు.. ఏపీ ప్రగతి, ఆశలు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదులు. వీరభద్ర స్వామి, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి పాదాలకు నమస్కరిస్తూ ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు, పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నా" అన్నారు. "ఇంద్రలోకం రాజధాని అమరావతి. ఇప్పుడు ఏపీ రాజధాని పేరు కూడా అమరావతే. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. ఏపీని ఆధునిక ప్రదేశ్, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. యువత కలలు సాకారమయ్యే రాజధానిగా ఈ నగరం ఎదుగుతుంది. ఐటీ, ఏఐ సహా అన్ని రంగాలకూ అమరావతి గమ్య స్థానంగా మారుతుంది. హరితశక్తి, స్వచ్ఛ పరిశ్రమలు, విద్య, వైద్య కేంద్రంగా అమరావతి మారుతుంది. అమరావతిలో మౌలికవసతుల కల్పనకు కేంద్ర సహకరిస్తుంది" అని చెప్పారు.

**కనెక్టివిటీకి కొత్త అధ్యాయం..** "ఏపీలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుంది. రైల్వే ప్రాజెక్టులతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, మరో రాష్ట్రానికి అనుసంధానం పెరుగుతుంది. ఈ అనుసంధానం తీర్థయాత్రలకు పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలకు రైల్వే బడ్జెట్ రూ.900 కోట్ల లోపే ఉండేది. ఇప్పుడు కేవలం ఏపీకే రూ.9వేల కోట్ల రైల్వే నిధులు ఇచ్చాం. ఏపీకి గతం కంటే పది రెట్లు అధికంగా నిధులు కేటాయించాం. గత పదేళ్లలో ఏపీలో 750 రైల్వే బ్రిడ్జ్‌లు, అండర్‌పాస్‌లు నిర్మించాం. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లు కేటాయించాం. ఏపీలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నాం. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాజెక్టుల వల్ల వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైతు వికాసానికి కేంద్రం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. రైతులకు పథకాలు, పరిహారం కింద రూ.17వేల కోట్లు సాయం చేశాం. పోలవరం త్వరగా పూర్తి చేసేందుకు కలిసి పనిచేస్తాం. ప్రతి ఎకరానికీ నీరు ఇచ్చేందుకు కృషిచేస్తాం" "వికసిత్ భారత్ నిర్మాణం కావాలంటే మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలి. ఈ నాలుగు వర్గాలు నాలుగు స్తంభాలు లాంటివారు. రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. నాగాయలంకలో టెస్టింగ్ రేంజ్.. దుర్గామాత లాగా భారత రక్షణ రంగానికి శక్తినిస్తుంది. శ్రీహరికోట నుంచి ప్రయోగించే ప్రతి రాకెట్ కోట్లాది భారతీయులకు గర్వకారణం. భారత శక్తి అంటే కేవలం మన ఆయుధాలే కాదు.. మన ఐక్యత కూడా. విశాఖలో యునిటీమాల్ అభివృద్ధి చేస్తున్నాం"

**విశాఖలో యోగా డేకు హాజరవుతా...** "విశాఖలో జూన్ 21న జరగనున్న యోగా డేలో పాల్గొంటాను. నన్ను ఆహ్వానించినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్. మన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. వచ్చే 50 రోజులూ ఏపీలో యోగాకు అనుకూల వాతావరణం కల్పించాలి. ఏపీలో కలలు కనేవాళ్ల సంఖ్య తక్కువేం కాదు.. ఆ కలల్ని నిజం చేసేవారి సంఖ్యా తక్కువకాదు. ఏపీ సరైన మార్గంలో నడుస్తోంది. సరైన వేగంతో ముందుకెళ్తోంది. దీన్ని కొనసాగించాలి. మూడేళ్లలో అమరావతి పనుల్ని పూర్తి చేస్తామని సీఎం అన్నారు. ఆ పనులు పూర్తయ్యాక ఏపీ జీడీపీ ఏ స్థాయికి వెళ్తుందో నేను ఊహించగలను. అది ఏపీ రాష్ట్రం చరిత్ర గతిని మార్చబోతోంది. ఏపీ అభివృద్ధిలో మీ భుజంతో కలిపి నా భుజం కలిపి పనిచేస్తాను. అందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు" అని ప్రధాని తెలిపారు.

చురకలు






హైదరాబాద్: తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి 'దోస్త్' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడు విడతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించారు.

మొదటి ఫేజ్: మే 3 నుంచి 21 వరకు మొదటి ఫేజ్ దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 29న మొదటి ఫేజ్ సీట్ల కేటాయింపు. రెండో ఫేజ్: మే 30 నుంచి జూన్ 8 వరకు దరఖాస్తుల స్వీకరణ. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు. జూన్ 13న సీట్ల కేటాయింపు. మూడో ఫేజ్: జూన్ 13 నుంచి 19 వరకు దరఖాస్తుల స్వీకరణ. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు. జూన్ 23న సీట్ల కేటాయింపు. జూన్ 30 నుంచి డిగ్రీ కళాశాలల్లో తరగతులు ప్రారంభం.





హైదరాబాద్: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయం.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కృషి ఫలితమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ నేతలు రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం కులగణన చేసి ప్రామాణికంగా స్పష్టమైన లెక్కల్ని వెల్లడించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

ఎవరెన్ని మాట్లాడినా... కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణన, కులగణన చేపడుతోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. చౌకబారు విమర్శలు చేసేవారు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కులగణనను తాము ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ విజయశాంతి, కాంగ్రెస్ సీనియర్ నేతలు వీహెచ్, మధుయాష్కి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది: మాజీ మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్: భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు విమర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా నేతలు, కార్యకర్తలు ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణకు భాజపా అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. భారాస మొదలుపెట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టి జహీరాబాద్ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా మొత్తం సాగునీటితో సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. "సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేయడానికి భారాస పోరాటం చేస్తుంది. తాగు, సాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారాస హయాంలో వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు రావడం లేదు? పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. వాళ్ల మోసం ప్రజలకు తెలిసిపోయింది. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. తెలంగాణ అభివృద్ధి మాతోనే సాధ్యమవుతుంది" హరీశ్ రావు తెలిపారు.



## గొర్రెల పంపిణీ కుంభకోణం.. దర్యాప్తులో కీలక పరిణామం

హైదరాబాద్: గొర్రెల పంపిణీ కుంభకోణానికి సంబంధించిన కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. గురువారం రాత్రి కోకాపేట్‌లోని మూవీటవర్‌లో కాంట్రాక్టర్ మొయినుద్దీన్ భార్య నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. అతడి ఖాతా నుంచి భార్య ఖాతాకు నగదు బదిలీ అయినట్లు గుర్తించారు. ఏసీబీ సోదాలను తొలుత మొయినుద్దీన్ భార్య అడ్డుకుంది. సెర్చ్ వారెంట్ చూపించి అధికారులు శుక్రవారం తెల్లవారుజాము 2.30 గంటల వరకు తనిఖీలు చేశారు. 2 కార్లను సీజ్ చేసి కార్యాలయానికి తరలించారు. గొర్రెల పంపిణీలో సుమారు రూ.700 కోట్ల మేర నిధులు పక్కదారి పట్టినట్లు ఏసీబీ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే 10 మంది వరకు పశుసంవర్ధకశాఖ అధికారులతో పాటు అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఓఎస్డీగా పనిచేసిన కల్యాణ్‌ను సైతం ఏసీబీ అరెస్ట్ చేసింది. అయితే కేసు నమోదు కాగానే మొయినుద్దీన్‌తో పాటు ఆయన తనయుడు ఇక్రమ్, మరో కీలక నిందితుడు విదేశాలకు పారిపోయారు. దీంతో వారిపై అప్పట్లోనే ఏసీబీ లుక్‌అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) జారీ చేసింది. తాజాగా కొంత సమాచారం లభించిన నేపథ్యంలోనే మొయినుద్దీన్ భార్య నివాసంలో సోదాలు చేసినట్లు తెలుస్తోంది.

## పాలమూరు ప్రాజెక్టుకి ద్రోహం చేస్తున్నారు.. రేవంత్ ప్రభుత్వంపై నిరంజన్ రెడ్డి ఫైర్

హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 90 శాతం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పూర్తయిందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. పాలమూరు వారైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్‌కు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఇవాళ(శుక్రవారం) తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్ట్‌లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడికి టెండర్ దక్కిందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆయన పనులను ఎందుకు పూర్తి చేయలేదని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. వాళ్ల అధినాయకుడి ఆజ్ఞలతో జాప్యం చేస్తున్నారా అని నిలదీశారు. నీటి పారుదలశాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే ప్రాజెక్ట్ డిజైన్‌లు మార్చి అంచనాలు పెంచారని ధ్వజమెత్తారు. రేవంత్ ప్రభుత్వం ప్రజాధనం వృథా చేస్తుందని విమర్శించారు.

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ రిపోర్ట్ గెజిట్ నోటిఫై చేయటం కోసం మే 7వ తేదీ సమావేశం ఉందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. ట్రిబ్యునల్ రిపోర్ట్‌లో ఉమ్మడి రాష్ట్రాలకు 1050 టీఎంసీల నీళ్లు కేటాయించినట్టుగా తెలుస్తోందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ రిపోర్టును ప్రభుత్వం యథాతథంగా ఆమోదిస్తే తెలంగాణకు గొడ్డలి పెట్టు అని చెప్పారు. జూరాల ప్రాజెక్టు ద్వారా కొడంగల్ నారాయణపేట లిఫ్ట్‌కు నీళ్లు వచ్చే పరిస్థితి ఉండదని అన్నారు. రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని చెప్పారు. ఈ ఏడాది ధాన్యం ఎంత సేకరించారు...బోనస్ ఎంత ఇచ్చారని ప్రశ్నించారు. అన్ని రంగాల్లో ఈ ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని అన్నారు. రేవంత్ ప్రభుత్వాన్ని భరించటం రాష్ట్ర ప్రజలకు శిక్ష అని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో అనుసరించాల్సిన వ్యూహంపై అఖిల పక్షాన్ని బ్రిజేష్ కుమార్ సమావేశానికి పిలవాలని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి కోరారు.




## 'నా పక్కన శశి థరూర్.. వాళ్లకు నిద్రపట్టదేమో': మోదీ వ్యంగ్యాస్త్రాలు

తిరువనంతపురం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కేరళలో పర్యటించారు. తిరువనంతపురం సమీపంలో రూ.8,900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన విఝింజమ్ ఇంటర్నేషనల్ డీప్‌వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హాజరయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఈ ఫొటో చూసి కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు."ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొందమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయింది" అని మోదీ పరోక్షంగా కాంగ్రెస్ (%జశీఅస్త్రీవం౦%)ను చమత్కరించారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. "దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించా" అని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధినాయత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ఈ క్రమంలోనే ఆ మధ్య ఓ కేంద్ర మంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం మొదలైంది. ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ ఆయన మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ సీపోర్ట్‌తో కేరళలో ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, షిప్పింగ్‌లో భారత పాత్రను గణనీయంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




పహల్గాం దాడి తర్వాత కశ్మీర్‌లో భద్రతా దళాలు గాలింపు చర్యలను వేగవంతం చేశాయి. తాజాగా ఐసీ 814 విమానాన్ని హైజాక్ చేసిన అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్‌ను ఉగ్రవాదులు విడిపించిన నేపథ్యంలో అతని ఇంట్లోను భద్రతా దళాలు సోదాలు చేశాయి. ప్రస్తుతం అతడు పాకిస్థాన్‌లో ఉంటున్నాడు. కీలక ఆధారాల కోసం సోదాలు చేపట్టారు. గత వారం 60 ఇళ్లపై ఎన్ఐఏ బృందాలు దాడులు నిర్వహించాయి. ఈసందర్భంగా మొత్తం ఇప్పటివరకు 1900 మందిని ప్రశ్నించాయి.

**టెక్ సాయం..** పహల్గాం దాడికి సంబంధించి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసేందుకు ఎన్ఐఏ అత్యాధునిక విధానాలు వినియోగిస్తోంది. శాటిలైట్ ఇమేజ్‌లు, డ్రోన్ దృశ్యాలు, బాధితులు, గుర్రపు స్వారీ ఆపరేటర్ల నుంచి సమాచారం సేకరిస్తోంది. దీంతోపాటు దాడి జరిగిన ప్రదేశాన్ని హైరిజల్యూషన్ 3డీ మోడల్‌ను కూడా తయారుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మోడల్ దర్యాప్తును కోర్టులో విచారణకు ఉపయోగించనుంది. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు 40 ఖాళీ తూటాలను దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకొన్నాయి. అంతేకాదు.. మొబైల్ టవర్స్ నుంచి పాత డేటాను మొత్తం దర్యాప్తు బృందాలు వెలికితీస్తున్నాయి.

**లష్కరే ప్లాన్‌కు పాక్ ఐఎస్ఐ సాయం..** బైసరన్ లోయలో పర్యాటకుల ను హత్య చేయాలన్న పథకాన్ని ప్రాథమికంగా లష్కరే తోయిబా రూపొందించిందని జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చింది. దీనికి ఐఎస్ఐ ఆపరేటివ్‌లు సాయం చేయగా.. దీనికి పాక్‌లోని లష్కరే ప్రధాన కార్యాలయంలో తుదిరూపు వచ్చింది. ఈ మొత్తం దాడికి లష్కరే ఉగ్రవాది హాషీమ్ మూసా, అలీభాయ్‌లు కేంద్రంగా నిలిచినట్లు అంచనా వేసింది. వీరిద్దరూ పాక్ జాతీయులే. ఈ ఉగ్రవాదులకు 2024లో జరిగిన గగనగర్ ఉగ్రదాడితో సంబంధం ఉందని దర్యాప్తు బృందాలు బలంగా విశ్వసిస్తున్నాయి. అయితే వీరు చీనాబ్ లోయ వైపు నుంచి వచ్చి ఉండనందున, అటువైపు వెళ్లి ఉండకపోవచ్చని భావిస్తున్నాయి.

**సరిహద్దుల్లో తగ్గని ఉద్రిక్తత..** వరుసగా 8వ రోజు కూడా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. అంతర్జాతీయ సరిహద్దుల వెంట కాల్పులు జరిపింది. వీటిని భారత్ బలంగా తిప్పికొట్టింది. దీంతోపాటు సరిహద్దుల వెంట ఉన్న బంకర్లను శుభ్రం చేసి.. స్థానికులు ఆశ్రయం పొందేందుకు వీలుగా సిద్ధం చేస్తున్నారు.




## ఉగ్రవాదులతో బంధం నిజమే కానీ..: అంగీకరించిన బిలావల్ భుట్టో

పహల్గాం దాడి తర్వాత భారత్‌పై ప్రేలాపనలు చేస్తోన్న పాకిస్థాన్.. మధ్యమధ్యలో నోరు జారి నిజాలు మాట్లాడుతోంది. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనంటూ తాజాగా ఆ దేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో అంగీకరించారు. ఉగ్రవాద సంస్థలకు మద్దతు, ఆర్థిక సాయం పాక్ అందించిందని ఇటీవల ఆ దేశ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ అంగీకరించిన సంగతి తెలిసిందే. తాజాగా మీడియాతో మాట్లాడుతూ భుట్టో అదేతరహా వ్యాఖ్యలు చేశారు. "రక్షణ మంత్రి చెప్పిన ప్రకారం.. పాకిస్థాన్‌కు గతం ఉందనేది రహస్యం కాదని నేను భావిస్తున్నా. ఫలితంగా మనం బాధపడ్డాం. పాకిస్థాన్ నష్టపోయింది. ఆ పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ఈ సమస్య పరిష్కారానికి అంతర్గత సంస్కరణలు చేపట్టాం. పాకిస్థాన్ తీవ్రవాద చరిత్ర తిరస్కరించలేనిది. అయితే, అది ముగిసిన అధ్యాయం. అది మన చరిత్రలో ఒక దురదృష్ట భాగం" అని భుట్టో వెల్లడించారు. పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ 'స్కై న్యూస్' మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా "ఉగ్ర సంస్థలకు నిధుల సమీకరణ, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటివి పాక్ చాలాకాలంగా చేస్తోంది? దీనిపై మీ స్పందన ఏంటీ?" అని జర్నలిస్టు ప్రశ్నించారు. దానికి ఖవాజా బదులిస్తూ.. "అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం. అయితే అది పొరబాటు అని అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు పడింది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో మేం చేరకపోయి ఉంటే.. పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేది" అని అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో లష్కరే తోయిబా గురించి ప్రస్తావించారు. అది పాత పేరు అని, ఇప్పుడు తమ దేశంలో దాని ఉనికిలేదని అన్నారు. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వెనక "ది రెసిస్టెన్స్ ఫ్రంట్' హస్తం ఉన్నట్లు భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇది పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ. దీన్ని భారత ప్రభుత్వం గతంలోనే ఉగ్ర సంస్థగా ప్రకటించింది. ఇక ఈ ఘటన తర్వాత పాక్ నడ్డివిరిచేలా భారత ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. వాటిలో సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత కూడా ఒకటి. పాక్ మాజీ విదేశాంగ మంత్రి భిలావల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకున్న సంగతి తెలిసిందే. సింధూ నదిలో నీరు పారకపోతే.. రక్తం పారుతుందంటూ ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు.

## కిషన్‌రెడ్డికి బీసీల గురించి ఏం తెలుసు.. దానం నాగేందర్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్:కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బీసీల గురించి ఏమి తెలుసని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇవాళ(శుక్రవారం) హైదరాబాద్‌లో మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎక్కడ చేయలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణని రోల్ మోడల్‌గా తీసుకొమ్మన్నారని చెప్పారు. బీసీలం అల్ప సంతోషులమని అన్నారు. విమర్శలు ప్రతి విమర్శలు వల్ల సాధించేది ఏమీ లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

**దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ: బీర్ల ఐలయ్య...** దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో కులగణన చేసి రోల్ మోడల్‌గా నిలిచామని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఇవాళ(శుక్రవారం) సీఎల్పీ మీడియా పాయింట్‌లో బీర్ల ఐలయ్య మాట్లాడారు. సాహసోపేత నిర్ణయాలతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. జనగణనలో కులగణన చేస్తామన్న మోదీ కేబినెట్‌కి ధన్యవాదాలు తెలిపారు. దేశం అంత బీసీలకి న్యాయం జరగాలని అన్నారు. ఇక్కడ ఉన్న బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. గతంలో రాహుల్ గాంధీ పాదయాత్రలో ప్రజల సమస్యలు చూసి కులగణన జరగాలని పోరాడారని చెప్పారు. తెలంగాణలో కులగణన రాహుల్ గాంధీ విజన్ అని చెప్పారు. కేంద్రమంత్రి అయ్యి ఉండి కిషన్‌రెడ్డి ఆలోచించి మాట్లాడాలని అన్నారు. ఏ లెక్కల ప్రకారం తమ కులగణన తప్పని కిషన్ రెడ్డి అంటున్నారని నిలదీశారు. రేపు కేంద్రం కులగణన చేసిన తర్వాత ఆ లెక్కలు చూసి చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణని కేంద్రం రోల్ మోడల్‌గా తీసుకున్నందుకు రాష్ట్ర బీజేపీ నేతలకి దిమ్మ తిరిగిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి భారత్‌లో హీరోగా నిలబడటం కేంద్ర మంత్రులు జీర్ణించుకోలేక పోతున్నారని బీర్ల ఐలయ్య అన్నారు.

చురకలు

శనివారం 3 మే 2025

## కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి నారసింహుడు - మే 3నుండి నరసింహ నవరాత్రి ఉత్సవాలు



"భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరుడు శేషప్ప (కాకుం శేషా చలదాసు) రచించిన నరసింహ శతకంలోని పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగువా రుండరంటే అతిశయోక్తి కాదేమో... భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి, ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది... సుప్రసిద్ధ ప్రాచీన ధర్మపురి పుణ్యతీర్థం. కరీంనగర్ కు 71 కిలోమీటర్ల ఉత్తరాన, జగిత్యాలకు 27 కిలోమీ టర్ల ఈశాన్యాన తెలంగాణ లోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నదీ క్షేత్ర రాజం. ప్రధానంగా శివకేశవుల నిలయమై, శ్రీల క్ష్మీనరసింహ, రామలింగేశ్వర ఆలయాలు, మసీదు పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ ముస్లిం మత సామరస్యానికి ప్రతీకగా నిలచి ఉన్నదీ పుణ్యతీర్థం. బ్రహ్మాండ, స్కంధ పురాణాలలో, మడికె సింగన పద్మ పురాణంలో, చెరి కొండ ధర్మన్న చిత్ర భారతంలో, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో, ఏకామ్రనాధుని ప్రతాపరుద్ర చరిత్రలో, నృసింహదాసు మైరావణ చరిత్రలో, పోతనామాత్యుని నారాయణ శత కంలో, పింగళి సూరనార్యుని కళాపూర్ణో దయంలో, శేషాచలదాసు - నరహరి, నృసింహ, నృకేసరి శతకాలలో, కాకతీయానంతర శాసనాలలో, మధ్యయుగ దానపత్రాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడింది. పూర్వం ధర్మవర్మ మహారాజు ధర్మదేవత భక్తుడై, ప్రజలను ధర్మ కార్యోన్ముఖులను చేయడానికి చేసిన తపస్సు ఫలితంగా "ధర్మపురి" నామాంకిత, నృసిం హుడు భక్తుల కోర్కెలు తీర్చేందుకై ఇచ్చట వెలసి యున్నాడని, పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. గౌతమ మహర్షి, తన బ్రహ్మహత్య పాతకాన్ని పోగొట్టుకునేందుకు పరమశివుని గూర్చి తపస్సు చేసి, ఆయన జటాజూటం నందు గల "గంగా దేవి"ని ధర్మపురికి రప్పించినందున "గౌతమి, గోదావరి" అని నదీ పేర్లు వచ్చినట్లు స్థల పురాణం విశద పరుస్తున్నది. శ్రీరామచంద్ర స్థాపిత రామేశ్వరాలయం, అక్కపెల్లి రాజేశ్వరాలయం, శ్రీరామాలయం, దత్తాత్రేయ, గౌతమేశ్వర, శ్రీసాయి శివ బాలాజీ , అయ్యప్ప, ప్రసన్నాంజనేయ, భక్తాంజనేయ, యమ ధర్మరాజ, సంతోషిమాత, సత్యవతీ, మహాలక్ష్మి మందిరాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. రామాయణ, భారత, భాగవతాది పురాణ ఘట్టాలు చెక్కబడిన నృసింహాల యపు కాకతీయుల శిల్పకళకు అద్దం పట్టే కళ్యాణ మంటపం, శివాలయంలోని గణేష, చండిక, సప్తమాతృకలు, నల్లశెనపు రాతిపై సమంశ పద్ధతిలో చెక్కబడిన శ్రీరామలక్ష్మణ, సీతాదేవిల విగ్రహాలు మిగుల మనోజ్ఞమై ఉన్నాయి. ధర్మపురి క్షేత్రం మొదట జైన, బౌద్ధ యుగములందు ఆర్ష విద్య ప్రచార కేంద్రమై విదర్భ రాజ్య పోషణలో మున్యాశ్రమంగా ఉండేది. తర్వాత శాతవాహన, బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్య, కాకతీయ, రేచర్ల వెలమల మరియు నైజాం రాజుల ఏలుబడిలో అద్వితీయ వైభవాన్ని అనుభవించింది. ప్రతాప రుద్రుని కాలంలో ఢిల్లీని ఏలిన అల్లావుద్దిన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాపూర్ సైన్యం క్రీస్తు శకం 1309లో ఇందూరు (నిజామాబాద్) మీదుగా కాకతీయులపై దండెత్తిన సమయంలో ఇచ్చటి నృసింహాలయం, రామేశ్వరా లయాలను ధ్వంసం చేసినట్లు చరిత్ర చెబుతున్నది. 14వ శతాబ్ది మూడవ పాదంలో నారాయణాశ్రమ స్వామి అనే సన్యాసి, నాటి రామగిరి పాలకుడైన ముప్ప భూపతి సేనాని కేశనమంత్రి సాయంతో నారాయణ పురమను మఠంను స్థాపించి, బ్రాహ్మణులకు గృహములను నిర్మింపజేసి, అన్నసత్రాన్ని నెలకొల్పారు. 1724-50 మధ్య ధర్మపురివాసులు తిరిగి నృసింహాలయాన్ని నిర్మించారు.

**క్షేత్ర ప్రాశస్త్యం...** అద్వితీయ మహిమాన్వియైన ధర్మపురి క్షేత్ర మున యాత్రికుల సౌకర్యార్ధం నివాస స్థానములను కట్టించువారు భగవత్కటాక్షమున ఉత్తమ భవనముల పొందగలరని, ఇచ్చటి జీర్ణ మందిరములను ఉద్ధరించువారు వైకుంఠమునందు ఉత్తమ సుఖములను అను భవించగలరని, శ్రీనృసింహుని పూజ కొరకు పూల చెట్లను పెంచువారు నందనాది వనములతో సౌఖ్యములను అను భవించ గలరని, శ్రీనృసింహు శౌల్యన్నమును, దధ్యన్నమును మరియు పులిహోరను నైవేద్యమిడు వారు అన్నదాతలై భగవత్కటాక్షమునకు పాత్రు లగుదురని, నృసింహుని ప్రీతికై క్షేత్రమున బ్రాహ్మణులకు భూదానం, గోదానం మరియు హిరణ్యాది దానములనొసంగువారు ముందు జన్మమున సార్వభౌములగుదురని, క్షేత్రమున దీనాందులకు, దంపతులకు, బ్రహ్మచారులకు, పశుపక్ష్యాదులకు అన్నదాన మొనర్చినచో, నృసింహ కటాక్షమున వారి వారి పితృదేవతలు మోక్షమును పొందగలరని, శౌనకాది మహర్షు లకు నైమిషారణ్యము నందు శూత పౌరాణికులు వివరించినట్లు స్కంధ పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహత్యం విశదపరుస్తున్నది.

**నరసింహ అవతార ప్రత్యేకత...** రామకృష్ణాది అవతారములవలె గాక, నిర్యాణములేని శాశ్వత అవతారమైన శ్రీనరసింహుని జయంతి, హిందూ పండగలలో అత్యంత ఆధ్యాత్మిక ప్రాధాన్యత నొందింది. వైశాఖ శుద్ధ చతుర్దశి పుణ్య తిథియందు ఉద్భవించిన నారసింహుని పూజలతో, ఆకాల మృత్యు భయముండదని, దుష్టగ్రహ బాధలు, పైశాచిక చేతబడుల ప్రయోగాలను తిప్పికొట్టే శక్తి నారసింహ మంత్రానికి గలదని భక్తుల, సాంప్రదాయా చరణాసక్తుల ప్రగాఢ విశ్వాసం. "ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం, నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం" మంత్రంతో నరసింహ స్వామిని పూజిస్తే శత్రు జయం కలుగుతుంది. పగలు రాత్రి కాని సంధ్యా. సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవ మూకాని చేతిగోళ్ళతో, హిరణ్యకశిపుని చీల్చి భక్త జన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, అంకుశ, పాశు, పరశు, ముసల, కులిశ, పద్మాదులను కలిగి గదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అవతారాలకు భిన్నం.

**నరసింహ నవరాత్రులు...** కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి లక్ష్మీ సమేత నారసింహ (యోగ, ఉగ్ర) నవరాత్రి ఉత్సవాలు మే 3వ తేదీ నుండి 11వ తేదీ వరకు సాంప్ర దాయ రీతిలో జరుగనున్నాయి. సర్వ దేవతా మూర్తులను కలిగి 'ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు' అని విఖ్యాతి నందిన ప్రాచీన చరిత్ర మరియు పౌరాణిక ప్రాధాన్యత కలిగిన ధర్మపురి క్షేత్రంలో ఏటా వైశాఖ శుక్ల షష్టి నుండి చతుర్దశి వరకు స్థానిక దైవాల నవరాత్రి ఉత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహించడం అనాదిగా ఆచరణలో ఉంది. ఈ సంవత్సరం ప్రధానంగా మే 7 న సహస్ర కలశాభిషేకం, 8న చందనోత్సవం, 9న వసంతోత్సవం, పల్లవోత్సవం, అన్న కూటోత్సవం, నిత్య ఆరాధనలతో పాటు 10న లక్ష తులసీ పూజ, సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించ నున్నారు. 11న నర సింహ జయంతి, ప్రత్యేక స్థంభోద్భవ పూజాది కాలు నిర్వహించ నున్నారు. దేవస్థానం ఏసి, ఈఓ సంకటాల శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్, ధర్మ కర్తలు ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, వివిధ ఆలయాల అర్చకులు, సిబ్బంది కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణలలో నిమగ్నమై ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**



## పహల్గాం ఘటన.. భారత్-పాక్ సరిహద్దులో ఉగ్రకుట్ర భగ్నం

భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉగ్ర కుట్ర భగ్నమైంది. అమృత్‌సర్ సమీపంలో బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు పట్టుబడ్డాయి. వాటిలో తుపాకులు, గ్రనేడ్లు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో సరిహద్దులో ఇలా ఆయుధాలు పట్టుబడటం కలకలం రేపుతోంది. బీఎస్ఎఫ్ ఇంటిలిజెన్స్ వింగ్ సమాచారం మేరకు ఏప్రిల్ 30 సాయంత్రం ఈ ఆపరేషన్ నిర్వహించారు. దానిలోభాగంగా ఆయుధాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. దీనిపై తదుపరి దర్యాప్తు నిర్వహించనున్నారు. బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు అత్యంత వేగవంతంగా, సమన్వయంతో వ్యవహరించడంతో ఈ ఉగ్ర కుట్ర భగ్నమైంది. ఇదిలాఉంటే.. బంగ్లా సరిహద్దులో కూడా పాక్ ఐఎస్ఐ కలకలం సృష్టించినట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల కాలంలో మహమ్మద్ యూనస్ అధికారంలోకి వచ్చాక.. ఢాకా-ఇస్లామాబాద్‌ల మధ్య సంబంధాలు బలోపేతం అయ్యాయి. దీంతో పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, మిలిటరీ అధికారులు బంగ్లాదేశ్‌లోని భారత్ సరిహద్దుల వైపునకు రావడం పెరిగింది. ఆ దేశంలోని ర్యాడికల్ గ్రూప్స్‌తో కూడా పాక్ సంబంధాలు పెట్టుకొంటోంది.

ఈ నేపథ్యంలో బంగ్లా-భారత ర్యాడికల్ గ్రూపులను పాకిస్థాన్ వాడుకొనే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈనేపథ్యంలో భద్రతా ఏజెన్సీలు బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లోని పోస్టులపై దృష్టిపెట్టాయి. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. పర్యాటకుల తలపైనే గురిపెట్టి కాల్చారు. మొత్తం 10 నిమిషాల్లో 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కుతోంది.

## భారత్ తరపున యుద్ధం చేయకండి: ఖలీస్థానీ ఉగ్రవాది రెచ్చగొట్టే పిలుపు



నిషేధిత ఖలిస్థానీ ఉగ్రవాద సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' వ్యవస్థాపకుడు.. భారత్ చేత ఉగ్రవాదిగా ప్రకటించబడిన గురుపత్వంత్ సింగ్ పన్నూ మరోసారి తీవ్ర రెచ్చగొట్టే వ్యాఖ్యలతో వార్తల్లోకెక్కారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఏదైనా సైనిక ఘర్షణ తలెత్తితే, భారత సైన్యంలో సేవలందిస్తున్న సిక్కు సైనికులు దేశం తరఫున పోరాడకూడదని ఆయన బహిరంగంగా పిలుపునిచ్చారు. అంతేకాకుండా యుద్ధం సంభవిస్తే పంజాబ్ సరిహద్దు ప్రాంతాల ప్రజలు పాకిస్థాన్‌కు సహకరించాలని కూడా ఆయన కోరారు. ఈ మేరకు పన్నూ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు, ఇది తీవ్ర వివాదాస్పదంగా మారింది. పన్నూ వ్యాఖ్యల సారాంశం: పన్నూ తన వీడియో సందేశంలో, భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం వస్తే అది భారత్‌కు.. ప్రధాని నరేంద్ర మోదీకి చివరి యుద్ధం అవుతుందని హెచ్చరించారు. సిక్కులకు పాకిస్థాన్ ఎల్లప్పుడూ మిత్ర దేశమని, ఆ దేశంపై దాడి జరిగితే సిక్కులు తటస్థంగా ఉండటం సరికాదని ఆయన పేర్కొన్నారు. భారత సైన్యంలోని సిక్కు రెజిమెంట్‌లు భారత్ తరపున యుద్ధంలో పాల్గొనవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ యుద్ధం వస్తే, పంజాబ్‌లోని ప్రజలు పాకిస్థాన్ సైన్యానికి లంగర్ (ఉచిత భోజనం) అందించడంతో పాటు ఇతరత్రా సహకారం అందించాలని ఆయన కోరారు. ఖలిస్థాన్ అజెండాలో భాగంగానే పన్నూ వ్యాఖ్యలు: గురుపత్వంత్ సింగ్ పన్నూ ఖలిస్థాన్ అనే ప్రత్యేక సిక్కు దేశ స్థాపన వాదాన్ని బలంగా సమర్థిస్తున్నాడు. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. దేశ సమగ్రతకు సవాల్ విసురుతూ తరచూ రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం ఆయనకు అలవాటు. ఆయన నేతృత్వంలోని 'సిక్స్ ఫర్ జస్టిస్' సంస్థను భారత్ చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిషేధించింది. పన్నూను భారత్ ఉగ్రవాదిగా ప్రకటించింది. ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. విదేశాల నుండి తన కార్యకలాపాలను నిర్వహిస్తూ, భారత వ్యతిరేక అజెండాను విస్తరించడానికి సోషల్ మీడియాతో సహా వివిధ మార్గాలను పన్నూ ఉపయోగించుకుంటున్నాడు. పన్నూ తాజా వ్యాఖ్యలు భారతదేశంలో ముఖ్యంగా సైనిక వర్గాలలో.. పంజాబ్‌లో తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. భారత సైన్యంలోని సిక్కు సైనికులు దేశభక్తికి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తారు. దేశ రక్షణలో వారి సేవలు అనిర్వచనీయం. ఇటువంటి సమయంలో దేశం తరపున యుద్ధం చేయవద్దని ఒక ఉగ్రవాది పిలుపునివ్వడం సిక్కుల దేశభక్తిని కించపరచడమేనని పలువురు విమర్శిస్తున్నారు. కాశ్మీర్‌లోని పూంఛ్ సెక్టార్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి వంటి సంఘటనల నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇప్పటికే ఉద్రిక్తత నెలకొని ఉంది. ఇటువంటి సున్నితమైన సమయంలో పన్నూ చేసిన ఈ వ్యాఖ్యలు పరిస్థితిని మరింతగా రెచ్చగొట్టే విధంగా ఉన్నాయి. భారత భద్రతా సంస్థలు పన్నూ కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాయి. ఆయన రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి.

**భారత్ నుండి స్పందన- భవిష్యత్ పరిణామాలు:** పన్నూ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం నుండి అధికారికంగా తీవ్ర ఖండన వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే ఉగ్రవాదిగా ప్రకటించబడిన పన్నూ ప్రకటనలకు భారత్ పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోయినప్పటికీ, సైనికుల మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి.. సమాజంలో విభేదాలు సృష్టించడానికి చేసే ఇలాంటి ప్రయత్నాలను సీరియస్‌గా పరిగణిస్తుంది. పంజాబ్‌లోని వివిధ వర్గాల నుండి సిక్కు సంస్థల నుండి కూడా పన్నూ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

సిక్కులు ఎల్లప్పుడూ దేశానికి అండగా నిలిచారని, కొద్దిమంది వేర్పాటువాదుల వ్యాఖ్యలు మొత్తం సిక్కు సమాజానికి ఆపాదించకూడదని వారు స్పష్టం చేస్తున్నారు. పన్నూ వంటి ఖలిస్థానీ సానుభూతిపరులు పాకిస్థాన్ మద్దతుతో భారత్‌లో అస్థిరత సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని భారత భద్రతా వర్గాలు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నాయి. తాజా వ్యాఖ్యలు ఈ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా ఉన్నాయి. పన్నూ రెచ్చగొట్టే ప్రయత్నాలు భారత అంతర్గత భద్రతకు సవాలుగా మారే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం - భద్రతా సంస్థలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పన్నూ మరియు SFJ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని.. వారి దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## యుద్ధం అంటే పాక్ కచ్చితంగా వెనుకంజే... తెరపైకి 93 అంచనాలు!

పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. పహల్గాం ఉగ్రదాడికి ఎక్కడ, ఎప్పుడు, ఎలా ప్రతీకారం తీర్చుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను సైన్యానికే ఇచ్చినట్లు భారత ప్రధాని మోడీ తెలిపిన పరిస్థితి. మరోపక్క భారత్ 36 గంటల్లో తమపై దాడి చెస్తుందనే సమాచారం తమకు ఉందని పాక్ మంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో 1993లో భారత్ - పాక్ సంబంధాలపై అమెరికా నిఘా సంస్థ ఓ రహస్య అంచనాలు ప్రచురించింది. ఈ డాక్యుమెంట్ ను ఇరు దేశాల సంబంధాలను పరిశీలించి 'నేషనల్ ఇంటెలిజెన్స్ ఎస్టిమేట్' (ఎన్ఐఈ) తయారు చేసింది. దీనిలో పలు కీలక విషయాలు వెల్లడించింది. ఇందులో భాగంగా.. న్యూఢిల్లీ అంటే ఇస్లామాబాద్ కు లోలోపల భయాలు ఉన్నాయని తెలిపింది. అవును... 1993లో భారత్ - పాక్ సంబంధాలపై అమెరికా నిఘా సంస్థ ఓ రహస్య అంచనాలు ప్రచురించింది. నాడు పీవీ నరసింహారావు ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఎన్.ఐ.ఈ.. సీఐఏకు పనిచేసే బ్రూస్ రీడెల్ నేతృత్వంలో ఈ పత్రాన్ని సిద్ధం చేశారు. ఇందులో





పలు కీలక విషయాలు పొందుపరిచారు. ఆ సమయానికి భారత్ లో బాబ్రీ మసీద్ ఘటన చోటు చేసుకోగా.. అంతర్గత కలహాలతో పాకిస్తాన్ సతమతమవుతోంది. ఆ సమయంలో భారత్ - పాక్ మాధ్య పూర్తి స్థాయి యుద్ధం జరగడానికి 20 శాతం అవకాశం ఉందని నాడు సీఐఏ అంచనా వేసింది. దీనికి ఉగ్రదాడి, సైనిక విన్యాసాలతోపాటు హఠాత్తుగా చెలరేగే మత విద్వేషాలు కారణం కావొచ్చని పేర్కొంది. నాడు ఇటు భారత్ కానీ, అటు పాక్ కానీ యుద్ధం కోరుకోవడం లేదని ఆ డాక్యుమెంట్ వెల్లడించింది. అయితే... భారత్ ఎదుగుదలను చూసి ఓర్వలేని పాకిస్థాన్.. కశ్మీర్ లో వేర్పాటువాద శక్తులతో చేతులు కలపడం, ఉగ్రవాదులతో జట్టు కట్టడం, కశ్మీర్ ను వేరు చేసేందుకు ఉగ్రమూకలకు ఆయుధాలు సమకూర్చడం వంటివి చేస్తుందని పేర్కొంది! ఆ సమయంలో అటు ఆర్థికంగా, ఇటు సైనిక పరంగా, మరోపక్క దౌత్యపరంగా న్యూఢిల్లీ వేగంగా ఎదుగుతోందని ఆ డాక్యు మెంట్ అభివర్ణించింది. ఇరు దేశాల మధ్య ఆ అంతరాన్ని పాక్ అందు కోలేదని వెల్లడించింది. ఆ సమయంలో భారత్ కు కేవలం అంతర్గత సమస్యలు, ఆర్థికాభివృద్ధి మాత్రమే సవాలుగా ఉందని తెలిపింది.

## బెడిసికొట్టిన భార్య తెలివి తేటలు.. విడాకుల కేసులో కోర్టు లక్షల జరిమానా

కొన్నిసార్లు అతి తెలివి తేటలు పనికిరావు. అవి మనకే రివర్స్ లో ప్రమాదకరంగా మారతాయి.సరిగ్గా అలానే ఒక భార్య తన విడాకుల కేసులో బాగా తెలివిగా ఉండాలని చూసింది. కానీ అది ఆమెకే తిరిగి దెబ్బ కొట్టింది. తన భర్త పరువు తీసినందుకు ఆమె ఏకంగా లక్ష రూపాయలు జరిమానా కట్టాల్సి వచ్చింది. కలకత్తా హైకోర్టు ఆమె భర్తకు జరిగిన పరువు నష్టం కోసం ఈ డబ్బులు చెల్లించాలని ఆర్డర్ వేసింది. ఆమె చేసిన పని ఏంటంటే, తన భర్త గురించి ఒక న్యూస్‌పేపర్‌లో రెండు చెడు విషయాలు పేర్కొంది. ఆమె భర్త గవర్నమెంట్ ఆఫీస్‌లో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. వాళ్ళిద్దరి విడాకుల కేసు ఇంకా కోర్టులో నడుస్తుండగానే, అతను ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకోబోతున్నాడని ఆ పబ్లిక్ నోటీసులో చెప్పింది. కానీ అది



నిజం కాదని, అదంతా అబద్ధపు కథ అని విడాకులు అయ్యే వరకు మళ్లీ పెళ్లి చేసుకునే ఆలోచన తనకు లేదని భర్త కోర్టులో చెప్పాడు. తన భర్త రెండో పెళ్లి గురించి నీకు ఎలా తెలుసు అని కోర్టు ఆ భార్యను అడిగినప్పుడు, ఒక నమ్మకమైన వ్యక్తి చెప్పాడని తప్ప ఆమె ఇంకేం చెప్పలేకపోయింది. కానీ ఆ నమ్మకమైన వ్యక్తి ఎవరో కోర్టుకు చెప్పలేకపోయింది.. చూపించలేకపోయింది. అంతేకాదు తన భర్త ఎవరిని పెళ్లి చేసుకోబోతున్నాడని ఆమె ఆరోపించిందో ఆ అమ్మాయి పేరు కూడా చెప్పలేకపోయింది. దీంతో ఆ భార్య తన భర్త పరువు తీసిందని కోర్టు నమ్మింది. అందుకే ఆమె మూడు నెలల్లో లక్ష రూపాయలు చెల్లించాలని కోర్టు ఆర్డర్‌లో కొంచెం మార్పు చేసింది. భార్యాభర్తల విడాకుల కేసు అనేది వాళ్ళిద్దరి వ్యక్తిగత విషయం. ఒక రూల్ ప్రకారం, ఇద్దరూ మీడియాలో ఏమీ రాయకూడదు. పబ్లిష్ చేయకూడదు. కానీ ఈ ఆర్డర్‌తో, కలకత్తా హైకోర్టు భార్య కానీ భర్త కానీ ఒకరినొకరు మీడియాలో చెడ్డగా చూపించకుండా ఉండేలా ఒక వాతావరణం క్రియేట్ చేసింది. ఇది విడాకుల కేసుల్లో అనవసరమైన పబ్లిసిటీకి అడ్డుకట్ట వేసే ప్రయత్నంలా ఉంది.

చురకలు

## సంపాదకీయం

### భారత్ లేదా పాక్.. తొలి దాడి ఎవరికి చేటు? అంతర్జాతీయ నిబంధనలు ఏం చెబుతున్నాయి?

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో భారత్ పాకిస్తాన్ చర్యలకు దీటైన సమాధానం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఎప్పుడైనా యుద్ధం సంభవించే అవకాశం లేకపోలేదు. అందుకే భారత్ పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకుంటూ జల సంధిని నిలిపివేయడం, పాకిస్తానీయుల వీసాలను రద్దు చేయడం, దౌత్య సంబంధాలను తగ్గించడం వంటి కీలక చర్యలకు పాల్పడింది. ప్రతిగా పాకిస్తాన్ కూడా భారత్ కోసం తన గగనతలాన్ని మూసివేసింది. భారత్ జల ఒప్పందాన్ని రద్దు చేసినప్పుడు పాకిస్తాన్ నుండి తీవ్రమైన ప్రతిస్పందన వచ్చింది. ప్రస్తుతం పాకిస్తాన్ భారత్‌ను చూసి భయపడుతోంది. భారత్ ఎప్పుడైనా యుద్ధానికి మొదటి దాడి చేయగలదని ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే, భారత్ లేదా మరే ఇతర దేశమైనా మరొక దేశంపై మొదటి దాడి చేస్తే ఆ దేశానికి ఎంత నష్టం వాటిల్లుతుంది? ఈ కథనంలో తెలుసుకుందాం. అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన ఒక శత్రు దేశంపై మొదటి దాడి చేయడం వల్ల లాభాలు ఎంత ఉంటాయో నష్టాలు కూడా అంతే ఉంటాయి. మొదటి దాడి వల్ల శత్రువు బలహీనంగా ఉన్న సమయంలో అనూహ్యంగా నష్టం కలిగించవచ్చు. అయితే ఇది అంతర్జాతీయ చట్టాలు, భద్రతా ప్రోటోకాల్‌ల ఉల్లంఘనకు దారితీస్తుంది. అంతేకాకుండా మొదటి దాడి చేయడం వల్ల ఆ దేశానికి ఆర్థిక, సైనిక, సామాజికంగా కూడా నష్టం వాటిల్లుతుంది. క్షీణించిన ఆర్థిక పరిస్థితి అంతర్జాతీయ చట్టాల ప్రకారం, ఎటువంటి చట్టబద్ధమైన కారణం లేకుండా మరొక దేశంపై దాడి చేయడం యుద్ధ నేరంగా పరిగణిస్తారు. అటువంటి పరిస్థితిలో మొదటి దాడి చేసిన దేశాన్ని ఐక్యరాజ్యసమితి, ఇతర అంతర్జాతీయ సంస్థలు శిక్షించవచ్చు. యుద్ధ పరిస్థితుల్లో ఒక దేశానికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల తీవ్రమైన ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. సైనిక పరికరాలు, సైనికులు, ఇతర యుద్ధ సంబంధిత ఖర్చుల కోసం భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తుంది. సైనిక నష్టం ఏ పరిస్థితిలోనైనా మొదటి దాడి చేసే దేశం తమ సైనికుల ప్రాణాలను కోల్పోయే.. వారు తీవ్రంగా గాయపడే ప్రమాదం ఉంది. ఇది దేశ సైనిక శక్తిని తగ్గిస్తుంది. అంతేకాకుండా యుద్ధం వల్ల సామాజికంగా కూడా నష్టం కలుగుతుంది. దేశంలో నేరాలు, సామాజిక అశాంతి, పౌర హింస పెరిగే ప్రమాదం ఉంది. దేశ నిర్మాణం బలహీనపడుతుంది. ప్రజల విశ్వాసం కూడా తగ్గుతుంది.

## కానరాని మీడియా స్వేచ్ఛ... - మే 3...ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం




ఆఫ్రికాలోని చాలా దేశాల్లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు ఉండేవి. వాటికి నిరసనగా ఆఫ్రికన్ జర్నలిస్టులు 1991, ఏప్రిల్ 29 నుండి మే 3వ తేదీవరకు ఆఫ్రికాలోని నమీబియా దేశపు విండ్ హాక్ నగరంలో సమావేశం ఏర్పాటుచేసి, పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అనేక తీర్మానాలు వచ్చాయి. ఆఫ్రికన్ జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరపాలని 1993, డిసెంబరు నెలలో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించడం కూడా జరిగింది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీనపత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగానికి కష్టకాలంలో ఉంది. మీడియాకు స్వేచ్ఛ ఎండమావే అవుతున్నది. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాక పోవడం విచారకరం. భారత స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆగీత చెరిగి పోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చివేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్ధం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే. కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ముకోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నించడం కొనసాగుతున్నది. లొంగని వాటి ఆర్ధిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరుగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరి ప్రయోజనాలను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డుపెట్టుకొని లాభాలు సంపాదించటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోతున్నది. పాలక పక్షాలు స్వార్ధమే పరమార్ధంగా వ్యవహరిస్తున్నా యన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపుతున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాక పోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపివేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డు కోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తు తున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్దం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడు తున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసుకోలేని గందరగోళంలో జనాన్ని పడవేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసేకుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్దాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాడును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురి అవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. భారతదేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్ కౌన్సిళ్లు ఉన్నాయి. అయితే భారతదేశ కౌన్సిల్‌కు ఉన్న ప్రత్యేకత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం లభించడమే. స్వేచ్ఛాయుతమైన, జవాబుదారీ తనంతో కూడినదిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటం దాని లక్ష్యం. లక్ష్య సాధనకు ప్రెస్ కౌన్సిల్ పూర్తిగా అంకితం కావాలని ఆశిద్దాం. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## విద్యా రంగానికి జకీర్ హుస్సేన్ విశిష్ట సేవలు - మే 3... దివంగత రాష్ట్రపతి జకీర్ హుస్సేన్ వర్ధంతి




భారత దేశపు మొదటి ముస్లిం రాష్ట్రపతి, పదవిలో మరణించిన మొదటి భారత దేశ ప్రథమ పౌరులు జాకీర్ హుస్సేన్ (ఫిబ్రవరి 8, 1897 – మే 3, 1969). ఆయన మే 13 1967 నుండి మరణించినంత వరకు రాష్ట్రపతి పదవిలో ఉన్నారు. భారత 3వ రాష్ట్రపతి జాకీర్ హుసేన్ హైదరాబాదు (భారత దేశం)లో జన్మించారు. ఇతని తండ్రి పఖ్తూన్ జాతికి చెందిన వారు. అయన హైదరాబాదు నుండి ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ జిల్లా ఖాయిమ్ గంజ్ కు వలస వచ్చారు. హుస్సేన్ ప్రారంభ ప్రాథమిక విద్య హైదరాబాద్‌లో పూర్తయింది. హుసేన్ ఇటావా (ఉత్తరప్రదేశ్) లోని 'ఇస్లామియా ఉన్నత పాఠశాల' లో చదువు కున్నారు. లక్నో విశ్వ విద్యాలయం క్రిస్టియన్ డిగ్రీ కాలేజీ నుండి ఎకనామిక్స్ లో పట్టభద్రుడయ్యారు. ఉన్నతవిద్య అలీఘర్ లోని ఆంగ్లో మహమ్మడన్ ఓరియంటల్ కాలేజిలో అభ్యసించారు. ఇచట విద్యార్ధి సంఘ నాయకునిగా గుర్తింప బడ్డారు. 18 సంవత్సరాల వయస్సులో, అయన షాజహాన్ బేగంను వివాహం చేసుకున్నారు. జాకీర్ హుస్సేన్ 23 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందంతో అయన నేషనల్ ముస్లిం విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. మొదట అలీఘర్లో 1920 అక్టోబర్ 29 శుక్రవారం స్థాపించ బడింది, తరువాత 1925 లో న్యూ ఢిల్లీ లోని కరోల్ బాగ్ కు మార్చబడింది. తరువాత మార్చి 1, 1935 న న్యూ ఢిల్లీలోని జామియా నగర్ కు మళ్లీ మార్చ బడింది. దీనికి జామియా మిలియా ఇస్లామియా (కేంద్ర విశ్వ విద్యాలయం) అని పేరు పెట్టారు. జాకీర్ విత్తశాస్త్రంలో పి.హెచ్.డి. చేసేందుకు, 'బెర్లిన్ విశ్వ విద్యాలయానికి (జర్మనీ) వెళ్ళారు. 1926 లో బెర్లిన్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. జర్మనీలో ఉన్నప్పుడు గాలిబ్ (1797–1868) జీవితగాథ, కవితా సంగ్రహాలను క్రోడీకరించారు. 1927 లో మూసివేతను ఎదుర్కొంటున్న జామియా మిలియా ఇస్లామియాకు నాయకత్వం వహించడానికి అతను భారత దేశానికి తిరిగి వచ్చాడు. భారత దేశానికి తిరిగి వచ్చి, జామియా మిల్లియా ఇస్లామియాకు ఇరవై ఒక్క సంవత్సరాలు ఆయన పదవిలో కొనసాగారు. మార్గదర్శకులుగా మారారు. ముహమ్మద్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాల (ఇప్పుడు అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం) వ్యవహారాల్లో ముఖ్యంగా చురుకుగా ఉన్నారు. మహమ్మద్ అలీ జిన్నా వంటి రాజకీయ ప్రత్యర్థుల ప్రశంసలను పొందారు. బ్రిటిష్ వారితో పోరాటానికి, మహాత్మా గాంధీతో చేతులు కలిపి, "బేసిక్ విద్య" పై కఠోర పరిశ్రమ చేశారు. భారతదేశంలో విద్యాభ్యుదయానికి శ్రమించారు. ఈ కాలంలో హుసేన్ ఉత్తమ దార్శనికుడిగా, భారత విద్యా విభాగ మార్గదర్శకునిగా గుర్తింపు పొందారు. తమ రాజకీయ ప్రత్యర్థియైన మహమ్మద్ అలీ జిన్నా చేత కూడా పొగడ బడ్డారు. తన వ్యక్తిగత సంపదనంతా భారతదేశానికి ధారబోసిన దేశ భక్తులు. భారత స్వాతంత్ర్యం తరువాత, అలీఘర్ ముస్లిం యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ పదవిని అంగీకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన ప్రథమ దశలో విద్యార్థుల ఉద్యమాలను, ముఖ్యంగా అలీఘర్ లో, అదుపులో ఉంచుటకు, అయన నియామకం ఎంతో ఉపయోగ పడింది. వైస్ ఛాన్సలర్ పదవీకాలం ముగిసిన తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్ చేయ బడ్డారు. 1957 లో బీహారు గవర్నరుగా నియమింప బడి, పార్లమెంటుకు రాజీనామా చేశారు.

బీహారు గవర్నరుగా 1957 నుండి 1962 వరకు సేవలందించిన తరువాత 1962 నుండి 1967 వరకు భారత ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించారు. తదనంతరం మే 13 1967 న భారత రాష్ట్రపతిగా ఎన్నుకో బడ్డారు. అయన ప్రథమ ఉపన్యాసంలో "మొత్తం భారత దేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని పేర్కొన్నారు. తన అధ్యక్ష పదవీ కాలంలో, హుస్సేన్ హంగరీ, యుగోస్లేవియా, యుఎస్ఎస్ఆర్ మరియు నేపాల్ లకు నాలుగు దేశాలకు పర్యటించారు. 1969 మే 3 న అయన మరణించగా, న్యూ ఢిల్లీ లోని జామియా మిలియా ఇస్లామియా క్యాంపస్‌లో ఖననం చేశారు. అత్యల్పకాలం రాష్ట్రపతి పదవి నిర్వహించిన మొదటి వ్యక్తి. రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. (ఇప్పటి వరకు ఇద్దరు రాష్ట్రపతులు పదవిలో ఉండగా మరణించారు – డా. జాకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ). ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## బూదరాజు రాధాకృష్ణ జీవితం.. తెలుగు భాషకు అంకితం - మే 3...బూదరాజు రాధాకృష్ణ జయంతి



తెలుగు భాషకు తన జీవనాన్ని అంకితంగా సమర్పించుకున్న వారు అరుదు. వారిలో బూదరాజు రాధాకృష్ణ ప్రముఖులు. వాక్ నిపుణత, వ్యాకరణ విలాసం, పదబంధాల పరిపుష్టతతో కూడిన ఆయన రచనలు పరిశుద్ధమైన భాషా సేవకు నిలువెత్తు నిదర్శనాలు. 'తెలుగు భాషా భక్తుడు' అనే పదం ఆయనకు అక్షరార్థంగా అంకితమవుతుంది. బూదరాజు రాధాకృష్ణ తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్టమైన వ్యక్తి. వారు కేవలం ఒక భాషా శాస్త్రవేత్తగానే కాకుండా, సీనియర్ పాత్రికేయులుగా, రచయితగా, అనువాదకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. తెలుగు భాషకు, పాత్రికేయ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి తెలుగు సాహితీ సముద్రంలో ఎన్నో మాణిక్యాలు వెలుగుతూనే ఉన్నాయి. అటువంటి అమూల్య వెలుగులు ప్రసాదించిన మణి మాణిక్యాలలో ఒకరు బూదరాజు రాధాకృష్ణ. భాషపై అపారమైన ప్రేమ, పరిశోధనా దృక్పథం, పాత్రికేయ శ్రద్ధ, రచనా నైపుణ్యంఈ నాలుగు మణిపూసలతో ఆయన నిర్మించిన జీవన మార్గం తెలుగు భాషాభిమానులకు మార్గదర్శిగా నిలిచింది. బూదరాజు రాధాకృష్ణ 1932 మే 3న ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య చీరాలలో, ఉన్నత విద్య విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సాగింది. భాషపై ఆసక్తితో "Historical Grammar of Early Telugu Inscriptions" అనే విషయంపై 1965లో డాక్టరేట్ పొందారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన భాషా అధ్యయనానికి చెందిన అపూర్వ కీర్తిగా గుర్తించబడింది. చీరాల వి.ఆర్.ఎస్. కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా తన ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన రాధాకృష్ణ, తర్వాత తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. భాషా ప్రామాణికతకు తోడ్పడే అనేక పుస్తకాలను ఈ సమయంలో సమీకరించారు. 1988లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన సేవా ధర్మం ముగిసి పోలేదుకావలసిన చోటా, అవసరమైన సమయంలో రచన ద్వారా ఆయన శబ్దజీవితమై మిగిలారు. పదవీ విరమణ అనంతరం "ఈనాడు" జర్నలిజం సంస్థ లో ప్రాచార్యులుగా పదేళ్ల పాటు సేవలందించారు. ఎంతోమంది యువ పాత్రికేయులకు భాషా శాస్త్రం, రచనా వ్యాకరణం బోధించి, వారిని సామాజిక పరిణతితో కూడిన రచయితలుగా తీర్చిదిద్దారు. "పుణ్యభూమి" శీర్షికతో 'సి. ధర్మారావు' కలం పేరుతో వందలాది వ్యాసాలు రాసారు. భాషా విలువ, సంస్కృతి పరంపర, చరిత్ర సంక్రమణ, సమకాలీన సమీక్ష వంటి అనేక అంశాలు ఆయన వ్యాసాల్లో పదునైన పరిశీలనతో కూడుకున్నవి. ఈ వ్యాసాలు ప్రజలలో పాఠనాభిరుచి పెంచేలా, ఆలోచనలను పెంచేలా ఉండేవి. తెలుగు భాషా శాస్త్ర పరిశోధనకు బూదరాజు కృషి విలువైనదిగా గుర్తించ బడింది. "వాస్తు పదకోశం", "వ్యవహార కోశం", "తెలుగు దినపత్రికల భాష" వంటి ప్రామాణిక రచనలు ఆయన మేధస్సుకు నిదర్శనాలు. నన్నయ పూర్వకాలపు శాసన భాషను అధ్యయనం చేసి, మాండలికాల వ్యాప్తిపై చేసిన విశ్లేషణ భాషా పరిశోధకులకు గొప్ప వనరుగా నిలిచింది. వ్యాకరణ నియమాలు, వినియోగ నిబంధనలు, భాషా అభివృద్ధిలో సమాజ పాత్ర వంటి అంశాలపై ఆయన వ్యాఖ్యానాలు అత్యంత విలువైనవిగా భావించ బడుతున్నాయి. రాధాకృష్ణ రచయితగా తెలుగుని ప్రభావవంతమైన భావ ప్రకటనకు ఒక పటిష్ఠమైన రూపకర్త. పాత్రికేయులకు మార్గదర్శకంగా "రచన రీతులు", "తెలుగుబడి" వంటి పుస్తకాలు రచించారు. మహాకవి శ్రీశ్రీ జీవితాన్ని ఆంగ్లంలో రచించి, స్వయంగా తెలుగులోకి అనువదించారు. "మరవరాని మాటలు" అనే గ్రంథంలో తెలుగు సాహిత్యంలోని అమూల్య సూక్తులను సంకలనం చేశారు. అంతేకాక, నోమ్ చాంస్కీ, కార్ల్ మార్క్స్, గుల్జార్ వంటి రచయితల రచనలను తెలుగులోకి అనువదించి భావానువాదానికి అర్థవంతమైన ప్రమాణాలు నెలకొల్పారు. జ్ఞానం, వినయం, మిత భాషణం, శ్రద్ధ అనే నాలుగు గుణాలతో ఆయన మానవీయత వెలిసింది. నుకల నారాయణ, కాళోజీ నారాయణరావు, న్యాపతి సుబ్బారావు వంటి ప్రముఖులతో ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయన సమాజాభిముఖ దృక్పథానికి ప్రతీకలుగా నిలిచాయి. విశేషమైన విషయ పరిపక్వత, పదాలను నాణ్యంగా ఉపయోగించే నైపుణ్యం ఆయన రచనలకు స్ఫూర్తినిచ్చాయి. బూదరాజు రాధాకృష్ణ జీవితం తెలుగు భాషకు అంకితమై, పరిశోధనతో నిండి, శ్రద్ధతో నడిచిన ఆత్మసాక్షాత్కార యాత్ర. ఆయన రచనలు నేటికీ తెలుగు అధ్యాపకులకు, పాత్రికేయులకు, తర్జుమకారులకు మార్గదర్శిగా నిలుస్తున్నాయి. తెలుగు భాషే తన ముక్తిపథం అని నమ్మి జీవితాంతం అదే వైపు నడిచిన బూదరాజు రాధాకృష్ణ , సాహిత్యాన్ని మానవీకరించిన సాహితీ వేత్త గానే నిలిచారు. ఆయన రచనలు భాషానురాగులకు ఆదర్శంగా, పాత్రికేయులకు పాఠశాలలా నిలిచాయి. తెలుగు భాషా పట్ల ఆయన కలిగిన భక్తిసజీవంగా శబ్దంలో, వాక్యంలో, వ్యాసంలోఇప్పటికీ స్పందిస్తోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# పెద్దాసుపత్రికి నూతన హంగులు

జగిత్యాల : ఎన్నో ఏళ్లుగా ఆధునీకరణకు నోచుకోకపోయిన జనరల్ ఆసుపత్రి ఎట్టకేలకు నూతన హంగులు సంతరించుకుంది. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని రూ.29 లక్షలతో ఆధునీకరించారు. మూడు నెలలుగా ఆసుపత్రిలో చేపట్టిన పనులు ముగింపు దశకు చేరాయి. జిల్లా ఆవిర్భావం తరువాత ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కేంద్ర ఆసుపత్రిగా.. ఆ తరువాత ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో అనుబంధంగా సాధారణ ఆసుపత్రిగా హోదాలు మారినా సదుపాయాలు విస్తరించలేకపోయారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆసుపత్రి వైద్యులతో సమీక్ష నిర్వహించి రూ.1.50 లక్షలు మంజూరు చేశారు. ఆసుపత్రి నిధులు రూ.29 లక్షలు వెచ్చించి ఆధునీకరణ పనులు చేపట్టారు.

**అత్యాధునిక సేవలు..**

ఆసుపత్రిలో కొన్నేళ్లుగా ఆక్సిజన్ ప్లాంటు నిర్వహణ లేక పనిచేయడం లేదు. సాంకేతిక నిపుణులతో మరమ్మతు చేపట్టడంతో పూర్తిస్థాయిలో రోగులకు ఆక్సిజన్ కొరత తీర్చడమే కాకుండా ప్రతినెలా కొనుగోలు వ్యయం రూ.లక్ష ఆదా అవుతోంది. ఆసుపత్రిలో 9 వెంటిలేటర్లున్నప్పటికీ తరచూ సాంకేతిక సమస్యలుండేవి వాటిని సైతం పూర్తిస్థాయిలో బాగు చేయించారు. రెండు జనరేటర్లలో ఒకటి మరమ్మతుకు గురికాగా ఆధునిక సాంకేతిక వినియోగించి రెండింటిని సరిచేసి రోగులకు నిరంతర విద్యుత్తు అందజేస్తున్నారు. కొత్తగా 7 వీల్‌చైర్లు, 5 స్ట్రెచర్లు కొనుగోలు చేశారు.ఆసుపత్రి భవనంలోపల వెలుపల రంగులు వేశారు. వరండాల్లో స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారగా మరమ్మతు చేశారు. గదులు, వార్డుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ)తో తీర్చిదిద్దారు.



ఆసుపత్రిలో ప్రధాన సమస్య పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోగా ప్రత్యేక మురుగుకాల్వలు నిర్మించారు. మూత్రశాలల పైపులైనుకు మరమ్మతు చేశారు. రోగులకు తాగునీరందించే శుద్ధజల యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు.

**90 శాతం పూర్తి: డాక్టర్ సుమన్‌రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్**

మూడు నెలలుగా ఆసుపత్రిలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. 90 శాతం మేరకు పూర్తయ్యాయి. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపడంతో పాటు ఆసుపత్రి నిధులు వెచ్చించి మరమ్మతు పనులు చేపట్టాం. అన్ని విభాగాల్లోనూ వైద్యులున్నారు. వైద్య కళాశాలలో 50 పడకల ఆసుపత్రి పూర్తయితే సేవలు అక్కడికి తరలించే అవకాశం ఉంది.

**సేవలు వినియోగించుకోవాలి: డాక్టర్ విజయ్, ఆసుపత్రి ఆర్ఎంవో**

ఆధునీకరణ తరువాత రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ వైద్యం, శస్త్రచికిత్సలు, ఫిజియోథెరపీ అన్నింట్లోనూ సేవలందిస్తున్నాం. క్యాజువాలిటీలో ఇన్‌ఫెక్షన్లు రాకుండా అధునాతన యంత్రం ఏర్పాటు చేశాం. వేసవి తీవ్రత దృష్ట్యా ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, కూలర్లు సైతం అందుబాటులో ఉంచాం.

# లీకేజీల 'పురం' పర

సూర్యాపేట : పురపాలికల్లో ఇంటింటికీ శుద్ధజలం అందిస్తామని మిషన్ భగీరథ పైపులైన్లు వేసి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. వచ్చేదే తక్కువ.. దానికి తోడు లీకేజీలతో నీరంతా వృథా అవుతోంది. వెరసి పట్టణవాసులు నీటిపాట్లు పడుతున్నారు. ఇక శివారు కాలనీల బాధలు చెప్పలేకుండా ఉన్నాయిజిల్లాలోని పురపాలికల్లో పరిశీలించింది..

**డిమాండ్ మేరకు సరఫరా లేక**

హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలో పలు కాలనీలకు 20 రోజులకోసారి నీరు రాని పరిస్థితి. పట్టణానికి 50 ఎంఎల్‌డీలు అవసరం కాగా 30 ఎంఎల్‌డీ మాత్రమే గ్రిడ్ నుంచి సరఫరా జరుగుతోంది. లీకేజీలతో అన్ని ప్రాంతాలకు సరిపోవటం లేదు. హుజూర్‌నగర్ పురపాలికలో 7,350 నల్లా కనెక్షన్లున్నాయి. ఇతర వనరులతో మరో 2,627 కనెక్షన్లకు నీరు అందజేస్తున్నారు. సీతారాంనగర్, అంబేద్కర్ కాలనీ ఇంకా పలు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారానైనా నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**అల్లాడుతున్న శివారు కాలనీలు**

సూర్యాపేట పట్టణంలోని బాషానాయక్‌తండాలో ఐదేళ్ల కిందట పైపులైన్ నిర్మించినా నేటికీ నీటి సరఫరా జరగటం లేదు. స్థానికంగా బోరునీటిని వినియోగించుకుంటున్నారు. తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. మానసనగర్, అంజనాపురి కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్ తదితర శివారు కాలనీకు నీటి సరఫరా సరిగా జరగటం లేదు. మిషన్ భగీరథ అధికారులు నిత్యం 19 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. బాషానాయక్‌తండాలో కనెక్షన్ అనుసంధానం చేయించి సరఫరా చేయిస్తామని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

**పైపులైన్లు దెబ్బతిని..**

నేరేడుచర్ల పురపాలికలో విలీన గ్రామాలైన రామగిరి, నర్సయ్యగూడెంలకు నీటి సరఫరా జరగడం లేదు. రామగిరి వద్ద పైపులైన్లు దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తేనే నీటి సరఫరా జరిగే అవకాశం లేదు. పైపులైన్ పగిలిపోవడంతో నర్సయ్యగూడెంకి చాలాకాలం మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో బోరు నీటితో ట్యాంకు నింపి నీరు సరఫరా చేస్తున్నారు. నర్సయ్యగూడెం పైపులైన్ మరమ్మతులు చేస్తామని భగీరథ ఏఈ శ్రీనాథ్, పురకమిషనర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

**కోదాడలో రోజు విడిచి రోజు**

పట్టణంలో రోజు విడిచి రోజు నీటిని ఇంటింటికి ఇస్తున్నారు. పట్టణానికి మొత్తం 12.55 ఎంఎల్‌డీ నీరు డిమాండ్ ఉన్నప్పటికీ కేవలం 6.5 ఎంఎల్‌డీ మాత్రమే వస్తోంది. నీరు సరిపోక బోరు నీటిని కూడా అధికారులు ఇంటింటికి ఇస్తున్నారు. అవి భగీరథ, బోరు, బావుల నీరా అర్థం కావట్లేదని జనం వాపోతున్నారు.

**నీటి లీకేజీలతో తిప్పలు**

తిరుమలగిరి పురపాలికకు మిషన్‌భగీరథ రావాల్సిన నీటి కంటే తక్కువగా వస్తున్నాయి. లీకేజీలు, పైపులైన్ పగుళ్లతో సుందరయ్యకాలనీ, అనంతారంలోని జంగాలకాలనీ, బీసీకాలనీలకు తరచూ నీటి సమస్యలు తలెత్తున్నాయి. వలిగొండ–తొర్రూరు రోడ్డువెడల్పు పనులతో పైపులైన్లు పగిలి బీసీకాలనీకి నీరు రావడం లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. మార్కెట్ యార్డు ఎదుట, మల్లీశ్వరి థియేటర్, తహసీల్దార్ కార్యాలయం వెళ్లేదారుల్లో లీకేజీలతో నీరు వృథాగా పోతుంది. మిషన్ భగీరథ సిబ్బందితో త్వరలో లీకేజీలు సరిచేస్తామని పురకమిషనర్ బి.యాదగిరి చెప్పారు.

# చెత్తే కదా అని పారబోస్తే..



కరీంనగర్ : కరీంనగర్ నగరానికి చెత్త సవాల్‌గా మారింది. ట్రాక్టర్ల కొద్ది వస్తున్న చెత్తను నిల్వ చేసేందుకు చోటు దొరకడం లేదు. ఏకైక డంపింగ్ యార్డు పూర్తిగా నిండింది. చెత్త మీద చెత్త పేర్చుకుంటూ పోవడం తప్ప ప్రత్యామ్నాయం లేకుండా పోతోంది. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 34 నెలల కిందట రూ.16.50 కోట్లతో ప్రారంభించిన బయోమైనింగ్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రస్తుతం ఆ పనులు కూడా నిలిపివేశారు. ఒకవైపు శుద్ధీకరణ లేకపోగా, మరోవైపు డంపింగ్ యార్డు కోసం స్థలాలు చూసినా స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంకేముంది చెత్త పెరగడం తప్ప, తగ్గకపోవడంతో అధికారులకు సవాల్‌గా మారింది.

**మండుతున్న డంపింగ్ యార్డు**

చెత్త నిల్వలు డంపింగ్ యార్డులో భారీగా పేరుకుపోగా ఆ చెత్త మండుతోంది. నాలుగైదు రోజులుగా పొగ విపరీతంగా వస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రజలు, సమీప దుకాణ యజమానులు, కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గాలి ఏ వైపు వీస్తే ఆ వైపు దుర్వాసన, పొగ వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూడా మంటలు చెలరేగడంతో ఫైరింజన్ రప్పించి మంటలు ఆర్పించారు. జెట్టింగ్ మిషన్‌తో నీటిని పట్టిస్తున్నారు.

**ఏ ట్రాక్టర్‌లోనైనా చెట్ల కొమ్మలే**

విద్యుత్తు శాఖ అధికారులు చెట్ల కొమ్మలను కొట్టి రోడ్ల మీద పడేస్తున్నారు. వీటిని పారిశుద్ధ్య కార్మికులు తీసుకొచ్చి డంపింగ్ యార్డులో పడేస్తున్నారు. ఏ ట్రాక్టర్‌లో చూసినా ఈ చెట్ల కొమ్మలే ఉన్నాయి. ఆకులు ఎండిపోయి చెత్త కాలుతోంది.

**నిలుస్తున్న వాహనాలు**

రోజూ డివిజన్ల వారీగా వస్తున్న ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు డంపింగ్‌యార్డు దగ్గర గంటల తరబడి క్యూలో ఉంటున్నాయి. ఒక్కో ట్రాక్టర్ చెత్త గుట్టను ఎక్కి తిరిగి వచ్చే సరికి అధిక సమయం పడుతోంది. రెండు ట్రిప్పులు చేయాల్సిన ట్రాక్టర్ ఒక ట్రిప్పు చేసే సరికే మధ్యాహ్నం దాటుతోంది. స్వచ్ఛ ఆటో పరిస్థితి అలాగే ఉండటంతో రెండు రోజులుగా చెత్తను షెడ్డులో పోయిస్తున్నారు. వారం రోజులుగా చెత్తను పక్కకు జరిపే జేసీబీ యంత్రం పాడైంది. దాంతో కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. దీని ప్రభావం డివిజన్లలో చెత్త సేకరణపై పడుతోంది.

**ఆలోచనలు.. ప్రతిపాదనలు**

డంపింగ్ యార్డులో చెత్తను తగ్గించేందుకు, సమస్యను నివారించేందుకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యామ్నాయం వైపు ఆలోచన చేస్తూ ముందుకెళ్తున్నారు.మంటలు రాకుండా, పొగ వ్యాపించకుండా ఉండేందుకు నాలుగు వైపులా నాలుగు బోర్లు వేసి ఎప్పటికి నీటి తడి ఉంచేందుకు ప్రతిపాదనలు చేశారు.సిమెంట్ కంపెనీతో మాట్లాడి కొంతమేర చెత్తను ఇక్కడి నుంచి తరలించేలా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.అగ్నిమాపక శాఖ అధికారులు నిరంతరంగా నీటిని పట్టేందుకు చొరవ చూపాలని ఆదేశాలు ఇచ్చారు.

# లారీకి ఇంత.. తరుగు పేరిట కోత



గంగాధర: ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారు. రోజుల తరబడి ధాన్యం అమ్ముకునేందుకు నిరీక్షించిన అన్నదాతలను కొనుగోలు చేసే సమయంలో ఎక్కువ తూకం వేసి తర్వాత, మిల్లుల్లో దింపే సమయంలోనే తరుగు పేరిట కోత విధిస్తున్నారు. వాస్తవానికి సంచి బరువు 600 గ్రాములు ఉండగా, సంచి బరువుపోగా 40.600 కిలోల తూకం వేయాలి. కానీ.. ధాన్యం శుభ్రం చేయడంలేదని జిల్లా అంతటా బస్తాకు 42.200 చొప్పున తూకం వేస్తున్నారు. ఇందుకు రైతులు కూడా చేసేదేమిలేక మిన్నకుంటున్నారు.

గంగాధరలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం ఈనెల 23న లారీలో 814 బస్తాలు లోడింగు చేసి మిల్లుకు పంపించారు. మిల్లులో ధాన్యం దింపాక తరుగు పేరుతో ట్రక్‌షీట్‌లో కొట్టివేసి 13 బస్తాలు తగ్గించి రాశారు. అంటే 5.20 క్వింటాళ్ల ధాన్యం కోత విధించారు. ఈ లెక్కన రైతులకు రూ.12,064 నష్టం జరిగింది. తరుగు పేరుతో దోపిడీకి పాల్పడ్డారని గంగాధరకు చెందిన రైతు చిరుత కిషన్ ఆందోళన వ్యక్తం చేశారు.

మిల్లుకు పంపించాక అదనంగా తరుగు, ఇతర కారణాలతో లారీకి ఇన్ని బస్తాల చొప్పున అంటూ కోత విధిస్తున్నారు. క్వింటాలుకు తక్కువలో తక్కువ 4 నుంచి 6 కిలోలు అదనంగా దోచుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16.10 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు అధికారులు నిర్ణయించగా, ఎంత పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతుందో ఊహించుకోవచ్చు. కొన్ని చోట్ల కామన్ కింద ధాన్యం దింపుకొని క్వింటాలుకు రూ.20 తక్కువ చెల్లిస్తున్నారు. విచిత్రమేమిటంటే మిల్లుల్లో కోత పెట్టిన ధాన్యం బస్తాలకు కొనుగోలు కేంద్రాల్లో హమాలీలకు రైతుల నుంచి ఖర్చులు మాత్రం వసూలు చేయడం కొసమెరుపు.

నమోదులో జాప్యం.. పైకానికి పాట్లు

ధాన్యం అమ్ముకోవడంలో అపసోపాలు పడ్డ రైతులు పైకానికి రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మిల్లులో దింపాక రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఆయా కేంద్రాల నిర్వాహకులు జాప్యం చేస్తున్నారు. ఫలితంగా అన్ని ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినా రైతులు రోజుల తరబడి ధాన్యం డబ్బులు జమకాక ఇబ్బందులకు గురవుతున్నారు. విక్రయించిన 48 గంటల్లోనే డబ్బులు జమ చేస్తామని పాలకులు, ఉన్నతాధికారులు చెబుతున్నా.. అందుకు విరుద్ధంగా జరుగుతోంది.

కరీంనగర్ జిల్లాలో 339 కేంద్రాల ద్వారా 3.60 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 329 కేంద్రాల ద్వారా 4.50 మె.ట, సిరిసిల్లలో 246 కేంద్రాల ద్వారా 3.00 మె. ట, జగిత్యాలలో 424 కేంద్రాల ద్వారా 5.00 మె.ట. ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 30 శాతం ధాన్యం సేకరించగా, వచ్చే నెల 15 వరకు కొనుగోళ్లు సాగనున్నట్లు తెలుస్తోంది. ధాన్యంలో కోతలు విధించకుండా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చూడాలని రైతులు కోరుతున్నారు.

# ఇంతి కోసం.. కొంత సమయం

చిట్యాల : వేసవి సెలవులను తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి సద్వినియోగం చేసుకుంటున్నారు ఉమ్మడి జిల్లా యువతులు, మహిళలు. నిత్యజీవితంతో కంప్యూటర్ వినియోగం సాధారణం కావడంతో ఆ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని యోచిస్తున్నారు. యువతులు కంప్యూటర్ శిక్షణ కేంద్రాలకు హాజరవుతుండగా, పిల్లలు, భర్త, ఇంట్లో పెద్దవాళ్లకోసం తమ సమయం అంతా బిజీబిజీగా గడిపిన యువ గృహిణులు వేసవి సెలవులు రావడంతో వారు కంప్యూటర్ విద్యను అభ్యసించడానికి శిక్షణ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

**ఉన్నత విద్యకు ప్రత్యామ్నాయంగా**

గట్టు ఉమ, బీఎస్సీ (వ్యవసాయం) పల్లివాడ, రామన్నపేట మండలం

బీఎస్సీ (వ్యవసాయం) పూర్తికాగానే ఉన్నత విద్యాభ్యాసం చేయడానికి ఆర్థిక స్థోమత లేక ఆగిపోవాల్సి వచ్చింది. కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉంటాయని తెలిసి కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నాను. డాటాబేస్, డాటా ఎంట్రీ, ఎక్సెల్, కోడింగ్ వంటివి నేర్చుకుంటున్నాను.

**కుటుంబానికి చేదోడుగా ఉంటుందని**

జి.సంధ్య(గృహిణి), వెలిమినేడు, చిట్యాల మండలం

ఇంటర్ పూర్తికాగానే వివాహం అయ్యింది. మాకు ఇద్దరు పిల్లలు, వారికోసం కొంతకాలం ఖాళీగా ఉన్నాను. పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకుని, కంప్యూటర్ విద్యను నేర్చుకుంటున్నాను. ఏదైనా ఉద్యోగ, ఉపాధి అవకాశం లభిస్తే కుటుంబానికి ఆర్థికంగా చేదోడుగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నాను.

**రోజు 8 గంటలు సాధన చేస్తున్నాను**

నున్నగోపుల భవాని, బీఎస్సీ, శివన్నగూడెం, మర్రిగూడ మండలం, నల్గొండ జిల్లాప్రస్తుత కాలంలో ఏ రకమైన ఉద్యోగం కావాలన్నా, కంప్యూటర్ పరిజ్ఞానం



ఉందా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో తప్పనిసరి కావడంతో కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్నాను. రోజూ 8 గంటల పాటు సాధన చేస్తున్నాను. కనీస పరిజ్ఞానం ఉంటే కొత్తగా వచ్చే కోర్సులను సులభంగా నేర్చుకోవచ్చు.

**అవకాశాల్లో పోటీ పడాలని**

రాపోలు మౌనిక (గృహిణి), వెలిమినేడు, చిట్యాల మండలం

ఇంటర్ పూర్తికాగానే పెళ్లికావడంతో కొంతకాలం ఖాళీగా ఉన్నాను. ఇంటిపట్టును ఖాళీగా కూర్చోవడం ఇష్టంలేదు. మా గ్రామ పరిసరాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలంటే కంప్యూటర్ పరిజ్ఞానంతో పోటీ పడొచ్చని భావించి చిట్యాలలో శిక్షణ తీసుకుంటున్నాను.

**వైద్యరంగంలో అవసరం అని**

చాపల మౌనిక, మునిపంపుల, రామన్నపేట మండలం

బీఫార్మసీ పూర్తిచేసి, కొంతకాలం ప్రైవేటుగా ఫార్మాసిస్టుగా పనిచేశాను. పాప పుట్టడంతో ఉద్యోగాన్ని వదిలేయాల్సి వచ్చింది. ప్రస్తుతం వైద్యరంగంలో కంప్యూటర్ సాంకేతికత ఆధారంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నందున భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కంప్యూటర్ విద్యలో శిక్షణ పొందుతున్నాను.

# గూడు లేక.. గోడు..!

నల్గొండ : పేదలకు సొంతింటిని సమకూర్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పదేళ్లయినా పూర్తి కావడం లేదు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వీటిని నిర్మించాలని సంకల్పించి.. రెండు విడతలుగా ఇళ్లు మంజూరు చేసినా కొన్ని ఇళ్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణం చేపట్టినవి పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో పూర్తయినా లబ్ధిదారులను ఎంపిక చేసి అప్పగించలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి.

జిల్లాలో 8,155 ఇళ్లు మంజూరు చేశారు. 2859 పూర్తైనా మౌలిక వసతులు కల్పించలేదు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.30 లక్షలు మంజూరు చేసింది. రూ.75 వేలను మౌలిక వసతులకు కేటాయించింది. ఈ నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో పనులు జరగడం లేదు. రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించలేదు.

జిల్లాలో 2859 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తైంది. ఇప్పటివరకు 908 మంది లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయి ఐదేళ్లు అయినా మౌలిక వసతులు కల్పించడం లేదు. దీంతో దర్వాజలు, కిటికీలు చెదలు పడుతున్నాయి. గృహాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాలు తస్కరణకు గురవుతున్నాయి. దరఖాస్తులు అధికంగా రావడం, ఇళ్లు తక్కువగా ఉండటంతో ఎంపిక చేపడితే పేదల నుంచి సమస్య ఏర్పడుతుందని గత ప్రభుత్వం కాలయాపన చేసింది. ఈలోపు కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండుపడక గదుల ఇళ్ల వ్యవహారం పూర్తిగా మరుగునపడింది. నల్గొండ పట్టణంలోని గొల్లగూడలో 522(జీ2) గృహాలను నిర్మించారు. వీటిలో తాగునీటి వసతి కల్పించలేదు. రోడ్లు, మురుగుకాల్వలను నిర్మించలేదు. లబ్ధిదారులను ఏడాది క్రితం ఎంపిక చేసినా.. వారికి ఇళ్లు అప్పగించలేదు.

కనగల్ మండలం పొనుగోడులో 75, నల్గొండ మండలం అన్నారెడ్డిగూ



డెంలో 75 చొప్పున ఇళ్లను నిర్మించారు. వసతులు కల్పించినా.. లబ్ధిదారులకు అప్పగించడం లేదు. నల్గొండ మండలం దోమలపల్లిలో 70, తిప్పర్తిలో 100(జీ2), కనగల్ మండలం చర్లగౌరారంలో 70 ఇళ్ల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.

దేవరకొండ నియోజకవర్గంలో 13 గ్రామాల్లో 824 గృహాల నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి అప్పగించారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, మురుగుకాలువల వసతి లేక వారు అనేక అవస్థలు పడుతున్నారు.

మిర్యాలగూడ నియోజకవర్గంలో గుమస్తా కాలనీలో 560 (జీ2) గృహాలు పూర్తి అయ్యాయి. లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి అప్పగించలేదు. నకిరేకల్ నియోజకవర్గంలో నార్కట్‌పల్లిలో 64(జీ2) గృహాలను పూర్తి చేశారు. బి.వెల్లంలలో 150(జీ1), అవురవాణిలో 80(జీ1) ఇళ్లను నిర్మించారు. ఇంకా తాగునీరు, రోడ్లు, మురుగుకాల్వల పనులు పూర్తి చేయలేదు. చిట్యాలలో 180(జీ1) గృహాలు నిర్మించి వసతులు కల్పించలేదు. ఇనుప కిటికీలు, దర్వాజలు తస్కరణకు గురవుతున్నాయి.మునుగోడు నియోజకవర్గంలో నారాయణపురం మండలం సర్వేల్‌లో 20, చౌటుప్పల్ మండలం మల్యాపూర్‌లో 40 చొప్పున ఇళ్ల నిర్మాణం పూర్తిచేశారు.

# బీమాతోనే.. ధీమా

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో సింహభాగం వ్యవసాయ ధారితమే. ఇక్కడ శాశ్వత జలవనరులూ తక్కువే. ఎక్కువ భాగం రైతులు వర్షాధారంతోపాటు బోర్లు, బావుల్లోని నీటి ద్వారానే ఆయా పంటలను సాగు చేస్తుంటారు. గత దశాబ్దకాలంగా ఈ జిల్లాలో ప్రతి సీజన్‌లో వడగళ్ల వాన రైతాంగాన్ని కుంగదీస్తుంది. ఫలితంగా ఏప్రిల్, మే నెలలు వచ్చాయంటే పంట చేతికి వస్తుందా..? లేదా..? ఆకాశం వంక బిక్కుబిక్కుమని చూస్తుండటం పరిపాటి అని చెప్పవచ్చు.

ఇటీవల బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆలేరు, రాజపేట, గుండాల మండలాల్లోనూ వడగళ్ల వానతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం తాజాగా రానున్న సీజన్ నుంచి పంటల బీమా అమలు చేయనున్నట్లు ప్రకటించడం ఇక్కడి రైతులకు బహుళ ప్రయోజనకరమని చెప్పవచ్చు. జిల్లాలో గతంలో 2016 నుంచి 2020 వరకు ఫసల్‌బీమా పథకం అమలులో ఉండేది. అప్పుడు చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించేవారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంటల బీమా అమలు చేస్తామని తెలిపినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది.

**సాగు సమయంలోనే మేలు..**

సాగు సమయంలోనే రైతులు వాటికి బీమా చేసుకుంటే.. వడగళ్లు కురిసినా, వర్షాలు లేక పంటలు ఎండిపోయినా ఉపయోగం ఉంటుంది. ఎకరాకు రూ.500 ప్రీమియం చెల్లిస్తే చాలు నష్టపోయిన సమయంలో రూ.వేలాదిగా డబ్బులు వస్తుండేవి. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న సమయంలో ప్రీమియం డబ్బులు తీసుకునేవారు. దీంతో ప్రత్యేకంగా రైతులు చెల్లించాల్సిన అవసరం లేదు. గతంలో బీమా కింద ఎకరాకు వరికి రూ.37,484, పత్తికి రూ.36,282, మొక్కజొన్నకు రూ.18,742 పరిహారం వచ్చేది. రానున్న రోజుల్లో పంట నష్టపోతే పరిహారం వచ్చి మేలు జరుగుతుంది.

**ఈసారి పక్కాగా నిర్వహణ..**

పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సాంకేతికత ఆధారంగా దిగుబడి అంచనాల రూపకల్పన, నష్టపోయిన పంట విషయంలో బీమా కంపెనీలు సత్వరమే పరిహారం అందించేలా విధివిధానాలను రూపొందించనున్నారు. దిగుబడి ఆధారిత బీమా పథకం కింద వరి, మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, నువ్వులు మొదలైన పంటలు, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పత్తి, మిరప, మామిడి, ఆయిల్‌పామ్, టమాట, బత్తాయి పంటలకు బీమా వర్తింపజేయాలని ప్రభుత్వ వర్గాలు యోచిస్తున్నాయి.

**జిల్లా సమాచారం..**

| | |
|---|---|
| వ్యవసాయ క్లస్టర్లు: | 91 |
| సాధారణ సాగు: | 4,38,534 |
| రైతుల సంఖ్య: | 1,97,206 |

చురకలు



# జల‘గల్లా’..!

మొయినాబాద్ : ఐటీ కారిడార్‌లో తాగునీటి ఎద్దడిని సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కుల బరితెగింపునకు నిదర్శనమిది. ప్రభుత్వ స్థలాలు, జంట జలాశయాల సమీపంలోని భూముల్లో బోర్లు వేసి యథేచ్ఛగా నీళ్లు తోడేస్తున్నారు. ట్యాంకర్‌కు రూ.2వేల – రూ.4వేలు వసూలు చేసుకుంటూ నిత్యం రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. అధికారులు బిజీగా ఉండటంతో పాటు విద్యుత్‌శాఖ అధికారులను మచ్చిక చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జలమండలి సరఫరా చేస్తున్న నీరు సరిపోకపోవడంతో అక్రమార్కులు అవకాశంగా మలుచుకుంటున్నారు. గండిపేట్ మండలం హిమాయత్‌సాగర్‌లోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 69, 70లలో కొందరు అక్రమార్కులు ఐదారు బోర్లు వేశారు. తాత్కాలికంగా నీటితొట్టెలు ఏర్పాటు చేసి వాటిలోకి నీళ్లు తోడేస్తూ నాలుగు ట్యాంకర్లతో రోజంతా సరఫరా చేస్తున్నారు. 12 రోజుల క్రితం గండిపేట్ రెవెన్యూ అధికారులు ట్యాంకర్లను సీజ్‌చేశారు. రెండురోజులు నీటి వ్యాపారం నిలిపేశారు. మళ్లీ బోర్లతో హిమాయత్‌సాగర్ నీటిని తోడేస్తున్నారు.అధికారులు సోమవారం బోర్లు సీజ్ చేశారు.శేరిలింగంపల్లి మండలం హఫీజ్‌పేట్‌లో నీటి వ్యాపారం చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు భూగర్భ జలాలను తోడేందుకు బోరు వేశారు. మార్కెట్లో నీళ్లను ట్యాంకర్ల ద్వారా విక్రయించారు. అదిచూసి మరికొందరు మరోచోట బోరు వేశారు. అధికారులు వాటిని సీజ్ చేశారు.

**తొట్టెల్లో నింపి...**

గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్ మండలాల్లో ఖాళీ స్థలాలు, చెరువులు, జంట జలాశయాల సమీపంలో ఒకేచోట నాలుగైదు బోర్లు వేస్తున్నారు. అనంతరం భారీగా గుంత తవ్వుతున్నారు. గట్టి ప్లాస్టిక్, టర్పాలిన్‌తో గుంతను కప్పి నీటి తొట్టెగా చేస్తున్నారు. రాత్రి వేళల్లో బోర్ల నుంచి నీటిని తొట్టెలోకి మళ్లించి ట్యాంకర్లలో నింపి ఐటీ కారిడార్‌కు పంపుతున్నారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల సమీపంలో నేరుగా పైపులు వేసి బోర్లతో ట్యాంకర్లు నింపి నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లోని అపార్ట్‌మెంట్లకు సరఫరా చేస్తున్నారు. శంషాబాద్ కామునిచెరువు నుంచి మోటార్లతో ట్యాంకర్లను నింపుకొని శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

**నిరంతర నిఘా.. – ఎన్.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్, గండిపేట**

ప్రభుత్వ భూముల్లో బోర్లు వేయకుండా నిఘా ఉంచాం. ఎప్పటికప్పుడు బోర్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు సుమారు వందకుపైగా బోర్లను సీజ్‌చేశాం.

**హద్దుమీరితే చర్యలు – వెంకారెడ్డి, తహసీల్దార్, శేరిలింగంపల్లి**

ఐటీ కారిడార్‌లో తాగునీటి కొరత ఉంది. కొందరు బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్నారు. వారిని పిలిపించి ఇప్పటికే హెచ్చరించాం. 17 ప్రాంతాల్లో బోర్లను సీజ్‌చేశాం.

# ఐదు రోజుల్లోనే అనుమతులు

హైదరాబాద్: అనుమతుల్లో కాలయాపనకు ఆస్కారం లేకుండా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ‘ఆటో రెన్యువల్’కు అవకాశమిస్తోంది. ఐదు రోజుల్లోనే అనుమతులు జారీ అయ్యేలా మార్గదర్శకాలుండగా పరిశ్రమల నిర్వాహకులు ఆమడ దూరం ఉంటున్నారు.

**గడువుకు నెల రోజుల ముందే..**

పీసీబీ అధికారిక వెబ్‌సైట్‌లో టీజీపీసీబీ అప్లికేషన్ విభాగంలో ‘ఆటో రెన్యువల్’ మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రెడ్, ఆరెంజ్, గ్రీన్ కేటగిరీ విభాగంలోని పరిశ్రమల నిర్వాహకులకు ఈ వెసులుబాటు కల్పించారు. ః అనుమతుల రెన్యువల్‌కు నెల రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. ఏడాది ఫీజు, బ్యాంకు గ్యారంటీలు చెల్లించాలి.

పీసీబీ నిర్దేశించిన ప్రమాణాలు పాటిస్తానంటూ సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇవ్వాలి. పరిశ్రమ పేరు, చిరునామా తదితర వివరాలు నమోదు చేసిన తర్వాత అనుమతి జారీచేసే అధీకృత అధికారికి సమాచారం వెళ్తుంది. అనంతరం సంబంధిత ప్రాంతీయ అధికారి నుంచి నివేదిక తెప్పించి, ఎలాంటి చర్యలు తీసుకోలేదని నిర్ధారించుకున్నాక అనుమతులు జారీ అవుతాయి.ఐదేళ్ల గడువుతో అనుమతి లభిస్తుండగా ఏటా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిలోపు న్యాయపరమైన చర్యలు తీసుకున్న పరిశ్రమలు, మూసివేత ఆదేశాలు జారీ అయిన పరిశ్రమలు ఆటోరెన్యువల్‌కు అనర్హులు.

**ప్రమాణాలు పాటించకపోతే రద్దు..**

టీఎస్‌ఐపాస్‌లో ఓటీఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రెడ్ కేటగిరీ అయితే 21 రోజులు, ఆరెంజ్ కేటగిరీ అయితే 14 రోజుల్లో అనుమతులు జారీ అవుతాయి. ఆటో రెన్యువల్ ప్రక్రియ పూర్తయి పీసీబీ అధికారులు తనిఖీలు చేసి ప్రమాణాలు పాటించడం లేదని గుర్తిస్తే ఆటో రెన్యువల్‌ను రద్దు చేయడంతోపాటు పరిశ్రమ మూసివేతకు ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది.

# పరిస్థితులు అనుకూలం.. పరిశ్రమ అవసరం

వికారాబాద్ : రాష్ట్రంలో మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తాం. వాటిలో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామిక వేత్తలకు పదిశాతం కేటాయిస్తాం.ఎంఎస్ఎంఈ –2024 ఏ టోకెన్ ఆఫ్ గ్రాటిట్యూడ్ టు గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటన. గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్ది కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం– మహిళా శక్తి క్యాంటీన్ల ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క. అట్టడుగు వర్గాల మహిళల అభివృద్ధికి తోడ్పాటునందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, బస్సుల నిర్వహణ, విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టడం, సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు బాధ్యత అప్పగించింది. తాజాగా మినీ ఇండస్ట్రియల్ పార్కులను కూడా చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. తద్వారా మహిళా సాధికారతను సాధించాలన్నది సర్కారు సంకల్పం. ఇదే విషయాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేసిన ప్రకటనతో జిల్లా వాసుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

**మార్కెట్‌కు ఢోకా లేదు**

బీజాపూర్ –హైదరాబాద్ జాతీయ రహదారికి అత్యంత సమీపంలోనే పారిశ్రామిక వాడ ఉంది. అందుబాటులోనే మిషన్ భగీరథ భారీ నీటి ట్యాంకులు ఉన్నాయి. దీంతో పాటు పవన విద్యుత్తు ఉత్పత్తి కూడా జరుగుతోంది. పొదుపు సంఘం సభ్యులు ఉత్పత్తులు చేపడితే మార్కెటింగ్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆ దిశగా వెంటనే అడుగులు పడాల్సి ఉంది.

**అందరూ జిల్లాకు చెందిన వారే..**

రాకంచర్లలో గార్మెంట్ సిటీ ఏర్పాటుకు జిల్లా మహిళలు సంవత్సరాలుగా విన్నవిస్తున్నారు. జిల్లాకు చెందిన వ్యకుల్లో ఒకరు ముఖ్యమంత్రిగా, మరొకరు స్పీకరుగా ఉండటం, ఇంకొకరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేగా ఉండటంతో దృష్టిపెడితే ఏర్పాటు చేయడం సులభమనేది మహిళా సంఘాల అభిప్రాయం.

# నెల రోజుల్లో స్కైవాక్ సిద్ధం!



హైదరాబాద్ : ఏళ్లనాటి పాదచారుల కష్టాలకు నెల రోజుల్లో పరిష్కారం లభించనుంది. జూన్ నాటికి మెహిదీపట్నం స్కైవాక్ పనులు పూర్తి చేయాలని హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రెండు వైపులా వాక్‌వే పనులు కొంతవరకు కొలిక్కి వచ్చాయి. మెహిదీపట్నం బస్టాండ్ వద్ద నిర్మించే వాణిజ్య ప్రాంతం పనులు వేగంగా సాగుతున్నాయి. స్కైవాక్ ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా.. రక్షణ శాఖ కోరిన దస్త్రాల సమర్పణ, ఇతర కారణాలతో ఆలస్యమైంది. ఇప్పటికే సంబంధిత శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఇటీవలే పనుల్లో వేగం పెరిగింది.

**ప్రత్యేకతలు ఇవీ..**మొత్తం 3,380 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్కైవాక్ డిజైన్ చేశారు. దీని కోసం రూ.32.97 కోట్లు వెచ్చిస్తున్నారు. మెహిదీపట్నం బస్‌బే నుంచి రైతుబజార్, వివిధ మార్గాల నుంచి పాదచారులు రాకపోకలు సాగించవచ్చు. మొత్తం 5 ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు అందుబాటులోకి తేనున్నారు. రెండు వైపులా రెండు టన్నెల్ మార్గాలు అందుబాటులోకి రానున్నాయి.

ముంబయి హైవేలో అత్యంత కీలకమైన రైతుబజార్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు స్కైవాక్ నిర్మిస్తున్నారు. 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాణిజ్య ప్రాంతం అభివృద్ధి చేస్తున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉన్న మెహిదీపట్నం జంక్షన్ దాటేందుకు ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడనుంది.

మెహిదీపట్నం బస్టాప్‌తోపాటు రైతుబజార్ ప్రాంతం అత్యంత రద్దీగా ఉంటుంది. రోజూ వేలాది మంది ఇక్కడ రోడ్డు దాటుతుంటారు. ఈ సమయంలో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో పాదచారులకు వాహనాలు ఢీకొని గాయాలపాలవుతున్నారు. దీంతో హెచ్ఎండీఏ ఇక్కడ స్కైవాక్ ప్రతిపాదించింది.

ఎలివేటర్లు, 2 ఇంటర్మీడియట్ టన్నెల్ వాక్‌లు, రైతుబజార్, డిఫెన్స్ కాంపౌండ్ వాల్, బస్‌బే ఏరియా, ఆసిఫ్‌నగర్ ఠాణా, రేమాండ్ షోరూం ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు.

వాణిజ్య ప్రాంతంలో కాఫీ షాపులు, వివిధ రకాల లాంజ్‌లు ఏర్పాటు చేసి వాటిని అద్దెకిచ్చి ఆదాయాన్ని పొందేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం టన్నెల్ మార్గాల పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు.

# ‘ఖజానా’చుట్టూ.. కాసుల గుట్టు!



కరీంనగర్: కోరుట్లకు చెందిన కోర్టు కానిస్టేబుల్ తన సీపీఎస్ ఫండ్ నుంచి రూ.లక్ష తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. డబ్బు చేతికొచ్చాక తనకు రూ.7 వేలు ఇవ్వాలని జగిత్యాల ఖజానా శాఖలో పని చేసే జూనియర్ సహాయకుడు డిమాండ్ చేశారు. పని పూర్తయిన తరువాత పదే పదే ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని వేధించడంతో కానిస్టేబుల్ అవినీతి నిరోధకశాఖ అధికారుల్ని ఆశ్రయించారు. దీంతో ఈ నెల 11న లంచం డబ్బులు తీసుకుంటున్న జూనియర్ సహాయకుడిని అనిశా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉమ్మడి జిల్లాలోని ఓ జిల్లా ఖజానా శాఖలోని ఉన్నతాధికారిపై తరచూ అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈయన పని చేసిన ఓ జిల్లాలో అక్కడి ఖజానా శాఖ సిబ్బందిని ప్రతి పనికి డబ్బులు అడగాలని ఒత్తిడి చేయడంతో సిబ్బంది అంతా ఆయన వైఖరిపై ఆందోళన చేపట్టిన సందర్భాలున్నాయి. బదిలీ వేటుతో ఇక్కడికి వచ్చినా.. ఆ సారు తీరు మారలేదని సొంత శాఖలోనే చర్చ జరుగుతోంది. కుటుంబ, వితంతు పింఛన్‌దారులకు లేనిపోని మెలికలు పెడుతూ వారిని కార్యాలయం చుట్టూ తిప్పించుకుని కాసులు దండుకుంటారన్న పేరు ఉంది.

కరీంనగర్ ఖజానా శాఖలో ఇలాగే ఓ కుటుంబ పింఛన్ డబ్బుల విషయంలో లేనిపోని కొర్రీలు పెట్టారు. బాధితురాలిని ఇరకాటంలో పెట్టే విధంగా గుర్తుతెలియని వ్యక్తి పేరిట ఓ లేఖను సృష్టించి ఆ ఫిర్యాదు ఆధారంగానే ఆమెకు రావాల్సిన పెద్ద మొత్తం డబ్బును రాకుండా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ ఉదంతంపై ఉన్నతాధికారులు గతేడాది సెప్టెంబరులో విచారణ చేపట్టారు. కింది స్థాయి ఉద్యోగి ఒకరు ఆ అబాంఢాన్ని తనపై వేసుకున్నారన్న చర్చ ఆ శాఖలో సాగుతోంది.

ఉమ్మడి జిల్లాలోని ఖజానా శాఖ ఉద్యోగుల్లో కొందరికి పైసల జబ్బు పట్టుకుంది. సహచర ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులనే జాలి, కరుణ లేకుండా అందినకాడికి దండుకుంటున్నారు. ఇటీవల జగిత్యాలలో ఓ ఉద్యోగి పట్టుబడిన ఉదంతంతో ఈ శాఖలో జరుగుతున్న తంతు వెలుగులోకి వచ్చింది. కొందరు ఉద్యోగుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నా ఇదంతా తమకు షరా‘మామూళ్ల’ వ్యవహారమేనని వారు తేలిగ్గా తీసిపారేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, గుత్తేదారులు, పింఛన్‌దారులు ఇలా ఎవరినీ వదలకుండా కమీషన్ల రూపంలో కాసులను దండుకుంటున్నారు.

**ఎవరినీ వదలరూ!**

ఇటీవల కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారి సర్వీసు ఎంట్రీ, ఐడీ, ప్రాన్ నంబర్ కేటాయింపు కోసం ఒక్కొక్కరి వద్ద రూ.1500 వసూలు చేశారనే ఆరోపణలు కొన్ని జిల్లాల్లో వినిపించాయి. పని కావాలంటే ఇవ్వక తప్పదనే తీరుతో అడిగినంతా ఇచ్చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సప్లిమెంటరీ జీతాలు, ఇంక్రిమెంట్లు, ఏరియర్స్, సరెండర్ పీఎఫ్, జీపీఎఫ్‌లు ఇతర చెక్కులు, బిల్లుల పాసుల విషయంలో కొర్రీలు పెడుతున్నారు. మంజూరు కావాల్సిన మొత్తం ఆధారంగా 2–3 శాతం కమీషన్లు అడుగుతున్నారు. ఇక గుత్తేదారుల బిల్లులకు సంబంధించిన వాటి విషయంలో చేతివాటాలు ఎక్కువగా ఉంటున్నాయి. కళాశాలలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల మంజూరు సమయంలో కమీషన్ ఇవ్వడం ఆధారంగానే బిల్లులు మంజూరు అవుతాయని ఆయా వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా కలెక్టరేట్‌లలో కొలువుదీరి ఉన్న ఈ ఖజానా శాఖల్లోని వ్యవహారాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరిగితేనే వారి చేతివాటాల జోరు తగ్గే అవకాశముంటుంది.

# గుంతల మార్గంలో ప్రయాణ చింత



మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు రహదారి విస్తరణ.. ప్రతిపాదనలకే పరిమితమైంది. అధ్వానంగా ఉన్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేసినా వందలాది వాహనాల రాకపోకలతో పరిస్థితి మొదటికొచ్చింది. గుంతలమయమైన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మంథని మండలం రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామాలను సింగరేణి సంస్థ స్వాధీనం చేసుకొని స్థానికులకు పునరావాసం కల్పించింది. కాలనీ వరకు వేసిన సింగిల్ తారు రోడ్డును ఆర్‌అండ్‌బీకి గాని, పంచాయతీ రాజ్ శాఖకు గాని అప్పగించకపోవడంతో మరమ్మతుకు, విస్తరణకు నోచుకోలేదు. రెండు వరుసలుగా విస్తరించాలని స్థానికులు చాలా సార్లు సింగరేణి అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి వరకు 2 కిలోమీటర్ల దూరం రహదారిపై దాదాపు ఎనిమిది మలుపులున్నాయి. అదే చోట గుంతలు పడటంతో దాదాపు వారానికి ఒకటి చొప్పున ప్రమాదాలు జరుగుతున్నాయి.

**నాడు 20.. నేడు వెయ్యి**

గతంలో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు మట్టి దారి ఉండేది. పదేళ్ల కిందట సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులో అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కెపల్లి భూ నిర్వాసితులకు పునరావాసం కోసం రూ.2 కోట్లతో ఒక వరుస తారు రోడ్డు నిర్మించారు. మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తారు. గతంలో రోజుకు దాదాపు 20 వాహనాలు నడిచేవి. రెండేళ్ల కిందట ఖమ్మంపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన ప్రారంభం కావడంతో 1000 వరకు నడుస్తున్నాయి.

**ప్రతిపాదనలు బుట్టదాఖలు**

రహదారి గుంతలమయమైన తీరుపై వరుస కథనాలు ప్రచురితం కావడంతో అయిదు నెలల కిందట సింగరేణి సంస్థ గుంతలు పూడ్చివేసింది. వాహనాల రద్దీతో కొద్ది రోజులకే పరిస్థితి మొదటికొచ్చింది. గుంతల రహదారిపై ప్రమాదాలు జరుగుతుండట ంతో శాశ్వత పరిష్కారంగా డబుల్ రోడ్డుగా విస్తరించడానికి సీఆర్ఆర్ నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకపోయింది.

**ప్రమాదాల్లో ముగ్గురి మృత్యువాత: కనవేన శ్రీనివాస్, రచ్చపల్లి మాజీ సర్పంచి**

వాహనాల సంఖ్య పెరిగినా రోడ్డును విస్తరించకపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇప్పటివరకు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలుస్తున్న చోట కల్వర్టు నిర్మించాలి. రెండు జిల్లాల మధ్య వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదు.

**కాలనీని ప్రభుత్వానికి అప్పగించాం: సుధాకరరావు, ఆర్జీ–3 జీఎం**

రచ్చపల్లి పునరావాస కాలనీని సింగరేణి ప్రభుత్వానికి అప్పగించింది. పంచాయతీగా ధ్రువీకరిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. రహదారి విస్తరణకు సంస్థ నిధులు కేటాయించే అవకాశం లేదు. ప్రభుత్వమే అభివృద్ధి చేయాలి.

# కేసు వస్తే.. కాసుల పంటే!

హైదరాబాద్: నగరంలోని కొందరు పోలీసులు అందినంత దండుకుంటూ పోలీసు శాఖ ప్రతిష్ఠ దిగజారుస్తున్నారు. ఫిర్యాదు అందిన దగ్గరి నుంచి బాధితులను, నిందితులను రకరకాల కారణాలతో భయపెడుతూ రెండు వైపులా లంచాలు తీసుకుంటున్నారు. తాజాగా మోసం కేసు నుంచి తప్పించేందుకు ఓ వ్యక్తి నుంచి రూ.2.22 లక్షలు లంచం తీసుకుంటూ శామీర్‌పేట ఎస్సై పరశురాం ఏసీబీకి పట్టుబడ్డారు. గతేడాది భూ ఆక్రమణ కేసులో రాజీ కుదిర్చి మూసివేసేందుకు కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్, ఎస్సై, మధ్యవర్తి ముగ్గురూ ఒకేసారి ఏసీబీకి చిక్కారు. అడ్డగోలుగా వసూలు చేస్తూ పట్టుబడని వారెందరో ఉన్నారని పోలీసు వర్గాల్లోనే చర్చ జరుగుతోంది.

**అంతా ఇష్టారాజ్యం.. అడిగితే నేరం**

పోలీసు కేసులో ప్రతి దశను దర్యాప్తు అధికారులు.. ఇన్‌స్పెక్టర్లు, ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదించాల్సి ఉంటుంది. కొందరు ఆమ్యామ్యాలకు అలవాటై కేసుల సమాచారాన్ని పై అధికారులకు చెప్పకుండా తప్పుదోవ పట్టిస్తున్నారు. భూతగాదాలు, ఆర్థిక లావాదేవీల విషయంలో వచ్చే ఫిర్యాదుల్ని సెటిల్ చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. శివారు ప్రాంతాల్లోని ముగ్గురు డీసీపీలపై తరచూ



ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల శంషాబాద్ జోన్ పరిధిలో ఓ ఎస్సై అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులను బెదిరించారు. స్టేషన్ బెయిలు వ్యవహారాన్ని కొందరు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

**ఫీడ్‌బ్యాక్ విధానం తెచ్చినా..**

పోలీసుల ప్రవర్తనపై ప్రభుత్వం సిటిజన్ ఫీడ్ బ్యాక్ విధానం తెచ్చింది. స్టేషన్‌కు వెళ్లిన బాధితుడు ఫిర్యాదు ఇచ్చిన తర్వాత కేసు నమోదు, పరిష్కారం, అధికారి ప్రవర్తన.. ఇలా అన్ని అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇచ్చే విధానం అమలవుతోంది. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఫీడ్ బ్యాక్ ఇస్తే.. దాని ఆధారంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు. ఈ విషయమై ప్రారంభంలో విస్తృతంగా ప్రచారం చేసినా.. ఆ తర్వాత పట్టించుకోలేదు. నేరుగా పోలీస్‌స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ఇబ్బందిగా ఉంటోందని ఫిర్యాదుదారులు అంటున్నారు.

# జీవో 111 అక్రమ లేఅవుట్లకు తాఖీదులు: దరఖాస్తుదారుల్లో గందరగోళం

హైదరాబాద్: జంట జలాశయాల పరిరక్షణకు సంబంధించి గతంలో తీసుకొచ్చిన జీవో 111 పరిధిలో ఉన్న వందలాది అక్రమ లేఅవుట్లకు తాజాగా ఎల్ఆర్ఎస్ కింద ఫీజు తాఖీదులు వెళ్లినట్లు తెలుస్తోంది. కొందరైతే ఫీజులు కూడా చెల్లిస్తున్నారు. తీరా క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లినప్పుడు ఆయా లేఅవుట్లు అన్ని జీవో పరిధిలోకి రావడంతో వాటిని తిరస్కరిస్తున్నారు. జీవో కింద శంషాబాద్, మెయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, గండిపేట మండలాల పరిధిలో 84 గ్రామాలు ఉన్నాయి. ఈ జీవో ప్రకారం ఈ పరిధిలోని 1,32,600 ఎకరాల భూమి కేవలం వ్యవసాయం, వినోద జోన్లుగా మాత్రమే వినియోగించే పరిస్థితి నెలకొంది. భారీ భవంతుల నిర్మాణం, లేఅవుట్లకు ఆయా మున్సిపాలిటీలు లేదా హెచ్ఎండీఏ ఎలాంటి అనుమతులు జారీ చేయవు. ఒకవేళ అక్రమంగా ఎవరైనా లేఅవుట్లు వేసినా...అక్కడ భవిష్యత్తులో నిర్మాణాలకు అవకాశం లేదు. అయితే



గత ప్రభుత్వం జీవో ఎత్తివేసినట్లు ప్రకటిస్తూ మరో జీవో జారీ చేసింది. అధికారికంగా ఎలాంటి అనుతులు ఇవ్వడానికి వీలు లేదు. అయితే ఆయా గ్రామాల పరిధిలో గతంలో అనేక పంచాయతీ లేఅవుట్లు ఉన్నాయి. తాజాగా ఎల్ఆర్ఎస్ కింద ఆయా దరఖాస్తుదారులకు హెచ్ఎండీఏ నుంచి ఫీజు తాఖీదులు పంపారు. అసలు లేఅవుట్లకు అనుమతి లేని ప్రాంతంలో ఫీజులు చెల్లించాలని దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తీరా ఫీజులు చెల్లించిన తర్వాత ఆ జీవో కింద ఉండటంతో తిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు. కానీ వాటి కోసం అనవసరంగా చెల్లించిన ఫీజులో 10 శాతం కోల్పోతున్నామని వాపోతున్నారు.

# వీధి కుక్కలతో జాగ్రత్త..!

సూర్యాపేట : కోదాడ పట్టణంలోని గణేశ్‌నగర్‌లో ఆరుబయట ఆడుకుంటున్న 8 మంది చిన్నారులు, అనంతగిరి మండలం త్రిపురారంలో ఇంటి బయట ఆడుకుంటున్న అక్కాచెల్లెటళ్లపై వీధి కుక్కలు విక్షణా రహితంగా దాడి చేశాయి. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సూర్యాపేట శ్రీరామ్‌నగర్‌లో పిల్లలు ఆటలాడుతూ ఒకరు ముఖానికి కోతి మాస్క్ పెట్టుకోవడంతో వీధికుక్కలు వెంటపడ్డాయి. త్రుటిలో ప్రమాదం తప్పింది.. ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో ఎక్కడో ఒకచోట చిన్నారులపై వీధి కుక్కలు దాడులు చేసి గాయపరుస్తున్నాయి.పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో చిన్నారులు వివిధ ఆటలు ఆడుకొనేందుకు బయటకు వస్తారు. కాలనీల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువైంది. ఎండాకాలం కావటంతో అవి పిల్లలపై దాడులు చేసే అవకాశం ఉంది. తల్లిదండ్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన తరుణమిది.

ఎండలకు కరిచే అవకాశం వీధి కుక్కలు అధిక ఉష్ణోగ్రతల కారణంగా అసౌకర్యానికి లోనై కరవడానికి వీలుంటుంది. వాటికి వేసవిలో సరైన ఆహారం, నీరు లభించకపోయినా చిరాకుతో ఆహారం కోసం దాడి చేస్తాయి. పెద్దలైతే కాస్త అవగాహనతో తప్పించుకుంటారు. పిల్లలు వాటి బారిన పడతారు. ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో నెలకు చిన్నపిల్లలు ఒక్కరైనా గాయపడుతూనే ఉన్నారు. ఇవి పాటించాలిపట్టణాల్లో కుక్కల విషయమై ప్రజల ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలి. పుర అధికారులు నిర్దేశించిన మార్గదర్శకాలకు లోబడి శునకాల నియంత్రణ చర్యలు తీసుకోవాలి. కుక్కలకు జనన నియంత్రణ చికిత్సలు చేయించడంతోపాటు టీకాలు వేయించాలి. బహిరంగ ప్రదేశాల్లో మాంసం పడేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చేపల విక్రయాల వద్ద వ్యర్థాలు పడి ఉంటాయి. వాటిని రహదారుల పక్కన పారబోస్తుటారు. దీంతో కుక్కలు వాటిని తినే అవకాశం ఉంటుంది. మాంసానికి అలవాటు పడి ప్రజలపై దాడులు చేసే అవకాశం ఉంటుంది. మాంసం వ్యర్థాల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. వీధుల్లో శునకాల సంచారం పెరిగితే ప్రజలు పురపాలిక, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పిల్లలను ఒంటరిగా బయటకు వెళ్లనీయొద్దు.

చురకలు



# స్థిరాస్తి.. స్థిరంగా

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో స్థిరాస్తిరంగం పురోగతి స్థిరంగా కొనసాగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మాదిరే.. తర్వాతి ఏడాదిలోనూ నిర్మాణ అనుమతులు, వసూలైన రుసుము దాదాపు సమానంగా నమోదయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవడంతో.. 2024-25 ఆర్థిక సంవత్సరం గణాంకాలను వెల్లడిస్తూ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం బుధవారం ప్రకటన విడుదల చేసింది. చివరి మూడు నెలల్లో అనుమతుల జారీ ఊపందుకున్నట్లు తెలిపింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని అనుమతులను జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఆకాశహర్మ్యాలకు సంబంధించి ఇప్పటికే కొండాపూర్‌లో 50 అంతస్తుల భవనానికి అనుమతి మంజూరైందని, మరో ఐదు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వివరించారు.

**బీపాస్ నుంచి బిల్డ్‌నౌ వైపు..**

నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియను సులభతరం చేసేందుకు గత సర్కారు 2019లో టీజీబీపాస్ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అందులోని లోపాలను సవరిస్తూ.. బిల్డ్‌నౌ విధానాన్ని ప్రస్తుత సర్కారు




ఇటీవల అమల్లోకి తెచ్చింది. జీహెచ్ఎంసీలో నూతన విధానం ప్రయోగాత్మకంగా అమలవుతోంది. అనుమతుల జారీ వేగంగా జరుగుతోందని ప్రణాళిక విభాగం చెబుతోంది. బీపాస్ విధానాన్ని మరికొన్ని రోజులపాటు బిల్డ్‌నౌకు సమాంతరంగా కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

**పశ్చిమానిదే పైచేయి..**

నివాస, వాణిజ్య కేటగిరీలతోపాటు ఆస్పత్రులు, ఐటీ, ఇతరత్రా సంస్థల కేటగిరిలో జారీ అయ్యే అనుమతుల దృష్ట్యా నగరానికి పశ్చిమాన ఉన్న శేరిలింగంపల్లి జోన్ మొదటి స్థానంలో ఉందని, మియాపూర్ నుంచి నానక్‌రామ్‌గూడ వరకు ఎక్కువ సంఖ్యలో వాణిజ్య భవనాలు అనుమతులు పొందాయని అధికారులు చెబుతున్నారు. ః 2022-23 సంవత్సరంలో స్థిరాస్తి రంగం గ్రేటర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొంది. అనుమతులు, రుసుము వసూళ్లలో చోటుచేసుకున్న తగ్గుదల.. తర్వాతి రెండేళ్లలో కొనసాగలేదని అధికారులు గుర్తుచేస్తున్నారు.జారీ అయిన నివాసయోగ్య పత్రాలను మినహాయిస్తే.. 2023-24తో పోలిస్తే 2024-25 సంవత్సరంలో 259 నిర్మాణ అనుమతులు అధికంగా జారీ అయ్యాయి.

# ఆహ్లాదం సరే.. అప్రమత్తత తప్పనిసరి!

మెదక్ : పర్యాటక ప్రాంతాలు, ప్రసిద్ధ దేవాలయాలు ఉండడంతో నిత్యం జిల్లాకు సందర్శకుల రాక అధికంగానే ఉంటుంది. జంటనగరాలకు సమీపంలోనే ఉండడంతో ద్విచక్ర వాహనాలు, కార్లలో యువత ఆయా ప్రాంతాలకు వస్తున్నారు. అటవీ ప్రాంతం, ఆహ్లాద వాతావరణాన్ని ఆస్వాదించేందుకు వచ్చే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. సందర్శక ప్రాంతాల్లో కొన్ని చోట్ల అతివలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకుంటేనే వీటికి అడ్డుకట్ట పడుతుంది. పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి శివారులో ఏడుపాయల వనదుర్గమాత ఆలయం, మెదక్‌లో ఖిల్లా, చర్చి, హవేలిఘనపూర్ మండలంలో పోచారం వన్యప్రాణి అభయారణ్యం, ప్రాజెక్టు, నర్సాపూర్‌లో అర్బన్‌పార్క్, రాయరావు చెరువు పర్యాటక ప్రాంతాలు. ఆయా ప్రాంతాలకు నిత్యం సందర్శకులు వస్తుంటారు.



**కానరాని పర్యవేక్షణ** నర్సాపూర్ అర్బన్ పార్క్‌లో సీసీ కెమెరాలు లేవు. ఎవరెవరు వచ్చి వెళుతున్నారనేది తెలియడం లేదు. పరిశీలకులు లేకపోవడంతో ఒకసారి లోపలికి రాగానే, వెళ్లేందుకు వివిధ మార్గాలు ఉండడంతో ఎటు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. నర్సాపూర్ - హైదరాబాద్ మార్గంలో అటవీ ప్రాంతంలో ఫెన్సింగ్ వేయగా, శివ్వంపేట మార్గంలో ఫెన్సింగ్ లేదు. యువ జంటలను స్థానికులు బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనలున్నాయి. జిల్లా కేంద్రంలోని ఖిల్లాపైన పోలీసుల పర్యవేక్షణ లేదు. పోచారం ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి ఉంటుంది. ప్రాజెక్ట్ వద్ద ఏకాంత ప్రదేశాలకు వెళ్తుంటారు. ఏడుపాయల ఆలయం వద్ద భక్తులు చెట్ల కింద, అటవీ ప్రాంతంలో విందులు చేసుకుంటారు. ఇక్కడ అదనపు సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. మరిన్ని సీసీ కెమెరాలు,గస్తీ ఏర్పాటు చేయాలి.

**జాగ్రత్తలు ఇలా** తెలిసిన వ్యక్తుల వల్లే మహిళలపై అఘాయిత్యాలు చోటు చేసుకుంటు న్నాయి. ఒంటరిగా, ప్రేమికులు, ఆడ,మగ స్నేహితులుగా కలిసి ఆయా ప్రాంతాలకు వెళ్తున్నారు. సరదా కోసం వెళ్లే వారు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలినమ్మకం ఉన్న వారితోనే ప్రయాణం చేయాలి. స్నేహం, ప్రేమ ముసుగులో ఉన్న వారు ఆహ్వానిస్తే తిరస్కరించాలి. ఎక్కడికి వెళ్లినా కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు సమాచారం ఇవ్వాలిఏ ప్రాంతానికి వెళ్లినా, జన సంచారం ఉన్న చోటనే ఉండాలి. నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లవద్దుఆయా ప్రాంతాలకు వెళితే చీకటి పడేంత వరకు ఉండొద్దు. సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవాలి పెప్పర్ స్ప్రే, లేదా కారం పొడి వెంట ఉంచుకోవాలి. ఆపదలో ఉంటే డయల్ 100 లేదా షీటీం 87126-57963, పోలీస్ కంట్రోల్ రూం 87126-57888 నంబర్లకు సమాచారం ఇవ్వాలి. **నిఘా పెడుతున్నాం...:** పర్యాటక ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిఘా కొనసాగిస్తున్నాం. ఆదివారాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఏడుపాయల, మిగతా ప్రదేశాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. మిగిలిన చోట్ల కూడా చర్యలు తీసుకుంటాం. ఉదయ్ కుమార్ రెడ్డి, ఎస్పీ

# ఆకతాయిల తిష్ఠ.. అప్రతిష్ఠ



హైదరాబాద్: నిత్యం వేలమంది నగరంలోని పర్యాటక ప్రదేశాలకు వస్తున్నా కీలకమైన అత్యధిక మంది సందర్శించే ప్రదేశాల్లో భద్రత నామమాత్రంగా ఉంటోంది. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక విధానం తీసుకువచ్చి ఉపాధి అవకాశాలను పెంపొందించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా.. నగరంలో పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల భద్రత గాలిలో దీపంలా మారుతోంది. అత్యధికంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న వాటిలో గోల్కొండ ముందు వరుసలో ఉండగా తర్వాత స్థానాల్లో చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్ సహా ఇతర ప్రదేశాలు ఉన్నాయి. ఇవి కాకుండా మక్కామసీదు, కుతుబ్ షాహీటూంబ్స్, పైగా టూంబ్స్, సాలార్‌జంగ్ మ్యూజియం, రేమండ్స్ సమాధి, హుస్సేన్‌సాగర్, శిల్పారామం ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. వీటిని సందర్శిస్తున్న వారిలో విదేశీయులూ ఉంటున్నారు. గతేడాది గోల్కొండ కోటను 15.27 లక్షలమంది, చార్మినార్‌ను 12.9లక్షల మంది సందర్శించారు.

**గోల్కొండలో ఆకతాయిల తిష్ఠ..**

గోల్కొండ కోటలో పర్యాటకుల భద్రత నామమాత్రంగా ఉంది. పూర్తిగా ప్రైవేటు సెక్యూరిటీ ఉండగా వీరు కూడా పరిమితంగా ఉన్నారు. కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పట్టుమని పదిమంది సిబ్బంది కూడా లేకపోవడం గమనార్హం. పర్యాటకులకు ఆకతాయిల వేధింపులు ఇక్కడ సాధారణంగా మారాయి. కొందరు నిత్యం ఇక్కడ తిష్ఠ వేసి పర్యాటకులను తప్పుదోవ పట్టించడమే కాకుండా అనుచిత వ్యాఖ్యలు చేస్తుండటంతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన ద్వారం కాకుండా ఇతర ప్రదేశాల నుంచి కొందరు కోటలోకి ప్రవేశిస్తున్నారు. ప్రత్యేక సందర్భాల్లో మాత్రం స్థానిక పోలీసుల నిఘా ఉంటోంది. కోటకు వచ్చిన వారిలో ఎక్కువమంది కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను సందర్శిస్తుంటారు. ఇక్కడా సెక్యూరిటీ సిబ్బంది తక్కువగా ఉండటంతో ఏం జరిగినా గుర్తించే పరిస్థితిలేదు. పర్యాటకుల పర్సులు, ఫోన్లు, హ్యాండ్‌బ్యాగ్‌ల చోరీ నిత్యకృత్యంగా మారింది. విదేశీ టూరిస్టులు ఎక్కువగా సందర్శించే 'పైగా టూంబ్స్', రేమండ్స్ సమాధి వద్ద భద్రతా సిబ్బంది నామమాత్రమే.

**క్యాబ్‌లలో వచ్చేవారే లక్ష్యంగా..**

నగర పర్యాటకుల్లో అత్యధికంగా క్యాబ్‌ల్లో పర్యాటక ప్రదేశాలకు వెళున్నారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. కొత్తవారిని గుర్తించి తప్పుదోవ పట్టించడం లేదంటే అధికరుసుం వసూలు చేయడం, ఇతర ప్రదేశాలు చూపిస్తామని చెప్పి భారీ మొత్తంలో వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పర్యాటక ప్రదేశాల్లో ఉండే సిబ్బందిని సంప్రదించినా స్పందన అంతంతే ఉండటంతో ఇతరులపై ఆధారపడుతూ ఇబ్బందులు పడుతున్నారు.

# కానుక.. దేవుడికే ఎరుక!



హైదరాబాద్ : సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఆభరణాలు, వెండి మాయం.. అక్కడికి కూతవేటు దూరంలోనే ఉన్న కాశీవిశ్వనాథకం, సంతోషీమాత ఆలయంలో భద్రపరిచిన నగల లెక్కల్లో గోల్‌మాల్.. గణపతి దేవాలయంలో కొన్ని ఆభరణాలు కనిపించడం లేదంటూ వచ్చిన ఆరోపణలపై సుదీర్ఘ విచారణ చేపట్టిన దేవాదాయ శాఖ ఇప్పటికీ ఆ నివేదికలను బయటపెట్టలేదు. భక్తులు హుండీలో వేసే బంగారు, వెండి కానుకలకు సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.


**ఎక్కడెక్కడంటే..**

బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ గణపతి, ఉజ్జయిని మహాకాళి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ, కీసర రామలింగేశ్వర స్వామి, ఇతర అనేక ఆలయాలను రోజూ వేలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. బంగారం, వెండి ఆభరణాలను, నగదును హుండీలో వేస్తుంటారు. బల్కంపేట అమ్మవారి ఆలయంలో 12 కిలోలకుపైగా బంగారం, 560 కిలోలకు మించి వెండి (అమ్మవారి అలంకరణ ఆభరణాలు, మిశ్రమ బంగారంతో కలిపి) సమకూరింది. మహాగణపతి దేవాలయంలో సుమారు 11 కిలోల బంగారం, ఉజ్జయిని మహాకాళి గుడిలో 14.5 కిలోలకు మించి బంగారం, 800 కేజీల వెండి సేకరించారు. వీటితో పాటు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే ముఖ్యమైన దేవాలయాల్లో కలిపి ఏటా సుమారు రూ.30 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. చిరు కానుకల లెక్కలు వెల్లడించక పోవడంపై ఆలయాల పరిరక్షణ సమితి ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**రసీదు తప్పనిసరి..**

10 గ్రాములు దాటే బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులకు రసీదు ఇవ్వాలి. చిన్నవి హుండీలో వేయాలి. ఇలా సేకరించిన బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులను 3-6 నెలలకోసారి రాష్ట్ర దేవాదాయ శాఖ తరఫున జేవీవో (జ్యువెల్లరీ వెరిఫికేషన్ అధికారి) తనిఖీ చేయాలి. ఇన్వెంటరీ పుస్తకాన్ని పరిశీలించాలి. పొంతన లేకుండా ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. దేవుళ్ల అలంకరణ కోసం పూజారులకు ఇచ్చే బంగారు, వెండి వస్తువుల వివరాలు ఆలయ అధికారిక పుస్తకంలో నమోదు చేయాలి. బంగారం, వెండి వస్తువులకు బీమా చేయించాలి. కానీ వారాంతపు రద్దీ ఉండే ఆలయాల్లో కొందరు ఈవోలు, బంగారు, వెండి వస్తువులకు రసీదులు ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసి లెక్కలు నిర్వహించాలని ఆదేశించారు. అయినా పరిస్థితిలో మార్పులేదు.

# సాగుకు, తాగుకు నీటి గండం!



కరీంనగర్ : ఎల్లంపల్లి జలాశయంలో రోజురోజుకు నీటి మట్టం తగ్గిపోతోంది. ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం రోజుకు 1,094 క్యూసెక్కుల నీటిని వివిధ అవసరాలకు విడుదల చేస్తున్నారు. దీంతోపాటు వరి పంటకు అవసరమైన నీటిని ఇక్కడి నుంచి నందిమేడారం, లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌లకు తరలిస్తే ఉన్న నీరు కాస్తా అడుగంటడం ఖాయం. కరీంనగర్ తలాపున ఉన్న ఎల్ఎండీలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో తాగునీరు అందించడం కష్టం కానుంది. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలకు ఇప్పటికీ నిత్యం 2,779 క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువల ద్వారా వదులుతున్నారు. నెలాఖరులోగా మరో రెండు తడులకు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వేసవిలో 3 లేదా 4 టీఎంసీల నిల్వకు పరిమితమయ్యే అవకాశముంది. మధ్య మానేరు జలాశయం కళ తప్పింది. దిగువ మానేరుతోపాటు మిషన్ భగీరథ తదితర అవసరాలకు రోజు 2,395 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ జలాశయం నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాజెక్టులకు ఈ నెలలో నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. పైన ఉన్న ప్రాజెక్టులు, కాళేశ్వరం జలాలు రాకపోవడం వల్ల జలాశయంలో నీటి నిల్వ క్రమంగా పడిపోతోంది. ఉమ్మడి జిల్లాలో సాగైన దాదాపు 12 లక్షల ఎకరాల పంటలకు సంబంధించి దాదాపుగా 25శాతం నీరు పై మూడు జలాశయాల నుంచి అందుతోంది. పంట కోతకొచ్చే దశలో కచ్చితంగా మరో రెండు తడులకు నీటిని ఇవ్వాలని అధికారులు భావించారు. దీంతో ఇప్పుడున్న నీటి నుంచి ఈ నెలాఖరులోగా దాదాపుగా సగం ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

వరి పంటను ఎక్కువగా సాగు చేయడంతోపాటు పలు గ్రామాల్లోని చెరువులకు, పొలాలకు ఈ ప్రాజెక్టుల నీరే ఆధారం. రోజులో 143 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాలకు ఒక్క ఎల్ఎండీ నుంచే వాడుతున్నారు. ఎల్లంపల్లి, మధ్య మానేరు కలిపితే మరో 210 క్యూసెక్కులు అవసరం. ప్రణాళిక ప్రకారంగా వినియోగిస్తేనే ప్రజల దాహార్తి తీరడానికి, పంట చేళ్లకు నీరందే పరిస్థితి ఉంది.

**వర్షాలు పడేదాకా..!**

ఇప్పుడున్న పరిస్థితుల్లో వేసవి గండం దాటినా వర్షాలు సమృద్ధిగా కురిసే వరకు ఈ జలాశయల్లో నీరుండటం అవసరం. పంటలకే పూర్తిగా నీటిని విడుదల చేస్తే తాగునీటికి కటకట ఎదురవనుంది. కరీంనగర్‌లాంటి పట్టణానికి ఎల్ఎండీ నీరే ఆధారం. ప్రస్తుతం 5.8 టీఎంసీలుండగా ఇందులో నుంచి 2 టీఎంసీలను మాత్రమే వాడటానికి వీలుంటుంది. అంతకన్నా తక్కువగా 3 టీఎంసీల లోపు నిల్వ ఉంటే డెడ్ స్టోరేజ్ నుంచి తాగునీటిని పంపింగ్ చేయడం కుదరదు. ఇదే విధంగా ఎల్లంపల్లిలో మరో 4 టీఎంసీలు, మధ్యమానేరులో మరో 6 టీఎంసీలను మాత్రమే ఈ వేసవి నాటికి ప్రణాళిక ప్రకారం వాడితేనే ప్రయోజనం. లేదంటే నీటికి ఇబ్బందులు తప్పవు.

# సాఫీగా ముందుకు సాగొచ్చు

కేశవగిరి: చాంద్రాయణగుట్ట చౌరస్తా, ఫలక్‌నుమా మధ్య ఆర్వోబీ (నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జ్) పనులు తుదిదశకు చేరాయి. జీహెచ్ఎంసీ ప్రాజెక్టు డివిజన్ దక్షిణ మండలం-1 ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరగా పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కృష్ణా పైపులైన్లను దారి మళ్లించారు. పట్టాలపై వంతెన కోసం స్టీలు బ్రిడ్జిని రైల్వేశాఖ అధికారులు పూర్తిచేశారు. ఫలక్‌నుమా ఆర్వోబీ నిర్మాణానికి జీహెచ్ఎంసీ రూ.47.10 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే ఉన్న వంతెనను ఆధునికీకరించి మూడేళ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి పక్కనే మరొక 360 మీటర్లు పొడవున సమాంతర వంతెన, 7.5 మీటర్లు వెడల్పుతో ఆర్వోబీ నిర్మిస్తున్నారు. పట్టాలపై బ్రిడ్జి కోసం రైల్వే శాఖకు రూ.10.76 కోట్లు కేటాయించారు. గతనెల 4న స్టీల్ బ్రిడ్జి ఏర్పాటుచేయగా కాంక్రీట్ వేయాల్సి ఉంది.

నిర్మాణాల కూల్చివేత.. ఆర్వోబీకి రెండు వైపులా సమాంతరంగా 7.5 మీటర్ల వెడల్పుతో సర్వీసు రోడ్లను ఏర్పాటు చేయనున్నారు. అల్-జుబైల్ కాలనీలో పలుచోట్ల నిర్మాణాలను కూల్చివేశారు. చాంద్రాయణగుట్ట చౌరస్తా నుంచి రైల్వే బ్రిడ్జి వరకు, శ్మశానవాటిక, ధోబీఘాట్ నుంచి ఫారూఖ్‌నగర్ ఆర్టీసీ డిపో వరకు రోడ్డు, జీహెచ్ఎంసీ పనులు పూర్తయ్యాయి. ఆర్వోబీ పనులను నెలరోజుల్లో పూర్తిచేసేందుకు కసరత్తు జరుగుతోందని బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ తెలిపారు.

# పట్టణాల్లోని ఇళ్లకు కొలతలు

కరీంనగర్: జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు మున్సిపాలిటీల్లో ఉన్న ఇళ్లకు కొలతలు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించారు. రెండేళ్ల కిందట భువన్ యాప్‌తో సర్వే చేపట్టగా ఆ సమయంలో 75 శాతం ఇళ్లను లెక్కించారు. 2018 సంవత్సరంలో విలీనమైన గ్రామాలతోపాటు నగరంలో నూతన భవనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. వీటికి సరైన విధంగా పన్ను మదింపు జరగకపోవడం, అదనపు అంతస్తులు నిర్మించుకోవడం, ఆస్తిపన్ను పరిధిలోకి రాకపోవడం, అక్రమ నిర్మాణాలు కట్టడం, ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్లు తీసుకోవడంతో కొలతల విషయంలో తేడాలు ఉంటున్నాయి. ఆస్తిపన్ను మదింపునగర, పురపాలికల్లో భువన్ యాప్ ద్వారా భవనాల చిత్రాలు, కొలతలను అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అంతర్జాలంలో నమోదు చేశారు. వీటన్నింటికి ఆస్తిపన్ను మదింపు ప్రక్రియ జరుగుతుంది. ఇప్పటికే ఆస్తిపన్ను సర్దుబాటు కావాల్సి ఉండగా పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన మొత్తంతో డిమాండ్ నోటిసులు వచ్చే అవకాశముంది.

అదనపు కట్టడాలకు నోటీసులు

ఆస్తిపన్ను మదింపులో తేడాలు ఉండటంతో ఒక్కో ఇంటికి సర్వే చేస్తూ



అదనపు కట్టడాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొత్తగా వచ్చిన వార్డు అధికారులకు డివిజన్లు, వార్డులు అప్పగించి తక్కువ ఆస్తిపన్ను చెల్లిస్తున్న జాబితాను తీసుకొని మళ్లీ కొలతలు చేపడుతున్నారు. ప్రధానంగా అదనంగా అంతస్తులు నిర్మించుకోవడం, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని వదలడం లేదు. వాణిజ్య సంస్థ ఆస్తిపన్ను ఏవిధంగా వస్తుందో నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**పెరుగుతున్న పన్ను**

భువన్ యాప్‌తోపాటు అదనపు నిర్మాణాలకు కొలతలు ఇష్టానుసారంగా చేస్తుండటంతో అడ్డగోలుగా పన్నుల భారం పడుతుంది. దాంతో ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొందరికి అయితే ఎలాంటి కొలతలు చేపట్టకుండానే రివైజ్డ్ ఆస్తిపన్ను చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఓ దశలో నల్లా కనెక్షన్ కూడా తొలగించారు. వీటిపై అభ్యంతరాలు పరిష్కరించుకునే అవకాశాన్ని ఇవ్వకుండా దాటేశారని మండి పడ్డారు. ప్రస్తుతం ఆస్తిపన్ను అధికంగా వస్తుందనే ఫిర్యాదుల మేరకు తిరిగి కొలతలు చేపట్టి ఆస్తిపన్ను రాబట్టుకోవాలని నిర్ణయించారు.

# చల్లనివన్నీ.. మంచివి కాదండోయ్..!

నీలగిరి : ఎండలు మండుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందేం దుకు చల్లటి పానీయాలు తీసుకుంటే బాగుంటుందని అందరూ భావిస్తుంటారు. అయితే చల్లనివన్నీ మంచి పానీయాలా కాదా అని ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో సమృద్ధిగా నీరు తాగాల్సిన అవసరం ఉంది. ఎండ వేడికి తట్టుకోలేక పలువురు జ్యూస్ లు, ఐస్‌క్రీంలు, ఇతర పానీయాలు తీసుకుంటారు. వినియోగదారులను ఆకర్షించేందుకు నిర్వాహకులు వీటిలో రంగులు, ఇతర పదార్థాలను కలుపుతారు. వీటి వల్ల అనేక రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు చెబుతున్నారు.

**కల్తీకి అవకాశం ఉన్న పదార్థాలు**

జ్యూస్‌లు, మజ్జిగ, ఐస్‌క్రీంలు ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లు కల్తీ జరిగేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. రంగులు, రుచి కోసం పలు రకాల రసాయనాలను వీటిలో కలుపుతారు. ఫుట్‌పాత్‌లపై తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకునే ముందు ఓ సారి ఆలోచించి తీసుకోవడం ఉత్తమం. జ్యూస్‌లు, ఐస్‌క్రీంలు తయారు చేసేందుకు కలుషిత నీరు, పాలు..పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు కార్బైడ్‌లను వినియోగిస్తారు.

**కల్తీపై నిరంతర నిఘా**

-జ్యోతిర్మయి, జోనల్ అధికారి ఆహార కల్తీ నిరోధక శాఖ ఉమ్మడి నల్గొండ జిల్లా ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న వ్యాపారులపై నిరంతర నిఘా పెట్టాం. ఉమ్మడి జిల్లాలో సంచార తనిఖీ వాహనం తిప్పుతున్నాం. వినియోగదారులు ఫిర్యాదులు చేసిన చోట, అనుమానం ఉన్న ఫుడ్ తయారీ కేంద్రాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

2024-25 నల్గొండ జిల్లాలో మొత్తం 42 కేసులు నమోదు చేశారు. 9 చోట్ల అనారోగ్య కారకాలు ఉన్నట్లు గుర్తించారు. 33 చోట్ల నాణ్యత పాటించడంలేదని తేలింది. వీరికి రూ.3.47లక్షలు జరిమానా విధించారు.

వేసవిలో తీసుకోవాల్సిన పదార్థాలు

-కల్యాణి, డైటీషియన్

వేసవిలో ఆరోగ్యం కోసం తాజా పండ్లు, అధిక నీటిని అందించే కూరగాయలు తీసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగుతూ ఉండాలి. నీరు అధికంగా ఉండే సొరకాయ, బీరకాయ, దోసకాయ, టమాట, కీరదోస మొదలైనవి తీసుకోవాలి. సబ్జా గింజలు రోజుకు 15 గ్రాములు నానబెట్టి తీసుకుంటే శరీరం వేడి నుంచి ఉపశమనం పొందుతుంది. ఫ్రైలు, అధిక కొవ్వు పదార్థాలు తీసుకోవడం మంచిది కాదు. షుగర్ వ్యాధిగ్రస్థులు పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి.

# గురుకులం.. పక్కా పర్యవేక్షణే బలం

సంగారెడ్డి : గురుకులాలు.. ఒకప్పుడు సీటు లభించాలంటే ప్రవేశ పరీక్షకు కష్టపడి చదవాలి. ఇక్కడ సీటు దక్కింతే తమ పిల్లల భవిత బాగుంటుందని తల్లిదండ్రులు సంబర పడేవారు. రానురాను గురుకులాల్లో నాణ్యత తగ్గుతోంది. విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు.. భోజనం నాణ్యంగా లేకపోవడం వంటి కారణాలతో పిల్లలు వీటిలో చదివేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రవేశాలు తీసుకుంటాయి. ఫలితాలు వచ్చిన తరువాత పిల్లలు చేరకపోవడంతో సెప్టెంబరు వరకు సైతం ప్రవేశాలు కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు. **అద్దె భవనాల్లో ఇరుకుగా..** ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాల్లో బీసీ, మైనార్టీ గురుకులాలు 56 ఉన్నాయి. వీటిలో చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తరగతి గదిలోనే ఉదయం పాఠాలు వినడం.. రాత్రిపూట అదే గదిలో పడుకోవడం చేయాల్సి వస్తోంది. సొంత భవనాలు నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చినా అమలు కావడంలేదు. కొద్దిపాటి శౌచాలయలు విద్యార్థుల సంఖ్యకు సరిపోవడం లేదు. దుర్వాసన వ్యాపిస్తోంది. విద్యార్థులు అస్వస్థతకు గురై ఇబ్బంది పడుతున్నారు. వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

**ఆటపాటల ప్రోత్సాహం తక్కువే** సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ గురుకులాల్లో గతంలో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించే వారు. విద్యాభ్యాసంపై దృష్టి పెడుతూనే మరోవైపు ఆటలు.. సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు ఇచ్చేవారు. 5వ తరగతి నుంచే క్రీడలు నేర్పించేవారు. ఇక్కడ చదివిన పిల్లలు వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. ప్రత్యేకంగా కౌన్సెలర్లతో సైకాలజీ తరగతులు నిర్వహించేవారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండే వారు.. మార్కులు తదితర కారణాలతో అఘాయిత్యాలు చేసుకోకుండా మానసిక స్థైర్యం కల్పించే వారు. వేసవి శిబిరాలు అన్ని జిల్లాల్లో నెల రోజుల పాటు ఉండేది. మూడేళ్ల నుంచి అరకొరగా చేపడుతున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు వచ్చేందుకు నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు చెప్పించేవారు.

చురకలు



# పోస్టుల భర్తీ ఎన్నడో?

చిత్తూరు : నగరపాలికలో వివిధ క్యాడర్లలో మొత్తం 419 పోస్టులు మంజూరు కాగా దాదాపు రెండు వందలకు పైగా పోస్టులు భర్తీకి నోచుకోలేదు. 2012 జులై 7న చిత్తూరు పురపాలక సంఘాన్ని నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమీప మండలాల్లోని 14 గ్రామ పంచాయతీలను నగరపాలక సంస్థలో విలీనం చేశారు. దీంతో నగరపాలక జనాభా 2.20 లక్షలకు చేరుకోగా.. 48 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆస్తి, నీటి పన్నుల రూపంలో నగర ప్రజల నుంచి ఏడాదికి రూ.15 కోట్ల వరకు వసూలు చేస్తుండగా వివిధ నిధులు రూ.60 కోట్ల వరకు నగరపాలక సంస్థకు వస్తున్నాయి. నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ అయినా ఇక్కడ పాలనకు సంబంధించి కీలకపాత్ర పోషించే అధికారులు, ఉద్యోగుల పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో పాలన గాడితప్పింది. దీంతో ప్రభుత్వ ఫలాలను ప్రజలకు మరింత వేగంగా అందించడానికి అవసరమైన



సిబ్బంది అందుబాటులో లేని దుస్థితి నెలకొంది. ఖాళీలు భర్తీ చేయాలని 2012 నుంచి ఇప్పటివరకు దాదాపు పదేళ్ల పాటు నగరపాలక సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కాదు కదా.. అంతంతమాత్రమే ఉన్న పోస్టులకు సంబంధించి అధికారులు, సిబ్బందికి ఉద్యోగోన్నతి, బదిలీ అయితే వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలోనూ జాప్యం చోటుచేసుకుంటోంది.

**ఖాళీలివే..**మేనేజర్ 1, రెవెన్యూ అధికారి 1, అకౌంటెంట్ 1, టీపీఎస్ 2, భవన ఇన్‌స్పెక్టర్లు 4, సహాయ ఇంజినీరు 1, ఉద్యాన అధికారి 1, జనన, మరణ సబ్ రిజిస్ట్రార్ 1, మలేరియా క్షేత్రాధికారి 1, పారిశుధ్య కార్మికులు 143, రికార్డు సహాయకులు 3, టైపిస్టులు 2, వాచ్‌మెన్లు 4, పీవో 1, అకౌంట్స్ అధికారి 1, సీనియర్ స్టెనో 1, సీనియర్ అకౌంటెంట్ 3, జూనియర్ అకౌంటెంట్ 2, సిస్టం మేనేజర్ 1, డీఈవో 1, టీపీ ట్రేసర్ 1, జీఐఎస్ ఆపరేటర్ 1, ఫిట్టర్ 1, టీబీ వాచ్‌మెన్లు 3, గ్యాంగ్ మజ్దూర్ 3, టర్న్‌కాక్ 4, క్లీనర్ 9, ఎలక్ట్రీషియన్లు 5, పంపుసెట్ క్లీనర్లు 3, పీహెచ్ మేస్త్రీ 4, ప్రసూతి సహాయకులు 5, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు 2, ఆయాలు 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# అక్రమార్కుల కలప దోపిడీ

తాళ్లూరు : జామాయిల్ వనాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా కొందరు ఈ చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. దొనకొండ నుంచి రుద్ర సముద్రం వెళ్లే దారిలోని కొండ పరిసర ప్రాంతాల్లో సుమారు యాభై ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మైలాడ్ సంస్థ ద్వారా దాదాపు పదిహేనేళ్ల క్రితం అక్కడ నేరేడు, గానుగ, వేప, జామాయిల్ మొక్కలు నాటారు. అవి బాగా పెరిగి పెద్దవయ్యాయి. ఆప్రాంతం మొన్నటి వరకూ పచ్చదనంతో కళకళలాడుతుండేది. గతంలో కొందరు అక్రమార్కులు వేప చెట్లను నరికి సొమ్ము చేసుకున్నారు. గత కొంతకాలంగా జామాయిల్ చెట్లను నరికివేస్తున్నారు. వీటికి మంచి ధర పలుకుతుండటంతో రెండు వారాలుగా కలప దొంగలు వందలాది చెట్లను నేలకూల్చారు. రాత్రి వేళ వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. పొగాకు పందిళ్ల ఏర్పాటు, ఇతరత్రా అవసరాలకు ఈ దుంగలు ఉపయోగిస్తున్నారు. ఇప్పటికి సుమారు రూ.లక్షల మేర సంపద తరలిపోయింది. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి అక్రమ తరలింపులను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై దొనకొండ ఇన్‌ఛార్జి తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎర్రకొండపై విధ్వంసం

ఒంగోలు : మట్టి దొంగలు సహజ వనరులను నంజుకుని తింటున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు సాగిస్తూ ఇష్టారీతిన నమిలి మింగేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తూ ఇనప్పెట్టెలు నింపుకొంటున్నారు. ఈ క్రమంలో ప్రకృతి మాతకు మానని గాయాలెన్నో మిగిలిస్తున్నారు. భావితరాలకూ భద్రత లేకుండా చేస్తున్నారు. ప్రజల దాహార్తి తీరుస్తున్న రామతీర్థం జలాశయం చెంతనే ఉన్న ఎర్ర కొండలపై అక్రమార్కులు కన్నేశారు నిర్లక్ష్యంతో కొండలు, గుట్టలు కనుమరుగైపోతున్నాయి.

**నగరం.. పట్టణాలు.. గ్రామాలకు నీరు:** చీమకుర్తి మండలంలో ప్రవహించే నాగార్జున సాగర్ కాలువ నీరు ఆధారంగా.. చుట్టూ ఉన్న కొండల ఆసరాతో రామతీర్థం జలాశయం నిర్మితమైంది. ఇక్కడి నుంచి ఒంగోలు నగరపాలక సంస్థ, కందుకూరు, కనిగిరి, చీమకుర్తి పురపాలికలతో పాటు సుమారు 315 గ్రామాల ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుంటుంది. కొండలపై పెరిగిన చెట్లపై ఎన్నో పక్షులు గూళ్లు కట్టుకొని.. జలాశయంలోని చేపలను తింటూ జీవనం సాగిస్తున్నాయి. పచ్చిక బయళ్లలో కుందేళ్లు బతుకుతున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం పక్షుల కిలకిలరావాలతో ఈ ప్రాంతం ఆహ్లాదంగా ఉంటుంది. పచ్చందాలతో తొణికిసలాడే ఎర్ర కొండలను కొందరు ఇప్పుడు తవ్వేస్తున్నారు. జలాశయానికి వంద మీటర్ల దూరంలోనే పొక్లెయిన్లతో చెట్లను తొలగిస్తూ.. మట్టి తోడేస్తున్నారు.

ఖజానాకు సమకూరని రూ. కోట్లు: చీమకుర్తి మండలం బూదవాడ పరిధిలోని ఎర్రకొండ, పల్లామల్లి కొండ, రామతీర్థం పరిసర ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండానే రోజూ మట్టి తరలిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు సమకూరాల్సిన సీనరేజీ ఎగ్గొడుతున్నారు. రోజూ 150 టిప్పర్లలో మట్టి అక్రమంగా తరలుతుండగా.. ప్రభుత్వ ఆదాయానికి రూ. 1.01 లక్షల మేర గండి పడుతోంది.విలువ ఏడాదికి రూ.3.68 కోట్లుగా ఉంటుంది.

**ఇవిగివిగో అక్రమార్కుల ఆగడాలు**


బూదవాడ ఎర్ర కొండతో పాటు చీమకుర్తి, ఆర్‌ఎల్‌పురం పరిధిలోని పలు గ్రానైట్ డంప్‌ల నుంచీ ఒంగోలు, సంతనూతలపాడు, చీమకుర్తి తదితర ప్రాంతాలకు మట్టి రవాణా సాగుతోంది.

తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం పరిధిలోని కొండల నుంచి ఇదే రీతిలో గ్రావెల్ తరలుతోంది.

పల్లామల్లిలో నాలుగు హెక్టార్లలో మాత్రమే తవ్వకాలకు అనుమతులు పొంది పక్క ప్రాంతాల్లోనూ మట్టిని తోడుతుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. రెవెన్యూ, గనుల శాఖ అధికారులు సర్వే చేసి అక్రమ తవ్వకాలు నిర్ధారించారు. అమరావతి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ వారు రామతీర్థం జలాశయం వద్ద గల ఎర్రకొండ నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు.

ఎవరికీ అనుమతుల్లేవుఅక్రమ తవ్వకాలపై భూగర్భ, గనుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ.. 'రామతీర్థం జలాశయం చెంత గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి ఎవరికీ అనుమతులు ఇవ్వలేద'ని తెలిపారు. ఒంగోలు వైపు అక్రమంగా మట్టి రవాణా చేస్తుంటే ఒక టిప్పర్‌ను పట్టుకున్నామని చెప్పారు. అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామన్నారు.

# పల్లెల్లో విద్యుత్తు నియంత్రికల చోరీలు



పుత్తూరు : రైతులు పొలం పనులపై దృష్టి పెడుతున్న ప్రస్తుత తరుణంలో జిల్లాలోని పొలాల్లో విద్యుత్తు నియంత్రికలు చోరీకి గురవుతున్నాయి. రైతులు ఆందోళనకు గురవుతుండగా.. అధికారులకు కంటి మీద కునుకులేకుండాపోతోంది. కొత్త నియంత్రికలు ఏర్పాటు చేయడం తలకు మించిన భారమవుతోంది. చోరీల నియంత్రణపై ప్రత్యేక ఏర్పాట్లు చేసినా ప్రయోజనం ఉండడం లేదు.

పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల మండలంలో రెండు నెలల వ్యవధిలో కొత్తూరు, గాజులపల్లె, జంగాపల్లె, ముదిగోళం గ్రామాల పరిధిలో నాలుగు విద్యుత్తు నియంత్రికలు పగలగొట్టి రాగి తీగలు చోరీ చేశారు.

జీడీనెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలంలోని ఆముదాల, శ్రీకావేరిరాజపురం గ్రామాల్లో ఇటీవల 10 రోజుల వ్యవధిలోనే రెండు నియంత్రికలు చోరీకి గురికావడంతో చెరకు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

నగరి నియోజకవర్గంలోని నగరి, విజయపురం, పుత్తూరు మండలంలోని పరమేశ్వరమంగళం పరిధిలోని నియంత్రికలు చోరీకి గురయ్యాయి.

**కొత్తది ఏర్పాటు చేయాలంటే..**

దొంగలు నియంత్రికలోని రాగి తీగను తీసుకుపోయి మిగిలిన భాగాలను అక్కడే వదిలేస్తున్నారు. ఒక్కసారి వీటిని బాగు చేయవచ్చు. ఒక్కోసారి కుదరదు. ఈ చోరీలకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయాలి. వారు కేసు నమోదు చేయాలి. ఇవన్నీ జరగాలంటే కొన్ని రోజులు పడుతుంది. దీనికి తోడు ఎస్‌ఈ కార్యాలయంకు వెళితే వారు అనుమతి తీసుకుని జిల్లా కేంద్రంలోని విద్యుత్తు నియంత్రికల కేంద్రంలో డ్రా చేసి తీసుకొచ్చి ఏర్పాటు చేయాలి. దీనికి సుమారు రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చవుతుంది.

**నిఘా పెంచాలి**

వేసవి కాలంలో రైతులు పొలాల వైపు వెళ్లరు. సాధారణంగా ఈ సమయంలోనే చోరీలు జరుగుతుంటాయి. ప్రధానంగా తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో చోరీలు ఎక్కువయ్యాయి. రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించే పోలీసులు కాస్త ఏమరుపాటుగా ఉంటున్నారు. దీంతో చోరీలు జరుగుతున్నాయి. పోలీసులు గస్తీ మరింత పెంచాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

# సహకారానికి అపకారం



అనకాపల్లి : నేతల దగ్గర పలుకుబడి ఉంటే చాలు. సహకారం మాటున రూ. కోట్లు కొల్లగొట్టేసినా పర్వాలేదు.. బినామీల పేరిట రుణ బాగోతాలు నడిపినా తప్పులేదు.. రికార్డులు తారుమారు చేసి అందినకాడికి బొక్కేసినా భయం లేదు. అక్రమాలు బయటపడకుండా చేసుకోవచ్చు. విచారణలు ముందుకు వెళ్లకుండా అడ్డుకోవచ్చు. రోలుగుంట మండలం జానకీరాంపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చోటుచేసుకున్న జంతర్ మంతర్ పరిణామాలే ఇందుకు నిదర్శనం. రైతులు ఫిర్యాదులను బుట్టదాఖలు చేసి తుది విచారణ జరగకుండా అడ్డుపుల్లలు వేసి అక్రమార్కులు సవాల్ విసురుతున్నారు. జానకీరాంపురం సొసైటీలో వైకాపా హయాంలో రూ. కోట్లల్లో అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపై ఆధారాలతో సహా కలెక్టరుకు రైతులు ఫిర్యాదు చేశారు. డివిజనల్ సహకార అధికారి ప్రాథమిక విచారణలో అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో సహకార చట్టంలోని కీలకమైన 51 విచారణకు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆ విచారణ జరపడానికి వీల్లేదంటూ కూటమి నేతలే సిఫార్సు చేయడంతో ఈ విచారణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా నిలిచిపోయింది. అప్పులు తీసుకోకున్నా జప్తు నోటీసులు అందుకున్న బాధితుల గోడును గాలికి వదిలేసి అక్రమార్కులకు అండగా నేతలు నిలవడం గమనార్హం.

ఇలా మొదలుపెట్టి..అలా వెనక్కి.. తొలుత విచారణపై నేతలు ఒత్తిళ్లు తెచ్చినా 'అబ్బే మీ పని మీరు చేయండి, వారి సిఫార్సులతో పనిలేదు' అని సహకారశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో గతనెలలో జానకీరాంపురం పీఏసీఎస్‌పై 51 విచారణాధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావును నియమించారు. ఆయన వెంటనే రంగంలో దిగి బినామీ రుణాల బాగోతం వెలికితీస్తా అంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) సీఈఓకే ముందుగా సమన్లు జారీచేశారు. గత 20 ఏళ్ల రికార్డులన్నీ పట్టుకుని తన ఎదుట హాజరవ్వాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడింది పీఏసీఎస్ సీఈవో అయితే డీసీసీబీ సీఈఓకి సమన్లు జారీ చేయడంపై సంబంధిత శాఖలో చర్చనీయాంశమైంది. ఇంతలోనే ఈ విచారణ జరగకుండా సహకారశాఖ కమిషనరేట్ నుంచే స్టే ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఎక్కడి దస్త్రాలు అక్కడే గప్‌చుప్ అంటూ పక్కనపెట్టేసి వెనక్కి వచ్చేశారు.

**వెలుగు చూసింది కొంతే.. కలుగులో ఉంది ఎంతో..**

గతేడాది మార్చిలో జానకీరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన ఆడిట్‌లో రూ. 1.77 కోట్లకు లెక్కలు తేలలేదు. అప్పటికే ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) కృష్ణ బినామీ రుణాల పేరిట రూ.కోట్లలో మింగేశారనే ఫిర్యాదులున్నాయి. దీంతో ఈ సంఘంలో లావాదేవీలను పూర్తిస్థాయిలో విచారణ జరిపితే సీఈఓతోపాటు కలుగులో దాగిన వారంతా బయటకు వస్తారని భావించారు. ఇందుకోసం 51 విచారణకు ఆదేశించగా ఆ నియోజకవర్గ నేత 'అబ్బెబ్బే.. ఆ సీఈఓ మంచోడండీ, అలా చేయదు. విచారణ వద్దు, నిలిపేయండి' అంటూ సంబంధిత మంత్రికి సిఫార్సు లేఖ పంపించారు. ఇదే తడవుగా సహకారశాఖ అధికారులు కూడా విచారణపై మిన్నకుండిపోయారు.

# పల్లె వైద్యానికి 'తాళం'




కర్నూలు : " ఓర్వకల్లు మండలం శకునాలకు చెందిన వృద్ధుడు నాగన్న రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్నారు. ప్రతి నెలా ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)కు వెళ్లి ఔషధాలు తెచ్చుకొంటున్నారు. ఈనెల 26వ తేదీన అక్కడికి వెళ్లారు.. తాళం వేసి ఉంది.. సమీపంలోని సచివాలయంలోకి వెళ్లి ఆరా తీయగా సిబ్బంది సమ్మె చేస్తున్నారు.. ఓర్వకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు.. గ్రామానికి 10 కి.మీ. దూరంలో ఉన్న ఓర్వకల్లుకు వెళ్లలేక ఇతరులకు రూ.500 ఇచ్చి పది రోజులకు సరిపడా మాత్రలు తెప్పించుకొన్నారు."

ఇన్సెంటివ్ ఇవ్వడం లేదని, వేతనాలు పెంచాలని, పని ఒత్తిడి ఎక్కువైందని ఎంఎల్‌హెచ్‌పీలు ఈనెల 17వ తేదీ నుంచి ఆందోళన చేపట్టారు. అప్పటి నుంచి ఆరోగ్య మందిర్‌లకు తాళం పడింది. ఒక్కో కేంద్రంలో నిత్యం 25-30 ఓపీ ఉంటుంది. గ్రామాల్లో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు, వ్యాధినిరోధక టీకాలు, చిన్నపాటి జ్వరం బారినపడిన వారు సేవలు పొందుతున్నారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి అవసరమైతే సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు రెఫర్ చేస్తుంటారు. పల్లెల్లో వైద్య సేవలు ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. " తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని" ఏపీఎంసీఏ కార్యదర్శి గురుప్రసాద్ పేర్కొన్నారు.సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది సమ్మెలోకి వెళ్లడం.. కేంద్రాలు మూతపడటం.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో పల్లె జనానికి వైద్య సేవలు దూరమయ్యాయి.

**797 కేంద్రాలు.. 14 రకాల సేవలు**

పల్లె ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడానికి గతంలో ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండేవి. వాటి స్థానంలో కేంద్రం నాలుగేళ్ల కిందట ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)లను తీసుకొచ్చింది. 3-4 వేల జనాభాకు ఒకటి చొప్పున ఉమ్మడి కర్నూలు జిల్లాలో 797 వరకు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని మల్టీలెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా నియమించింది. వీరి సమక్షంలో ఒక్కో కేంద్రంలో 14 రకాల వైద్య సేవలు అందజేయాలి. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు వీరికి సహకారం అందిస్తుంటారు.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లు విఫలం**

ఎంఎల్‌హెచ్‌పీల ధర్నా నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా సచివాలయ ఏఎన్ఎంలు వారి స్థానంలో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించింది. హెల్త్ క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీల స్థానంలో ఏఎన్ఎంలు పనిచేయాలి అంటున్నారు తప్ప ఇంతవరకు ఒక్క ఉత్తర్వు ఇవ్వలేదు. దీంతో సచివాలయ ఏఎన్ఎంలు విలేజ్‌హెల్త్ క్లినిక్‌లతో సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. దీన్ని జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందక పల్లె ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సినవసరం ఉంది. " సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని" డీపీఎంవోయూ డా.ఉమ తెలిపారు.

# వరి.. మిగిల్చింది వర్రీ

రుద్రవరం : ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిని సాగు చేసిన రైతులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారు. అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గి మార్కెట్ ధర లేక ఇబ్బందుల పాలయ్యారు. దిగుబడులను అమ్మగా వచ్చిన సొమ్ము పెట్టిన పెట్టుబడులకే సరిపోగా చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కలేదు. కనీసం రెండో పంటైనా పండి తమ కష్టాలను తీరుస్తుందేమోనని ఆశగా రబీలోనూ వరి సాగు చేయగా అకాల వర్షాలతో పంట దెబ్బతింది. అదనపు ఖర్చులు భారంగా మారాయి.

**జిల్లాలో 37వేల హెక్టార్లలో వరిసాగు**

జిల్లాలో ఎక్కువగా కర్నూలు సోనా, నంద్యాల సోనా వరి రకాలు అధికంగా సాగైంది. ఖరీఫ్‌లో వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం 65,787హెక్టార్లు కాగా 66,364హెక్టార్లలో సాగైంది. రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 27,908హెక్టార్లు కాగా.. 37వేల హెక్టార్లలో సాగైంది. రబీలో సాధారణం కంటే 10వేల హెక్టార్లు ఎక్కువగా సాగైంది.



**పెరిగిన పెట్టుబడి**

రబీలో వరి సాగుకు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35వేల వరకు పెట్టుబడి ఖర్చులు పెట్టారు. వానకారుతో పోలిస్తే ఎండకారులో ఎకరాకు అదనంగా రూ.5వేలు నుంచి రూ.6వేలు ఖర్చైంది. మూడుసార్లు ఎరువులు చల్లాల్సి వచ్చింది. అకాల వర్షాలకు పైరు నేలవాలుతుండటంతో కట్టలు కట్టి నిలబెట్టుకునేందుకు ఎకరాకు రూ.2వేలకు పైగా కూలీ ఖర్చులు అదనంగా పెట్టాల్సి వచ్చింది. యంత్రంతో పంట కోతకు ఎకరాకు గంటన్నర సమయానికి రూ.3వేలు కాగా నేలవాలిన పైరును యంత్రంతో కోత కోసేందుకు 3గంటల సమయం పడుతుండటంతో రూ.6వేలు కోత ఖర్చు వచ్చింది. నేలవాలిన పైరు వల్ల గింజ రాలిపోయి దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 30నుంచి 35బస్తాలే వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్ ధర బస్తా (77కిలోలు)రూ.1280నుంచి రూ.1300మాత్రమే ఉంది. ఖరీఫ్‌లో బస్తా రూ.1400ఉండగా రబీలో మరింత తగ్గింది. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, అదనపు ఖర్చులతో ఇప్పుడు ఉన్న మార్కెట్ ధర ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు.

**ఏమీ మిగల్లేదు- వెంకటేశ్వర్లు, రైతు, కోవెలకుంట్ల**

రబీలో సొంత పొలం ఐదెకరాలు, కౌలుకు మరో 15 ఎకరాలు తీసుకొని వరి సాగు చేశా. ఖరీఫ్‌లో వచ్చిన దిగుబడులు అమ్మితే పెట్టిన పెట్టుబడులకే సరిపోయింది. ఎండకారు పంటైనా ఆదుకుంటుందని అనుకుంటే పెట్టుబడి ఖర్చులు పెరిగి ఎకరాకు 30నుంచి 35బస్తాలు దిగుబడి వచ్చాయి. మార్కెట్‌లో ధరలు తగ్గడంతో ఇప్పుడు కూడా ఏమీ మిగలడం లేదు.

# యూనిట్ మూత.. రైతు నెత్తిన మోత

బొబ్బిలి : ఉమ్మడి జిల్లాలోని పాడి రైతులకు నాణ్యమైన పశుగ్రాస విత్తనాలు రాయితీపై ఇచ్చేందుకు రామభద్రపురంలో ఏర్పాటు చేసిన పశుగ్రాస విత్తన తయారీ యూనిట్ మూలకు చేరింది. ఫలితంగా రైతు నెత్తిన విత్తన భారం పడింది. మరోపక్క రూ.కోట్లు విలువైన స్థలానికి రక్షణ కరవైంది. భవనాలు, మోటార్లు, ఇతర సామగ్రి పాడైపోతున్నాయి. ఈ యూనిట్ను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

**ప్రధాన ఉద్దేశం:** పాడి సంపదను ప్రోత్సహించేందుకు, ఉమ్మడి జిల్లాలోని పాడి రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు ఇచ్చేందుకు రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద జాతీయ రహదారి పక్కన సుమారు నాలుగు ఎకరాల స్థలంలో విత్తనాభివృద్ధి క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ తయారు చేసిన నాణ్యమైన విత్తనాలను రాయితీపై తక్కువ ధరకు అందించేవారు.

**అదనపు బాదుడు:** జిల్లాలో పాడికి ప్రసిద్ధి రామభద్రపురం మండలం. సాలూరు, మక్కువ, బలిజిపేట, బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి, తెర్లాం మండలాల్లో పాడి ఎక్కువగా ఉంది. చాలామంది రైతులు వీటిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం కిలో గడ్డి విత్తనం ధర మార్కెట్లో రూ.200 ఉంది. అదే విత్తన తయారీ యూనిట్ ఉంటే సగం ధరకే అందేవి. అంతేకాకుండా నాణ్యమైనవి కావడంతో గడ్డి బాగా పెరిగి, పాల ఉత్పత్తి మెరుగుగా ఉండేది.

**ప్రస్తుత పరిస్థితి:** 15 ఏళ్ల క్రితం యూనిట్లోని మోటార్లు చిన్నపాటి మరమ్మతులకు గురికావడంతో మూసివేశారు. దీంతో భవనం శిథిలావస్థకు చేరింది. నేలబావులు, మోటార్లు పాడయ్యాయి. స్థలం చుట్టూ కంచె లేదు. దీంతో ఆక్రమణకు గురవుతోంది. మోటార్లు



ఎత్తుకుపోతున్నాయి. కొంతమంది చిన్న చిన్న షెడ్డులు ఏర్పాటు చేసుకుని, వ్యాపారాలు చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకున్న పరిస్థితి లేదు. సుమారు రూ.30 లక్షలు కేటాయిస్తే యూనిట్ తెరుచుకునే అవకాశం ఉంది.

**ధరలు పెరిగిపోయాయి:** పాడి రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. విత్తనం నుంచి దాణా వరకు ధరలు పెరిగిపోయాయి. ముఖ్యంగా వేసవి కాలంలో పశుగ్రాసానికి ఇబ్బందులు వస్తున్నాయి. ప్రభుత్వం గతంలోలా నాణ్యమైన విత్తనాలు అందిస్తే బాగుంటుంది. వి.రామ్మూర్తి, రైతు, రామభద్రపురం

ప్రభుత్వం దృష్టికి: ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. కొత్త సామగ్రి కొనుగోలుకు నిధులు అవసరం. యూనిట్ తెరిస్తే పాడి రైతుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

విష్ణు, ఏడీ, పశుసంవర్ధకశాఖ, బొబ్బిల

చురకలు



## మా భూములకు రక్షణ ఏదీ?



ఆత్మకూరు : గత వైకాపా పాలనలో భూముల వివరాలను తమకు ఇష్టం వచ్చినట్లు అధికారులను బెదిరించి, ప్రలోభాలకు గురి చేసి మార్పులు చేశారు. కేవలం వైకాపాకు చెందిన వారికే భూ సమస్యలను పరిష్కారం చేశారు. ఎంతోమంది తెదేపా కార్యకర్తలు భూముల సమస్యలు ఉన్నప్పటికీ వాటిని సరిచేసుకోలేక నరకయాతన పడుతున్నామని బాధితులు వాపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చినా బాధలు తప్పలేదని బాధితులు వాపోతున్నారు.

**రికార్డుల్నే మార్చేస్తారా?**

ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నాగభూషణంతో రెండు రోజుల క్రితం వాగ్వాదానికి దిగారు. గ్రామానికి సంబంధం లేని వ్యక్తులకు తమ భూములు ఎలా చేయిస్తారంటూ మండిపడ్డారు. 20 సంవత్సరాల క్రితం తమకు రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తికి అనుకూలంగా రికార్డులు మార్చడం తగదన్నారు. కేవలం ఉన్నవారు ఇచ్చిన మామూళ్లకు పనులు చేస్తే పేద ప్రజలు ఎలా బతుకుతారు.. ఉన్న భూములు వదిలేసి వెళ్లాలా? అని ప్రశ్నించారు. కేవలం ఆర్ఐ తప్పిదంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే స్థితికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కనీస సమాచారం ఇచ్చేదెవరు?**

వై.కొత్తపల్లికి చెందిన ఎల్లమ్మకు పి.యాలేరు రెవెన్యూ సర్వేనంబరు 180లో 5.02 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. తరువాత ఆ భూమిని మరొకరు రిజిస్ట్రేషన్ చేయించారు. నాటి నుంచి డబుల్ రిజిస్ట్రేషన్ ఉందటూ అధికారులు ఆన్‌లైన్ చేయలేదు. రెండోసారి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి పేరు మీదకు 2018లో ఆన్‌లైన్ చేశారు. నాటి నుంచి ఎల్లమ్మ తమ కుటుంబసభ్యులతో నిత్యం కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. చెవిలో ఉన్న కమ్మలు సైతం తాకట్టు పెట్టి తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# కరవుతో 'పాడి'పోయింది!



పుట్టపర్తి: కరవు.. శ్రీసత్యసాయి జిల్లాలో పాడిపరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. పశుగ్రాసం కొరత ఫలితంగా పశుపోషణ తగ్గింది. ఫలితంగా గేదెలు, ఆవులు సంఖ్య తగ్గుముఖం పట్టింది. జిల్లాలో గత ఆరు నెలలుగా పశుసంవర్ధక శాఖ పశుగణన (సర్వే) నిర్వహించింది. ఈనెల 15న ముగిసిన సర్వేలో 5,34,979 కుటుంబాల నుంచి గేదెలు, ఆవులు, గొర్రెలు, కోళ్లు, పందులు, గుర్రాలు, పక్షులు సహా 16 రకాల పెంపుడు జంతువుల వివరాలు సేకరించి నమోదు చేశారు. 2019 పశు గణనతో పోలిస్తే పాడి పశువు సంఖ్య తగ్గినట్లు వెల్లడైంది.

**తగ్గుదల ఇలా..:** జిల్లాలో గేదెలు, ఆవులు సంఖ్య 8 శాతం తగ్గింది. ఫలితంగా పాల ఉత్పత్తి తగ్గి.. ధరలు పెరిగాయి. రూ.45 – 50 మధ్య ఉన్న లీటరు పాలు ప్రస్తుతం రూ.70కు పైగానే పలుకుతోంది.

**జీవాల పెంపకంపై ఆసక్తి**

గొర్రెలు, మేకల పెంపకంపై రైతులు, వ్యవసాయ కూలీలు ఆసక్తి కనబరిచారు. దీంతో వాటి పెరుగుదల 45 శాతంగా నమోదైంది. అదేవిధంగా కోళ్లు 11 శాతం పెరిగాయి.

**నిర్లక్ష్యం చేయడంతో..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాడిపరిశ్రమకు చేయూత ఇవ్వలేదు. రాయితీతో పశుగ్రాసం విత్తనాలు, పెంపకానికి ఉపాధి నిధులివ్వలేదు. ఇది పాడిరైతులపై తీవ్ర ప్రభావం చూపింది. దీనికితోడు కరవు పరిస్థితులు తలెత్తి గడ్డి కొరత ఏర్పడింది. పశుబీమా పరిహారం కూడా మంజూరు చేయలేదు. గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టిన వారికీ బిల్లులూ ఇవ్వలేదు. పాడిపశువులను విక్రయించి రైతులు కూలీ పనులకు వెళ్తున్నారు. ఫలితంగా పశు సంపద తగ్గుముఖం పట్టింది.

**రీసర్వేలో తప్పిదాలకు ఆస్కారం వద్దు**

ధర్మవరం: ఎలాంటి తప్పిదాలు జరగకుండా భూముల రీసర్వే నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ధర్మవరం ఆర్‌డీఓ కార్యాలయంలో రీసర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే నిర్వహించేటప్పుడు స్థానికంగా తలెత్తే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌డీఓ మహేశ్, తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

**ఈవీఎం గోదాము తనిఖీ**

ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. గోదాముల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల గోడలు చీలికలు ఏర్పడటంతో వాటిని మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షం నీరు గోదాములోకి రాకుండా సరైన చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ యార్డు ఆవరణంలో ఉన్న పౌరసరఫరాల గోదాము తనిఖీ చేశారు.

**ప్రభుత్వానికి నివేదించాం**

శుభదాస్, ఏడీ, పశుసంవర్ధకశాఖ, పుట్టపర్తి

జిల్లాలో అఖిల భారత పశు గణన సర్వే పూర్తయ్యింది. గణాంక వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. జిల్లాలో పశుసంపద తగ్గినప్పటికీ గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం పెరిగింది. ఆదాయంపై పశుపోషకులు దృష్టి సారిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పశు సంపద పెరిగే అవకాశం ఉంది.

## నిర్మించారు.. వదిలేశారు

పుత్తూరు: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని శీతల గిడ్డంగి(కూలింగ్ ఛాంబర్) నిర్మించాలని కేంద్రం ప్రభుత్వం 2015లో నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో పుత్తూరు, పాకాల, బంగారుపాళ్యం, వి.కోట, పలమనేరు, పుంగనూరు మార్కెట్ యార్డులలో కూలింగ్ ఛాంబర్లు నిర్మించారు. ఈ పనులను బెంగళూరు చెందిన గుత్తేదారుడు దక్కించుకున్నారు. అయితే అతని నుంచి అనంతపురానికి చెందిన వారు సబ్‌లీజు తీసుకుని నిర్మాణం చేపట్టారు. పుత్తూరు, బంగారుపాళ్యం మార్కెట్‌యార్డుల్లో నిర్మాణం చేపట్టిన నాటి నుంచి నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో ఇక్కడ పండ్లు మాగబెట్టేందుకు గానీ, ఆపిల్ పండ్లు నిల్వ చేసేందుకు వీలుకాని పరిస్థితి. దీంతో అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ ఆశయానికి గండిపడింది. ఒక్కో ఛాంబర్‌లో 20 టన్నుల వరకు నిల్వ చేసుకోవచ్చు. పండ్లు మాగబెట్టేలా వీటిని



నిర్మించారు. పుత్తూరు ఛాంబర్ రూ.40 లక్షలు, బంగారుపాళ్యం కూలింగ్ ఛాంబరుకు రూ.33 లక్షలు, పాకాల యార్డులో రూ.40 లక్షలతో నిర్మాణం చేపట్టారు. ఈ మూడు శీతల గిడ్డంగులు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఈ ఛాంబర్లలో ఇథలిన్ గ్యాస్‌తో మామిడి, అరటి, సపోటా మాగబెట్టుకోవచ్చు. కూలింగ్‌తో ఆపిల్ పండ్లు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో మిగిలిన చోట్ల నిర్మించిన కూలింగ్ ఛాంబర్లలో చింతపండు, టమాటాలు నిల్వ చేస్తున్నారు.

**ప్రజల ఆరోగ్యం కోసమే**

గతంలో కార్బైడ్ వినియోగించి పండ్లు మాగబెడుతున్నట్లు ఆకస్మిక దాడుల్లో గుర్తించారు. ఈ పండ్లు తిన్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నట్లు విచారణలో తేలింది. డాక్టర్లు, శాస్త్రవేత్తలు సైతం ఇథలిన్ గ్యాస్‌తో మాగబెట్టిన పండ్లు తినవచ్చని సూచించారు. ఈ నేపథ్యంలో కేంద్రం నిధులు మంజూరు చేసింది. వాటితో కూలింగ్ ఛాంబర్లు నిర్మించారు. అయితే ప్రభుత్వం శీతల గిడ్డంగులను స్థానిక మార్కెట్‌యార్డుల్లో నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా అటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు, ఇటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చనేది ప్రభుత్వ ఉద్దేశం. ప్రస్తుతం మామిడి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వాటిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

## గుత్తి జంక్షన్ శివారులో.. దడ!

గుత్తి: రైలు ప్రయాణికుల భద్రతను పోలీసులు గాలికి వదిలేస్తున్నారు. తరచూ దోపిడీలు జరుగుతున్నా నిలువరించే దిశగా గట్టి ప్రయత్నాలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రాత్రిళ్లు స్టేషన్ల శివారులో రైళ్లు ఆపినప్పుడు దుండగులు పక్కా వ్యూహంతో దోపిడీలకు తెగబడుతున్నారు. గుత్తి జంక్షన్ శివారులో సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. గుత్తి–పెండేకల్లు మార్గంలో ప్రయాణికులు హడలిపోతున్నారు. నాలుగేళ్ల కిందట మూడుసార్లు ఒకే చోట దోపిడీలు జరిగాయి. తాజాగా నిజామాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు రెచ్చిపోయారు. ఐదేళ్లల్లో ఇప్పటి వరకు గుత్తి జంక్షన్ శివారులో పెండేకల్లు మార్గంలో నాలుగుసార్లు దోపిడీకి పాల్పడ్డారు. ప్రయాణికులు గాఢనిద్రలోకి జారుకున్నప్పుడే బోగీల్లోకి చొరబడుతూ బంగారం, నగదును ఎత్తుకెళ్తున్నారు.



**రెండు ప్లాట్‌ఫాంలు అసంపూర్తిగా..**

ప్రధానంగా రాత్రిళ్లు గుత్తి–పెండేకల్లు మార్గంలో వెంకటాద్రి, ఎగ్మోర్, కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు వారాంతపు రైళ్లు తిరుగుతుంటాయి. గుత్తి జంక్షన్‌లో రెండు ప్లాట్‌ఫాంలు అందుబాటులో ఉన్నాయి. మరో రెండు అసంపూర్తిగా ఉన్నాయి. అర్ధరాత్రి దాటిన తరువాత గుత్తి–బెంగళూరు మధ్య ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తుంటాయి. రెండు లైన్లలో రైళ్లు ఉన్నప్పుడు ఆపరేటింగ్ అధికారులు శివారులో నిలుపుతున్నారు. ఇదే దోపిడీలకు ఆస్కారంగా మారింది. ఏడాది కిందట తురకపల్లి రైల్వేస్టేషన్ వద్ద దుండగులు సిగ్నళ్ల తీగలను కత్తిరించడంతో రైలు ఆగిపోయింది. తరువాత దోపిడీకి పాల్పడ్డారు. జక్కలచెరువు స్టేషన్ సమీపంలోనూ ఇలానే జరిగింది.

# సాగు రెట్టింపు.. దిగుబడులున్నా నిరాశే



పుంగనూరు : తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు టమాటా ఎగుమతుల్లో చిత్తూరు జిల్లా టాప్. అక్కడి పట్టణాల అవసరాలను 70 శాతం ఇక్కడి మార్కెట్లే తీరుస్తాయి. ఏటా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు టమాటా సీజన్. ప్రస్తుతం నవంబరు, డిసెంబరు వరకు ఉంటుంది. అధిక మంది వేసవిలో దిగుబడులు వచ్చేలా సాగు చేస్తారు. అక్కడ పంట లేక ఇక్కడ మంచి ధరలు పలుకుతాయి. ఊహించని విధంగా ఈ ఏడాది అక్కడి మార్కెట్లకు స్థానిక టమాటా రావడంతో పశ్చిమ ప్రాంత మార్కెట్లు వెలవెలబోతున్నాయి.

వాతావరణం అనుకూలించడంతో రైతులు గతేడాది కంటే అధికంగా పంట సాగు చేశారు. 2024లో 1100 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ దఫా 2,250 ఎకరాలకు పెరిగింది. అకాల వర్షాలు లేకపోవడంతో దిగుబడి సైతం గణనీయం వచ్చింది.

**రూ.150 మించని బాక్స్ ధర..** గత సీజన్‌లో ఆయా మార్కెట్లలో టోకు ధర సరాసరి రూ.25–30తో 15 కిలోల బాక్స్ రూ.250–300 మధ్య కొనుగోలు చేశారు. ప్రస్తుతం తమిళనాడు, కర్ణాటక మార్కెట్లకు స్థానిక సరకు వస్తుండటంతో వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది గత నెల రోజులుగా మూడు మార్కెట్లలోనూ కిలో రూ.10 లోపే పలుకుతోంది. 15 కిలోల బాక్స్ రూ.150 మించలేదు.

మే చివరకు పరిస్థితి మారే అవకాశం.. మూడు మార్కెట్లకు రోజుకు 1,100 నుంచి 1,200 టన్నుల సరకు వస్తుంది. తమిళనాడు, కర్ణాటకతో పాటు కోల్‌కతా, దిల్లీ, విశాఖపట్నం, శ్రీకాకుళం, అనకాపల్లి ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. ఆయా ప్రాంతాల్లో కోతలు ఇప్పటికే చివరి దశకు వచ్చాయని, ఇక్కడ ప్రస్తుతం మొదటి దశలో ఉన్నాయని.. మే చివర, జూన్‌లో ధరలు పెరగొచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

**ఇంట్లో వాళ్లమే కోస్తున్నాం: రామకృష్ణ, టమాట రైతు, కురపల్లె**

రూ.7.50 లక్షలతో మూడు ఎకరాలు సాగు చేశా. ధర తక్కువగా ఉండటంతో కూలీలను పెట్టకుండా ఇంట్లో వాళ్లమే కోస్తున్నాం. ఇప్పటి వరకు మూడు కోతల్లో రూ.15 వేలు మిగిలింది. కూలీలను పెడితే ఖర్చులు కూడా దక్కే అవకాశం లేదు.

**తోటలో వదలలేక..: మోహన్ నూనెముద్దలపల్లె**

రూ.లక్షలు వెచ్చించి సాగు చేసిన తోటలో కోతలు పడ్డాయి. ధరలు లేవని వదల్లేక కోస్తున్నాం. నాలుగు ఎకరాలకు రూ.12 లక్షలు ఖర్చు చేశా. ఇప్పటి వరకు రూ.40వేలు వచ్చింది. రూ.10 లక్షలు నష్టపోయే పరిస్థితి.

## నాణ్యతకు గోరీ..
## నామమాత్రం రికవరీ

నంద్యాల : పల్లె పనుల్లో నాణ్యత తప్పింది.. నాణ్యతా విభాగం అధికారులు వందల కేసులు నమోదు చేశారు.. పనులు చేపట్టిన గుత్తేదారుల వద్ద డబ్బులు వసూలు చేయాలని ఆదేశించారు.. కానీ పంచాయతీ రాజ్ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన–3, నాబార్డు, ఈఏపీ, ఏఐఐబీ పనులు, ఉపాధి హామీ పథకం కింద అంతర్గత రహదారులు, పల్లె పండగలో భాగంగా సీసీ రోడ్లు, జడ్పీ జనరల్ ఫండ్స్, 15 శాతం ఎస్సీ ఈఎంఎఫ్, 23 శాతం జడ్పీ జనరల్ ఫండ్స్, పీఆర్ రోడ్ల పునర్నిర్మాణం, ఏపీఆర్‌ఆర్‌పీ, పీఎంజీఎస్‌వై నిధులతో వివిధ రకాల పనులు చేపట్టారు. వీటిలో తారు రహదారులు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, భవనాలు, అంతర్గత రహదారులు, పంట కాల్వలు ఉన్నాయి. వాటిలో నాణ్యత లోపించినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

**పట్టించుకోని ఏఈలు**

కర్నూలు, ఆదోని, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, బనగానపల్లిలో పంచాయతీరాజ్ నాణ్యతా నియంత్రణ విభాగం సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న పనులను ఏఈలు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. పనుల నమూనాలు సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలి. నాణ్యత లేనట్లు తేలితే ఆ పనులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి డబ్బుల రికవరీకి ఆదేశించాలి. రికవరీ చేసే బాధ్యత ఏఈలపై ఉండగా వారు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన డీఈలు శ్రద్ధపెట్టడం లేదు. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,594 కేసులు నమోదు చేస్తే ఇప్పటి వరకు 1323 కేసులకు సంబంధించి మాత్రమే రికవరీ జరిగింది. మరోవైపు ఆ పనులకు బిల్లులు చకాచకా చేస్తున్నారు. కేసులతో సరి పెట్టారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో గోస్పాడు,



నంద్యాల మండలాల్లో 32 కేసులు నమోదు చేశారు. రూ.2.25 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు రూ.25 వేలు వసూలైంది. మహానంది మండలం గోపవరం, అబ్బీపురం, మహానంది, గాజులపల్లెలో 12 పనులపై కేసులు నమోదు చేసినా రికవరీ జరగలేదు. గోస్పాడు మండలంలో ఆరు నెలల కిందట గ్రామ పంచాయతీల తీర్మానం లేకుండానే కొన్ని ఉపాధిహామీ పనులు ఏకపక్షంగా చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకుండానే ఈ పనులు జరిగిపోయాయి. ఇటీవల పనులు పరిశీలించిన నాణ్యతా విభాగం అధికారులు నాలుగు పనుల్లో అక్రమాలు జరిగినట్లు నివేదించారు. ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదు.

డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలంలోని యంబాయి, రామళ్లకోట, రుద్రవరం, సిమెంట్ నగర్‌లో జరిగిన పనుల్లో మూడింటిపై కేసులు నమోదు చేశారు. రికవరీ చేసింది 10 శాతం లోపే. కొత్తపల్లి మండలంలో 12 కేసులకు 9, వెలుగోడులో 16కు 2, ఆత్మకూరు మండలంలో 14కు గాను 3 కేసుల్లో గత ఆర్థిక సంవత్సరంలో రికవరీ జరిగింది. మహానందిలో ఈ రోడ్డును నాసిరకంగా నిర్మించారని నాణ్యతా విభాగం అధికారులు తేల్చారు.

## 'కుట్టు'కథలు

చిత్తూరు : ప్రభుత్వం అవకాశమిచ్చినా ఎమ్మెల్యేల నిర్లక్ష్యం మహిళల జీవనోపాధి కల్పనకు అవరోధంగా మారింది. కొన్నిచోట్ల నామమాత్రంగా శిక్షణ కేంద్రాలు తెరుచుకున్నా, ఎంపిక చేసిన అన్ని కేంద్రాలు ఇంకా తెరుచుకోలేదు. శిక్షణ కేంద్రాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యేలు సమయం కేటాయించకపోవడంతో అధికారులు వారిని సంప్రదిస్తుండగా, రిజిస్ట్రేషన్ చేయించుకున్న మహిళలు నిరీక్షిస్తున్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో 23 కేంద్రాలను గుర్తించి నెల రోజులు గడుస్తున్నా ఇంకా 10 చోట్ల శిక్షణ ప్రారంభం కాలేదు.

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 5555 మందికి మొదటి విడతలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 23 కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 13 కేంద్రాల్లో మాత్రమే శిక్షణ ప్రారంభించారు. మొత్తం 6781 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2505 మంది వివరాలను మ్యాపింగ్ చేయగా, ఇంకా 4276 మంది మ్యాపింగ్ చేయలేదు.

**ప్రారంభం కాని కేంద్రాలివే..** పలమనేరు, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణిలో మూడు కేంద్రాలను కేటాయించారు. వీటిలో శిక్షణకు 618 మంది మహిళలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నా ప్రారంభించలేదు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో కార్వేటినగరం, పెనుమూరు, ఎస్.ఆర్.పురంలో శిక్షణ కేంద్రాలను ఎంపిక చేయగా, ఎస్.ఆర్.పురంలో మాత్రమే శిక్షణ ప్రారంభించారు. ఇలా జల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇంకా శిక్షణ కేంద్రాలను ప్రారంభిచాల్సి ఉంది.

**అన్నిచోట్లా త్వరలోనే ప్రారంభిస్తాం**

జిల్లాలో నియోజకవర్గాల వారీగా శిక్షణ కేంద్రాలను ఎంపిక చేశాం. 13 చోట్ల శిక్షణ ప్రారంభించాం. మిగిలిన చోట్ల స్థానిక ఎమ్మెల్యేలు తేదీలను ఖరారు చేస్తే త్వరలోనే శిక్షణ ప్రారంభిస్తాం.

శ్రీదేవి, ఈడీ, బీసీ కార్పొరేషన్

# నాటుకోళ్ల పెంపకం.. నిశ్చింతగా ఆదాయం



పరిగి : పరిగికి చెందిన భరత్‌రెడ్డి బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం విధుల్లో ఉన్నాడు. ప్రత్యామ్నాయ ఆదాయంలో భాగంగా తల్లిదండ్రులు, తోటి మిత్రుల ప్రోత్సాహంతో తిరుమలదేవరపల్లి గ్రామ సమీపంలో ఉన్న తనకున్న ఫాం హౌస్‌లో నాటు కోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. అనుకున్నదే తడువుగా కోళ్ల పెంపకానికి అనువైన షెడ్డును నిర్మించాడు. పట్టుపురుగులు పెంచే రేరింగ్ షెడ్డుకు అనుబంధంగా రూ.2 లక్షలతో రేకుల షెడ్డును ఏర్పాటు చేసుకున్నాడు.

**బరువుకు తగ్గ రాబడి**250 గ్రాములున్న కోడిపిల్లను మూడునెలలు పాటు పెంచితే ఒక్కోటి ఒకటిన్నర కిలో నుంచి రెండు కిలోల వరకు బరువు తూగుతుం దన్నారు. రోగాలు, ఇతర కారణాలతో 100 కోళు చనిపోయినా మిగిలిన 400 వందల కోళ్లను కిలో రూ.350లతో విక్రయించి రూ.2.80 లక్షలు రాగా, దాణా ఖర్చులు రూ.50 వేలు పోతుంది. ఇదంతా కేవలం మూడు నెలల్లో వచ్చే ఆదాయం.

**తమిళనాడు నుంచి కోడిపిల్లలు**

తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి 500 వరకు నాటు కోడిపిల్లలను ఒక్కోటి రూ.105లతో కొనుగోలు చేశారు. వీటిని షెడ్డులో ఉంచి గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. మొక్కజొన్న, తెల్లజొన్న, స్నేహ తదితర రకాల కోళ్ల దాణాతో పాటు, వృథాగా మిగిలిపోయిన టమోటా, ఆకు కూరలను తెచ్చి కోళ్లకు మేతగా వేస్తుంటారు.

**తక్కువ పెట్టుబడులతో..** నాటు కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తోంది. మూడు నెలల పాటు నాటు కోళ్లను పెంచితే శ్రమకు తగ్గ ప్రతిఫలం లభిస్తుంది. నెలకు రూ.74వేలు చొప్పున ఆర్జించవచ్చు. ప్రతి యువ రైతులు నాటు కోళ్ల పెంచేందుకు చొరవ తీసుకుంటే లాభాలు గడించవచ్చు.

భరత్‌రెడ్డి, పరిగి

# సిరులు నింపిన సీలేరు!

ఉండి : మార్చి 25న గరిష్ఠ స్థాయిలో 9,553 క్యూసెక్కుల జలాలు సీలేరు నుంచి గోదావరిలోకి చేరాయి. ఏప్రిల్ 1న 8,891 క్యూసెక్కులు ఇచ్చారు. సహజ ప్రవాహాలతో కలిపి 10,778 క్యూసెక్కుల జలాలు గోదావరిలోకి చేరుతున్నాయి. పశ్చిమడెల్టాకు గత నెల 16 నుంచి బుధవారం వరకు 5,500 క్యూసెక్కుల చొప్పున నీరు ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రబీ వరి పంటకు సీలేరు జలాలు జీవం పోశాయి. కీలక దశలో సీలేరు నుంచి నీటి విడుదల పెంచడంతో పాటు వారబందీ విధానంలో అన్ని ప్రాంతాలకు సర్దుబాటు చేయడంతో సత్ఫలితాలు వచ్చాయి. పశ్చిమ డెల్టాలో కొన్ని చోట్ల వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఎగుమతి కోసం తాడేపల్లిగూడెం, పెంటపాడు తదితర మండలాల్లో పరిమిత విస్తీర్ణంలో సాగుచేసిన ఎంఎల్ 10, పీఆర్ 126 వరి రకాల దిగుబడి ఎకరాకు 60–65 బస్తాల మధ్య వస్తోంది. పంట గట్టెక్కిన చోట్ల ఎంఎల్ 10 రకాన్ని మరమరాల తయారీ కోసం వ్యాపారులు వెనువెంటనే కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో అన్ని మండలాల్లో వరి పంట గట్టెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సారిఎకరాకు సగటున 4,175 కిలోల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**అవసరాన్ని బట్టి పెంచుతూ..** గోదావరిలో నీటి లభ్యత తగ్గిపోతుండటంతో రబీ వరి సాగుకు సీలేరు జలాలే ఆధారమని డిసెంబరులోనే యంత్రాంగం గుర్తించింది. ఉన్న నీటినే పొదుపుగా వాడుకొనేలా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి వారబందీ (వంతులవారీ) విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఫిబ్రవరి 15 నాటికి సీలేరు నుంచి సహజంగా



వచ్చే 4,044 క్యూసెక్కులకు తోడు బైపాస్ విధానంలో మరో 3 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. తర్వాత నుంచి అవసరాన్ని నీటి విడుదలను పెంచుతూ వచ్చారు.

**క్షేత్ర పర్యవేక్షణతో..** పంట కీలక దశకు చేరిన సమయంలో పాలకోడేరు, ఆకివీడు, దెందులూరు, కాళ్ల, ఉండి, నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం తదితర మండలాల్లోని మెరక భూముల్లో సాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. నీటి వినియోగదారుల సంఘాలు, అధికారుల పర్యవేక్షణతో సమస్యను అధిగమించారు. ముందుగా నాట్లేసిన తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయని, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

**పశ్చిమలో సాగు వివరాలు**

వరి పంట విస్తీర్ణం: 2.20 లక్షల ఎకరాలు
రైతుల సంఖ్య : 1.08 లక్షలు
దిగుబడి అంచనా: 4,175 కిలోలు (ఎకరానికి)
ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం: 6 లక్షల టన్నులు

# 'అక్షరం' అడుగుతోంది నిధి

కర్నూలు : మన బడి నాడు–నేడు అంటూ గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది.. ఉన్న గదులు పడగొట్టింది.. కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతామన్నారు.. తీరా నిధులివ్వకుండా కాలయాపన చేసింది.. అర్ధంతరంగా ఆగిపోయిన పనులు భావితరం చదువులకు ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం మౌలిక వసతుల కల్పనకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.67.84 లక్షలు కేటాయించారు.. మరిన్ని నిధులు కేటాయించి వేసవి సెలవుల్లో పనులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు.

**నాడు.. నేడు.. పూర్తి ఎప్పుడో**

ఉమ్మడి జిల్లాలో 80 శాతం పాఠశాలలను నాడు–నేడు కింద ఎంపిక చేసినట్లు గతంలో ప్రకటించారు. మొదటి విడత ఎంపిక చేసిన బడుల్లో 20 శాతం వరకు పనులు మిగిలిపోయాయి. రెండో విడత కింద అదనపు గదులు నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కో గదికి రూ.12 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రెండో విడత 1,827



పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందుకు రూ.789.04 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. చాలా చోట్ల ఉన్నవి పడగొట్టారు. నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్లకు తలుపులు లేవు. నీటి సౌకర్యం లేకపోవడంతో భరించరాని దుర్వాసన వస్తోంది.

**పనులు కదలక..**

సంతోష్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నాడు–నేడు కింద ఎంపిక చేయడంతో ప్రహరీతోపాటు మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించారు. నిధులు రాకపోవడంతో గుత్తేదారుడు పనులు ఆపేశారు. కొద్దిపాటి నిధులు కేటాయిస్తే పనులు పూర్తై పిల్లల కష్టాలు తీరుతాయి.

**మౌలిక వసతుల కల్పన**

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాకు రూ.6.80 లక్షలు, నంద్యాలకు రూ.61.04 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలోని బసవపురం ఎంపీపీ పాఠశాల, మునగాలపాడు ఎంపీపీ ఉర్దూ పాఠశాలల్లో విద్యుదీకరణ పనులు చేపట్టేందుకు ఒక్కో బడికి రూ.1.50 లక్షలు కేటాయించారు. పాతబస్తీలోని ఖలీల్‌వాడలో ఎంసీయూపీ ఉర్దూ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.నంద్యాల జిల్లా పరిధిలో బోడెమ్మనూరు ఎంపీపీఎస్, బనగానపల్లె ఎంపీయూపీఎస్‌లో ప్రహరీల నిర్మాణానికి రూ.39.84 లక్షలు, బనగాన పల్లి ఎంపీయూపీఎస్, నంద్యాల వైఎస్ఆర్ నగర్‌లోని ఎంపీఎల్ యూపీఎస్‌లో మరుగుదొడ్ల పూర్తికి రూ.11.40 లక్షలు, మద్దికుంటతండాలోని ఎంపీపీఎస్‌లో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.3.80 లక్షలు, పిక్కిలపల్లితండా, ముసలాయి చెరువు, సీతమ్మతండా, మద్దికుంట తండా ఎంపీపీఎస్‌లలో విద్యుదీకరణ పనులకు రూ.6 లక్షలు కేటాయించారు.

# రైల్వే ప్రాజెక్టులకు ఊపిరి!



తిరుపతి : ఐదేళ్ల జగన్ పాలనలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రైల్వే ప్రాజెక్టులు పడకేశాయి. భూసేకరణ, లైన్ల నిర్మాణానికి వైకాపా ప్రభుత్వం ఏమాత్రం చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించారు. పలు శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని గుర్తించి.. రైల్వే, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులతో కలిపి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఫలితంగానే ఒక్కో ప్రాజెక్టులో ఇప్పుడిప్పుడే కొంత కదలిక వస్తోంది. ఇదే ఉత్సాహంలో రెండు వరుసలు (డబ్లింగ్), నూతన రైల్వే లైన్ల నిర్మాణానికి కలెక్టర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎప్పటిలోపు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందిస్తారో సవివరంగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్ వివరించారు. చిత్తూరు, తిరుపతి ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురుమూర్తి కూడా చొరవ తీసుకుంటే రైల్వేశాఖ పనుల్లో పురోగతి కనిపిస్తుంది.

**ఏడేళ్ల సమస్యకు ఆరు నెలల్లో పరిష్కారం**

రేణిగుంట రైల్వేస్టేషన్‌కు రైల్వే బైపాస్ మంజూరై ఏడేళ్లయినా రెండు ఎకరాల భూసేకరణలోనే చిక్కంతా వచ్చింది. 51 కుటుంబాలకు పరిహారం ఇచ్చినా ఖాళీ చేయలేదు. షికారీల సమస్య ఉంది. ఇందుకోసం కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.14 కోట్ల పరిహారం విడుదల చేయించి ఆరు నెలల్లో సమస్య పరిష్కరించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

**తిరుపతి– బెంగళూరు వయా కుప్పం మరో లైన్..**

తిరుపతి– బెంగళూరు వయా కాట్పాడి, కుప్పం వరకు ఒకే లైన్ ఉండటంతో రైళ్ల నిరీక్షణ సమయం పెరిగింది. దీన్ని డబ్లింగ్ చేయాలని చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. బంగారుపేట– జోలార్‌పేట వయా కుప్పం మీదుగా మూడు, నాలుగు లైన్ల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. తిరుపతి– కాట్పాడి మధ్య డబ్లింగ్‌కు ఆమోదం లభించిందని.. భూసేకరణ వేగంగా చేస్తామని పేర్కొన్నారు.

**90.38 ఎకరా**

గూడూరు– రేణిగుంట రైల్వేలైన్ రాజధాని అమరావతిని అనుసంధానం చేస్తుంది. సరకు రవాణా వేగానికి దోహదపడుతుంది. మూడో లైన్ నిర్మించాలని ఎప్పటినుంచో యత్నాలు జరుగుతున్నాయి. చివరికి ప్రధానమంత్రి గతిశక్తి కార్యక్రమంలో భాగంగా రూ.884 కోట్లతో 83.17 కి.మీ. మేర లైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిర్మాణానికి 90.38 ఎకరాలు అవసరమన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి జేసీ శుభం భన్సల్‌ను కాంపిటెంట్ అథారిటీగా నియమించారు. భూసేకరణ దిశగా ఇటీవల అడుగులు పడ్డాయి. త్వరలో సర్వే చేయనున్నారు. ఎవరెవరు భూములు కోల్పోతారు? పరిహారం ఎంత ఇస్తారు? అన్న వివరాలతో నోటిఫికేషన్ ఇస్తారు. ఆపై భూమిని రైల్వేశాఖకు అప్పగిస్తారు. పనులు మూడేళ్లలో చేయాలని రైల్వేశాఖ లక్ష్యం పెట్టుకుంది. ఏర్పేడు– పూడి మధ్య నూతన రైలుమార్గం రేణిగుంట రైల్వే జంక్షన్‌పై ఒత్తిడి తగ్గిస్తుంది. 25.36 కి.మీ. మేర సాగే ఈ మార్గంలోనూ సర్వే పనులు చురుగ్గా చేస్తున్నారు. లైన్ ఏయే ప్రాంతాల మీదుగా వెళుతుందనే అంశంపై సమాచారం సేకరిస్తున్నారు. త్వరలోనే పరిహారంపై ప్రకటన చేయనున్నారు. కీలకమైన నడికుడి– శ్రీకాళహస్తి మార్గంలో ఇప్పటికే భూసేకరణకు రూ.20 కోట్లు విడుదల చేశారు. మిగతా మొత్తమూ ఇస్తే ఈ పనులు కూడా వేగం పుంజుకుంటాయి.

# కైలాసగిరిపై 'నడక' యాతన..!



అనకాపల్లి : కైలాసగిరిపై పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొన్ని బ్యాటరీ కార్లు మూలకు చేరాయి. కొండ ప్రాంతం కావడం..ఎత్తు ఎక్కువగా ఉండడంతో నడిచేందుకు వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. గతంలో బ్యాటరీ కార్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. వారు పర్యాటకుల నుంచి అధికంగా రుసుము వసూలు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఈ ఏడాది జనవరిలో అనుమతులు రద్దు చేశారు. అంతకుముందున్న వాహనాలు మూలకు చేరి తుప్పుపట్టిపోయాయి.**రెండు కి.మీ. మేర పర్యాటక ప్రాంతాలు:** కైలాసగిరికి వచ్చే పర్యాటకు లు తమ వాహనాలను ప్రవేశ మార్గం వద్ద ఉంచి కొండపైకి నడిచివె ళ్లాలి. ప్రవేశమార్గం నుంచి తెలుగు మ్యూజియం సుమారు 2 కి.మీ. దూరం ఉంది. ఆ మార్గంలోని శివపార్వతులు, శంకునామ చక్రాల భవనం, మెహర్‌బాబా ఆశ్రమం, శాంతి ఆశ్రమం వంటి ఎత్తయిన ప్రదేశాలకు నడిచివెళ్లాలంటే వృద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారి కోసం గతంలో సర్క్యులర్ రైలు నిర్వాహకులు ఉచితంగా బ్యాటరీ కార్లను నడిపేవారు. తర్వాత గడువు పూర్తి కావడంతో నిలిపివేశారు.

**అందుబాటులో ఒకటే:** పర్యాటకుల వినతి మేరకు గత ఏడాది చివరలో ఇద్దరు గుత్తేదారులు చెరో రెండు బ్యాటరీ కార్లను నడిపేందుకు వీఎంఆర్‌డీఏ అనుమతులు ఇచ్చింది. ఒక్కోదానికి నెలకు రూ.10వేల చొప్పున చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. పర్యాటకులు ఒక్కొక్కరి నుంచి రూ.20 మాత్రమే రుసుము వసూలు చేయాలని నిబంధన విధించింది.

ఇద్దరిలో ఒక గుత్తేదారు మాత్రమే రెండు బ్యాటరీ కార్లను నడిపారు. తర్వాత అతను అదనపు రుసుములు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదులు రావడంతో తొలగించారు.ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ సొంతంగా ఒక బ్యాటరీ కారు నిర్వహిస్తోంది. ఇటీవల పర్యాటకుల తాకిడి పెరగడంతో ఒక్కదాంట్లో ఎక్కువ మందిని సర్దుబాటు చేయలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కారు నడిపే వ్యక్తి సెలవు పెడితే మూలన ఉంచాల్సిందే.**బహిరంగ వేలం ద్వారా..:** బ్యాటరీ కార్లు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికొచ్చింది. ఈ వేసవిలోనే వాటిని అందుబాటులోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నాం. పారదర్శకంగా బహిరంగ వేలం ద్వారా బ్యాటరీ కార్ల నిర్వహణను అప్పగిస్తాం. ఎం.వి.ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్

# భవితకు భరోసా!



పాడేరు: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం నిర్వహించే భవిత కేంద్రాలను వైకాపా హయాంలో నిర్లక్ష్యం చేశారు. పిల్లలకు అవసరమైన పరికరాల సరఫరా నుంచి వారికి అందజేయాల్సిన భత్యాల విషయంలోనూ జాప్యం చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. పిల్లలు, వారికి బోధించే సిబ్బందికి అలవెన్స్‌లను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తూ జీతాలు సకాలంలో అందిస్తూ భవితకు భరోసానిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో కొన్ని రకాల పరికరాలను ఈ కేంద్రాలకు అందజేశారు. వ్యక్తిగత ఉపకరణాల పంపిణీకి శ్రీకారం చుట్టారు.ఉమ్మడి జిల్లాలో 67 భవిత కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో సుమారు 7 వేల మంది ప్రత్యేక అవసరాల చిన్నారులున్నారు. వీరికి అక్షరాలు నేర్పించడంతో పాటు ఫిజియోథెరపీ, ఇతర రకాల సేవలందించడం ద్వారా సాధారణ పిల్లల స్థితికి తీసుకువచ్చేందుకు ఈ కేంద్రాలు తోడ్పడుతుంటాయి. ఇక్కడకు వచ్చేవారంతా పేదింటి పిల్లలే. వీరిని ఆయా కేంద్రాలకు తీసుకువెళ్లడానికి తల్లిదండ్రులు, సంరక్షకులకు తలకుమించిన భారం అవుతోంది. దీంతో కొందరే పిల్లలను కేంద్రాలకు తీసుకెళ్తున్నారు. సకాలంలో ఆర్థిక సాయం అందిస్తే కేంద్రాలకు వచ్చేవారి సంఖ్య పెరగడానికి అవకాశం ఉందని కూటమి సర్కారు గుర్తించింది. కొన్ని రకాల భత్యాలు (అలవెన్స్‌లు) పెంచాలని నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన అలవెన్స్‌లు అందజేయనుంది. ఆడపిల్లల కు ఇదివరకు పది నెలలకు ఎస్కార్ట్ (తోడు) అలవెన్స్ కింద రూ.3 వేలు, రవాణా భత్యం కింద రూ.3 వేలు ఇచ్చేవారు.

విశాఖ జిల్లాలో 158 మంది పిల్లలకు సుమారు రూ. 9.68 లక్షల విలువైన పరికరాలను అందించబోతున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 308 మంది పిల్లలకు సుమారు రూ. 45 లక్షల విలువైన ఉపకరణాలు పంపిణీ చేయనున్నారు. వీటిని జిల్లాస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి అందజేస్తామని ఉమ్మడి జిల్లా సమగ్రశిక్షా అదనపు సమన్వయకర్తలు చంద్రశేఖరరావు, జయప్రకాశ్, స్వామినాయుడుకు తెలిపారు.అనకాపల్లి జిల్లాలోని 24 భవిత కేంద్రాలకు ఇటీవల జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ (ఎన్‌టీపీసీ) ద్వారా సీఎస్ఆర్ నిధులతో ఆట వస్తువులు, బోధన, ఫిజియోథెరపీ పరికరాలను అందజేశారు. సుమారు రూ. 12.9 లక్షల విలువైన పరికరాలను సమకూర్చడంతో భవిత కేంద్రాల్లో కొత్తకళ కనిపిస్తోంది. విశాఖలోని 11 కేంద్రాలకు అదే తీరున పరికరాలను అందించేలా పలు కంపెనీలను అధికారులు సంప్రదిస్తున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల్లో కొంతమంది ఉపకరణాలు తోడు లేకుంటే నడిచే అవకాశం ఉండదు. అలాంటి వారికి బ్యాటరీతో నడిచే చక్రాల కుర్చీలు, చేతి కర్రలు, ఇతర పరికరాలు అందించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వంలో ఒక్క ఏడాదీ వీటిని అందించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏడాది గడవక ముందే వ్యక్తిగత ఉపకరణాలను తెచ్చింది.

# ధరలో 'మాధుర్యమేదీ'?

నూజివీడు : మధుర ఫల రాజుగా పేరొందిన మామిడికి గిట్టుబాటు ధరపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటల్లో ముందుగానే మామిడి కోతకొస్తోంది. రాత్రిళ్లు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పూతను నిలబెట్టుకునేందుకు రూ.లక్షల విలువైన మందులు పిచికారీ చేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది దిగుబడులు తగ్గాయంటున్నారు. వ్యాపారులు సిండికేట్ అయి ధరలను తగ్గించడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారులు, మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇస్తున్న సలహాలు రైతులకు ఉపయోగపడటం లేదు.

**మార్కెటింగ్ సౌకర్యం లేనట్లే**

మామిడికి మార్కెటింగ్ సౌకర్యం కోసం నున్న మార్కెట్టును నూజివీడుకు తరలిస్తామని మంత్రి పార్థసారథి ప్రకటించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు చేసి ఉద్యానశాఖ కమిషనరేట్‌కు పంపారు.



**నాణ్యత ఉంటేనే ...**

నాణ్యత అధికంగా ఉంటేనే వ్యాపారులు ధర పెంచుతున్నారు. లేదంటే వారు చెప్పిన ధరకు కాయలు మార్కెట్‌లో వదిలి రావాల్సిందే. నూజివీడు రసాలు టన్ను రూ.10 వేల నుంచి రూ.12 వేలు, బంగినపల్లి రూ.30 వేల నుంచి 50 వేలు, తోతాపురి రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. ఇది ఏమాత్రం గిట్టుబాటు కాదని నూజివీడు రైతులు పేర్కొన్నారు. తేనె మంచు పురుగు, పిండినల్లి, పండు ఈగ, రకరకాల తెగుళ్లు బారిన పడి నష్టపోతున్నామని చెప్పారు. సూచనలు కోసం రైతులు నేరుగా సంప్రదించవచ్చని ఉద్యానాధికారిణి ఆర్.హేమ తెలిపారు. కాయ రక్షణకు వినియోగిస్తున్న కవర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లా పరిధిలో 75,564 ఎకరాల్లో మామిడి సాగవుతోంది.

ఈ ఏడాది సాగర్ జలాలు కనుచూపు మేరలో కనిపించకపోవడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతం. బోరు బావులు, ట్యాంకర్లలో నీటిని తీసుకుని వెళ్లి చెట్టుకు ఉన్న కొద్దిపాటి కాయలను రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.

# అక్రమ తవ్వకం.. అవినీతి పెంపకం

నంద్యాల : చేపల చెరువులు వెల్లువలా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండానే వ్యవసాయ భూముల్లో ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారు. సమీపంలోని సాగునీటి కాల్వల నుంచి గుట్టుగా నీటిని తరలిస్తున్నారు.. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ తీసుకొని చౌర్యానికి పాల్పడుతున్నారు. కుళ్లిన మాంసం వ్యర్థాలను చేపలకు ఆహారంగా ఉపయోగించి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈ దందా రోజురోజుకు పెరిగిపోతున్నా.. మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

**వీరికి అనుమతులు అక్కర్లేదు**

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలం తంగడంచెలో 10 ఎకరాల వ్యవసాయ పొలంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆధ్వర్యంలో అక్రమ చేపల చెరువు సాగవుతోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో ఎలాంటి అనుమతి లేకుండానే రెండు చోట్ల చేపలు పెంచుతున్నారు.మంత్రాలయం మండలం రాంపురం, కగల్లు, శాతనూరు తదితర గ్రామాల్లో 10 అక్రమ చెరువులు ఉన్నాయి. కోసిగి మండలంలో మరో 10 చోట్ల అనుమతుల్లేకుండానే చెరువులు తవ్వి చేపలు పెంచుతున్నారు. ఒక్కోటి 10 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో తవ్విన వీటికి తుంగభద్ర నది నీటిని ఉపయోగిస్తున్నా అడిగేవారు లేరు.

**గడిగరేవుల.. ఆగడాలు చాలా**

గడివేముల మండలం గడిగరేవుల గ్రామంలో 30కి పైగా అక్రమ చేపల చెరువులు ఉన్నాయి. ఇక్కడ రైతులు గోరుకల్లు జలాశయం నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం భూములను లీజు పద్ధతిలో అప్పగించారు. ఈ భూముల్లో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరిగాయి. ఒక్కో రైతు 3 నుంచి 10 ఎకరాల వరకు మట్టి తవ్వకాల కోసం తమ భూములను ఇచ్చారు. కోస్తా ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఈ భూములను లీజుకు తీసుకుని చేపల చెరువులుగా మార్చారు. ఇక్కడ కొన్ని చెరువులకు కుందూనది నుంచి నీటిని అక్రమంగా తోడుకుంటున్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తూ ప్రభుత్వానికి మోసం చేస్తున్నారు.

**మట్టి దోచి.. చెరువుగా మార్చి**

నంద్యాల మండలం అయ్యలూరుమెట్టలో రెండు ప్రాంతాల్లో అనుమతి లేని చేపల చెరువులు ఉన్నాయి. ఇక్కడ గతంలో ఇటుకల బట్టీల కోసం వ్యవసాయ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టారు. దీంతో పొలాల్లో గుంతలు పడ్డాయి. వ్యవసాయానికి పనికిరాకుండా పోయిన ఆయా భూముల యజమానులతో ఒప్పందం చేసుకుని వ్యాపారులు చేపల చెరువులుగా మార్చేశారు. కొన్నేళ్లుగా చేపల పెంపకం సాగిస్తున్నారు. జిల్లా కేంద్రం చెంతనే అక్రమాలు సాగుతున్నా మత్స్యశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.

**కోళ్ల వ్యర్థాలే దాణా**

సాధారణంగా చేపలకు నాచు, ఉడికించిన మొక్కజొన్న, తవుడు లాంటి దాణాను ఆహారంగా ఇస్తుంటారు. కానీ క్యాట్ ఫిష్, ఫంగస్, తెల్లరకం చేపలు జంతు కళేబరాలు, కోళ్ల వ్యర్థాలు తింటాయి. మంచినీటిలో పెరిగే చేప నెలకు అర కిలో నుంచి కిలో వరకు పెరిగితే చికెన్ వ్యర్థాలు తినే చేపలు రెండు నుంచి ఐదు కిలోల వరకు పెరుగుతాయి. అంతేకాకుండా చేపల దాణాతో పోల్చితే చికెన్ వ్యర్థాలు తక్కువ ధరకు లభిస్తాయి. ఆయా చెరువుల్లో పెరిగిన చేపలను హైదరాబాద్, బెంగళూరు, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు. గడిగరేవుల, అయ్యలూరుమెట్ట ప్రాంతాల్లో అక్రమంగా చేపల చెరువులు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.**ఎకరానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించాలి**

ప్రస్తుతం నంద్యాలలో 700 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 300 ఎకరాల వరకు అక్రమ చేపల చెరువులు ఉన్నట్లు అంచనా. చేపల చెరువు సాగుకు అధికారికంగా అనుమతి తీసుకోవాలి. ఇందుకు ఎకరాకు రూ.వెయ్యి వరకు మత్స్యశాఖకు రుసుము చెల్లించాలి.

మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వారి ఆమోదం తర్వాత చెరువు నిర్మాణానికి తవ్వకాలు చేపట్టాలి. విస్తీర్ణాన్ని బట్టి రెవెన్యూ, భూగర్భజలశాఖ, జలవనరుల శాఖ అధికారులు కొలతలు వేస్తారు. ఆమేరకే తవ్వాలి. ఆ తర్వాత కాలుష్య నియంత్రణ మండలి ఎన్‌వోసీ జారీ చేస్తుంది. వాణిజ్య విభాగం కింద విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాలి.

## ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్

ధర్మవరం : చేనేత కేంద్రమైన ధర్మవరంలో మెగా క్లస్టర్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కుదేలైన చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ధర్మవరంలో రూ.35 కోట్ల వ్యయంతో క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసింది. అందుకోసం ధర్మవరంలో ఇంటింటా సర్వే చేపట్టి చేనేత కార్మికులను గుర్తించింది. చేనేత మగ్గాలు నేస్తున్న 10,200 మంది ఉన్నట్లు చేనేత జౌళిశాఖ అధికారులు గుర్తించారు. క్లస్టర్ ఏర్పాటుకు ఐదెకరాల స్థలం అవసరం కానుండటంతో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో ఉన్న స్థలాన్ని చేనేతజౌళిశాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. స్థలం లీజుకు తీసుకుని ఆ స్థలంలో దాన్ని ఏర్పాటు చేయనున్నారు. స్థలం లీజుకు కేటాయించాలని ప్రభుత్వాన్ని అధికారులు కోరారు.

**నేత కార్మికులకు నైపుణ్య శిక్షణ**

మెగా క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇప్పటికే పలుమార్లు దిల్లీ వెళ్లి కేంద్రంలోని పెద్దలతో మాట్లాడారు. మెగా క్లస్టర్ ఏర్పాటుకు డీపీఆర్‌ను పంపాలని కేంద్రం కోరడంతో అధికారులు ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన అనంతరం దాన్ని కేంద్రానికి పంపనున్నారు. ధర్మవరంలో మెగా క్లస్టర్ ఏర్పాటు అయితే రూ.5 కోట్లతో భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ



ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన కార్మికులకు చేనేత మగ్గం నేసేందుకు ఉపయోగించే లిఫ్టింగ్ మెషిన్, జాకార్డులు, పంచింగ్ మెషిన్లు 90 శాతం రాయితీతో ఇవ్వనున్నారు. లబ్ధిదారులు 10 శాతం వాటా చెల్లించాల్సి ఉంది. మెగా క్లస్టర్‌లో ఏర్పాటు చేసే మగ్గాలపై చేనేత కార్మికులు పట్టుచీరలు తయారు చేసుకుని విక్రయించవచ్చు. అక్కడే డిజైనింగ్, రంగుల అద్దకం చేసుకోవచ్చు.

**20 ఏళ్లుగా నోచుకోని ప్రయత్నాలు**

చేనేత పరిశ్రమకు సంబంధించిన అన్ని సౌకర్యాలను మెగా క్లస్టర్‌లో ఏర్పాటు చేయనున్నారు. ధర్మవరంలో 20 ఏళ్లుగా చేనేత మెగా క్లస్టర్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్నా గతంలో ప్రతిపాదనలకు కూడా నోచుకోలేదు. చేనేత కార్మికుల సంక్షేమం, పరిశ్రమ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ధర్మవరంలో క్లస్టర్ ఏర్పాటుకు అడుగులు ముందుకు వేస్తోంది.

## వరిలో అధికమవుతున్న తెల్లకంకులు

కణేకల్లు : జిల్లాలో సాగులో ఉన్న వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించి, కంకులు తెల్లగా మారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, శింగనమల, కూడేరు, గార్లదిన్నె తదితర మండలాల్లో రైతులు వ్యవసాయ బోర్లు, చెరువుల కింద 50 వేల ఎకరాల వరకు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కంకిపోయి గింజలు పట్టే దశలో ఉంది. ఈ నెలాఖరుకు చేతికందనుంది. అయితే తెల్లకంకులుగా మారి తాలు గింజలు కావడంతో దిగుబడిపై ప్రభావం చూపనుంది. వాస్తవంగా ఎకరాకు 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. తాలు గింజల వల్ల ఎకరాకు 4 నుంచి 5 బస్తాల వరకు దిగుబడి తగ్గే



అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

**మందులు వాడినా ఫలితం శూన్యం**వరిలో తెల్లకంకులు రాకుండా నివారించేందుకు రైతులు మార్కెట్లో దొరికే క్రిమి సంహారక మందులన్నింటిని వినియోగించినా ఫలితం లేదు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి తగిన సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏవో సాయికుమార్ వివరణ కోరగా వరి పొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు ఇస్తాం. కాండం తొలుచు పురుగు వల్ల తెల్లకంకిగా మారుతుంది. రైతులు కొరాజిన్ లేదా బోరాగాన్ వంటి మందులను తగిన మోతాదులో పిచికారీ చేయాలని చెప్పారు. **పెట్టుబడిపై ప్రభావం..– సంజీవరెడ్డి, లింగదహాళ్** వేల రూపాయలు పెట్టుబడి పెట్టి మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. ఓ వైపు విద్యుత్తు కోతలు, మరోవైపు పంటకు తెగుళ్లు ఆశించి తెల్లకంకులుగా మారుతున్నాయి. దిగుబడి తగ్గి పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.

## విద్యార్థులూ.. కళాశాలలకు రండి!

అనకాపల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఏడాది విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీతోపాటు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసింది. తొలిసారిగా పరీక్షలు అయ్యాక ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఈనెల 23 వరకు వీటిని నిర్వహించనున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులతోపాటు ఈఏపీ సెట్ కోచింగ్ ఇస్తున్నారు. మరోవైపు పదో తరగతి పూర్తయిన విద్యార్థులను కళాశాలలకు రావాలని ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని 20 జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన వారు 26 వేల మంది ఉండగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 13 వేలే ఉన్నారు. విద్యార్థుల సంఖ్య సగానికి తగ్గిపోవడంతో వీరి సంఖ్య పెంచాలన్న ఆలోచనతో చర్యలు చేపట్టారు.కళాశాలలకు చేరుకున్న పుస్తకాలు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పాఠ్య, రాత పుస్తకాలు చేరుకున్నాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీటిని అందిస్తాం. ప్రత్యేక తరగతుల్లోనే వీటిని అందించేలా ఏర్పాట్లు చేశాం. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలు రావాల్సి ఉంది. ప్రత్యేక తరగతుల్లో మధ్యాహ్న భోజనం కల్పించాం. విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

సుజాత, ఇంటర్ బోర్డు జిల్లా అధికారిణి

# నాటి తప్పులు.. నేటి తిప్పలు!



ఉరవకొండ : పంచాయతీలోని 8వ రేషన్ దుకాణాన్ని వైకాపా నాయకుడు నిర్వహించేవాడు. గతేడాది ఆగస్టులో కొత్త డీలర్‌కు అప్పగించినప్పుడు 40 క్వింటాళ్ల బఫర్ స్టాక్ ఉన్నట్లు చూపారు. ఆ బియ్యాన్ని కొత్త డీలర్‌కు అప్పగించలేదు. ఇన్ని నెలలు మౌనంగా ఉన్న అధికారులు ఏప్రిల్‌కు సంబంధించి 13 కిలోలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో డీలర్ అధికారులతో గొడవ పడ్డారు. మార్చి 31న 23 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. దుకాణం పరిధిలో 242 కార్డుదారులకు 40 క్వింటాళ్లు అవసరం. అధికారులు కేటాయించిన బియ్యం సగం కార్డులకే సరిపోతాయని డీలర్ వాపోతున్నాడు.

చెన్నేకొత్తపల్లి పంచాయతీలోని 11వ దుకాణాన్ని గతేడాది ఆగస్టులో కొత్త డీలర్‌కు అప్పగించే సమయంలో 23 క్వింటాళ్ల బఫర్ స్టాక్ ఉన్నట్లు చూపించారు. ఆ సరకును అప్పగించలేదు. పాత డీలర్ నుంచి బియ్యం రికవరీ చేయకపోగా కొత్త డీలర్‌కు ఇవ్వాల్సిన దాంట్లో ప్రతినెలా కోత పెడుతున్నారు. దుకాణం పరిధిలో 310 కార్డులు ఉండగా 45 క్వింటాళ్లు అవసరం.ఏప్రిల్‌కు సంబంధించి 22 క్వింటాళ్లే ఇస్తామని చెప్పడంతో డీలర్ అంగీకరించ లేదు. ఫలితంగా బియ్యం పంపిణీ మొదలుకాలేదు.

పేదల బియ్యం పంపిణీలో అధికారులు కోత విధిస్తున్నారు. ఏప్రిల్‌కు సంబంధించి రేషన్ దుకాణాలకు అందించాల్సిన బియ్యంలో సగమే సరఫరా చేశారు. కొన్నింటికి అసలే ఇవ్వకపోవడంతో ఆయా ప్రాంతాల్లో పంపిణీ నిలిచిపోయింది. తక్కువ మొత్తం బియ్యం కేటాయించిన దుకాణాల్లో పంపిణీ తమ వల్ల కాదంటూ డీలర్లు చేతులెత్తేస్తున్నారు. బఫర్‌స్టాక్ బూచిగా చూపి కోత విధించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా హయాంలో అప్పటి డీలర్లు చేసిన తప్పులకు ఇప్పుడు తమను ఇబ్బంది పెట్టడం సరికాదంటున్నారు. క్షేత్రస్థాయిలో కొందరు సీఎస్‌డీటీలు గతంలో తాము చేసిన అక్రమాలను కప్పిపుచ్చుకోవడం కోసమే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నిల్వల పేరుతో దోపిడీ**

వైకాపా ఐదేళ్ల పాలనలో పేదల బియ్యాన్ని పెద్దమొత్తంలో పక్కదారి పట్టించారు. అప్పటి డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వేలాది టన్నులు స్వాహా చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక గతేడాది ఆగస్టులో కొత్త డీలర్లను నియమించారు. నిబంధనల మేరకు పాత డీలరు తన వద్ద ఉన్న బఫర్ (నిల్వలు)ను కొత్త డీలర్‌కు అప్పగించాలి. ఉమ్మడి అనంత జిల్లాలో ఒక్కచోట కూడా అలా జరగలేదు. అధికారులు మాత్రం బఫర్ స్టాక్‌ను కొత్త డీలర్ల ఖాతాలోకి సాంకేతికంగా బదిలీ చేశారు. ఆ నిల్వలను మింగేసిన పాత డీలర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ వచ్చారు. కనీసం జరిమానాలు విధించలేదు. పాత డీలర్లు కాజేసిన బియ్యం లెక్కలను సరిచేయడానికి ఇప్పుడు కొత్త డీలర్లకు ఇవ్వాల్సిన దాంట్లో కోత విధిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**చక్రం తిప్పుతున్న సీఎస్‌డీటీలు**

వైకాపా హయాంలో జరిగిన బియ్యం దందాలో చాలామంది సీఎస్‌డీటీలు భాగస్వాములే. అప్పట్లో డీలర్ల నుంచి నెలనెల మాముళు వసూలు చేసిన సీఎస్‌డీటీలు వారి అక్రమాలకు సహకారం అందించారు. కూటమి ప్రభుత్వంలో వారంతా వారి స్థానాల్లోనే కొనసాగుతున్నారు. వారంతా పాత వారిపై చర్యలు తీసుకోకుండా కొత్త డీలర్లకు రావాల్సిన దాంట్లో కోత విధిస్తున్నారు.

**అనంతపురం జిల్లాలో ఇలా..**

రేషన్ దుకాణాలు: 1645

నెలవారీ బియ్యం పంపిణీ: 8,800 క్వింటాళ్లు

# అన్నదాతల నిరీక్షణకు తెర



అనంతపురం : హంద్రీనీవా ప్రధాన కాలువకు భూమి ఇచ్చిన అన్నదాతల నిరీక్షణకు తెర పడింది. ఎన్నో ఏళ్లుగా భూపరిహారం కోసం ఎదురుచూస్తున్న వారికి తీపికబురు ఇది. వైకాపా ప్రభుత్వ హయాంలో నయాపైసా చెల్లించకుండా అన్యాయం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తొమ్మిది నెలల కాలంలోనే కర్షకులకు భూపరిహారం చెల్లించే ప్రక్రియ చేపట్టింది.

వారం రోజుల నుంచి విడతల వారీగా పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. హంద్రీనీవా ప్రధాన కాలువ, పేరూరు ఉప కాలువ (యూపీపీ), భైరవాని తిప్ప(బీటీపీ) ఉప కాలువ పరిధిలో అన్నదాతలకు భూసేకరణ (ఎల్‌ఏ) కింద తొలి విడత రూ.45.27కోట్లు మంజూరైంది. ఉరవకొం డ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, రాప్తాడు.. తదితర అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో 638 మంది రైతుల ఖాతాల్లోకి జమ కానుంది. జీడిపల్లి జలాశయ భూపరిహారం, పునరావాసం కింద మరో రూ.131. 4కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల ప్రత్యేక ఉత్తర్వు వెలువడిన సంగతి తెలిసిందే. ఇందులో రూ.81.83 కోట్లు పునరావాసం, తక్కిన మొత్తం భూసేకరణకు కేటాయించారు. త్వరలోనే రైతులు, బాధిత ప్రజలకు అందిస్తారు.

**ప్రధాన కాలువకు...** ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల పరిధి బెళుగుప్ప, కణేకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట మండలాల పరిధిలో 602 మంది రైతులకు భూ పరిహారం కింద రూ.41.45కోట్లు వచ్చాయి. ఈ మొత్తం ఇప్పటికే ఖాతాలకు జమ చేస్తున్నారు. త్వరలోనే మిగతా రైతులకు పరిహారం మొత్తం మంజూరు కానుంది.

**పేరూరు, బీటీపీకి రూ.3.82 కోట్లు** పేరూరు అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు(యూపీపీ) కాలువ భూపరిహారం కింద 23 మంది రైతులకు రూ.1.52 కోట్లు వచ్చాయి. రూ.14 కోట్లకు ప్రతిపాదనలు పంపగా తొలి విడత కింద సదరు మొత్తం వచ్చింది. రాప్తాడు, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల పరిధి కనగానపల్లి, ఆత్మకూరు, రామగిరి, బెళుగుప్ప, కంబదూరు మండలాల్లో కొన్ని గ్రామాలు వస్తాయి. మరోవైపు భైరవానితిప్ప ప్రాజెక్టు(బీటీపీ) ఉప కాలువ పరిహారం కింద రూ.1.52కోట్లు వచ్చాయి. మొత్తం 13 మంది రైతులకు చెల్లిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎక్కువ గ్రామాలు ఉన్నాయి. రూ.5.14కోట్లకు ప్రతిపాదనలు పంపిస్తే... రూ.1.52కోట్లు మంజూరైంది. మిగతా మొత్తం త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. యూపీపీ, బీటీపీకి చెందిన భూపరిహారం కోసం 2023లోనే ప్రతిపాదనలు పంపించినా అప్పటి ప్రభుత్వం పైసా కూడా మంజూరు చేయలేదు.

# పంటలపై కుమ్మరిస్తున్నారు..!



చిత్తూరు : జిల్లాలోని పొలాల్లో యూరియా విచక్షణారహితంగా కుమ్మరిస్తున్నారని గణాంకాలు నిర్ధారించాయి. 2023–24లో రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 82 శాతం అధికంగా ఉండగా.. ఇందులో జిల్లాలో వాడకం రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో సగటున ఎకరాకు 102 కిలోలు వాడుతుండగా.. ఎకరాకు 121 కిలోలు ఉండటం గమనార్హం. 2023–24లో పలు మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నా ఎరువుల వినియోగం తగ్గలేదు. జిల్లాలో యూరియా వాడకం రెండింతలు అధికంగా ఉంది. అధికారుల సిఫార్సు ప్రకారం సగటున నాలుగు శాతం వాడాల్సి ఉండగా రెండింతలు అధికంగా 11 శాతం వినియోగిస్తున్నట్లు గణాంకాలు నిర్ధారించాయి. ఈ లెక్కన ఎకరాకు 2–3 బస్తాలు వాడాల్సి ఉండగా.. 5–6 బస్తాలు వినియోగిస్తున్నారు.కొన్ని మండలాల్లో సిఫార్సు చేసిన మోతాదుతో పోలిస్తే రెండు రెట్లు అధికంగా వినియోగిస్తున్నారు. రైతులు ఏ ఎరువు బస్తా కొన్నా దాంతోపాటే యూరియా కొని పొలంలో చల్లుతున్నారు. జిల్లాలో పశుగ్రాసం విస్తారంగా ఉన్నందున దానికి మోతాదుకు మించి కుమ్మరిస్తున్నారని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. యూరియాలో 10–20 శాతమే ఉపయోగపడుతుంది. మిగిలినది నీటిలో కరిగిపోవడం లేదా భూమిలోకి చేరుతుంది. భూమి తన స్వభావాన్ని కోల్పోతోంది.

ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా.. జిల్లాలో 45 వేల మంది రైతులు 50 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఆ విభాగ అధికారులు పేర్కొంటున్నారు. అయినా ఎరువుల వాడకం మాత్రం తగ్గడం లేదు.

2023–24లో జిల్లాలో ఎన్‌పీకే (నత్రజని, భాస్వరం, పొటాష్)

ఎరువుల వినియోగం: 121 కిలోలు (ఎకరాకు)

ఎన్‌పీకే వినియోగమిలా..

సిఫార్సు: 4: 2: 1


రాష్ట్రంలో సగటు వాడకం: 6: 3: 1

జిల్లాలో వాడకం: 11: 3: 1

## రొయ్యకు మీసం మెలేసే రోజులు!

పాలకొల్లుః నరసాపురం మండలానికి చెందిన శ్రీనివాసు 1.5 ఎకరాల విస్తీర్ణంలో రొయ్యలు సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా రెండు టన్నుల సరకును ఇటీవల ఒకేసారి పట్టుబడి చేయాల్సి వచ్చింది. తెలిసిన సంస్థలకు ఫోన్‌చేసి ఒకరికి విక్రయిం చేశారు. మర్నాడు చెరువు దగ్గరకొచ్చాక ధరలు క్షీణించాయని.. కిలోకు రూ.10 తగ్గించక తప్పదని చెబుతూ కొనుగోలుదారు సరకు తీసుకెళ్లారు. దీంతో టన్నుకు రూ.10 వేల వరకు రైతు నష్టపోయారు. రొయ్యల సాగుదారులు తరచూ ధరల సమస్య ఎదుర్కొంటున్నారు. వేసవిలో పరిస్థితి దయనీయంగా ఉంటుంది. దీనికి చెక్ పెట్టేలా నేషనల్ కో–ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్) ద్వారా రొయ్యల కొనుగోళ్లకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**ఏమిటీ ఎన్‌సీఈఎల్..** ఎన్‌సీఈఎల్ కేంద్ర మంత్రివర్గ ఆమోదంతో



ఏర్పాటైన జాతీయ స్థాయి సహకార సంస్థ. గత రెండేళ్లలో 35 రకాల వస్తువులను 23 దేశాలకు ఎగుమతి చేసింది. రానున్న కాలంలో ఆక్వా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడానికి ఇతర సంస్థలతో కలిసి పనిచేయనుంది. దీని కార్యకలాపాలు ప్రస్తుతం మన రాష్ట్రంలో ప్రారంభించేందుకు రంగం సిద్ధమవ్వగా దిల్లీ నుంచి వచ్చిన సంస్థ ప్రతినిధులు జిల్లాలోని ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**ఇవీ ప్రయోజనాలు..**రోజువారీ మార్కెట్ ధరలను స్పష్టంగా సమాచారంలో పొందుపరుస్తారు. సరకు విక్రయించిన రోజు మార్కెట్ ధరను బట్టి రైతులు వాహనాల్లోకి ఎగుమతి చేయగానే దానికి సరిపడా మొత్తాన్ని వారి ఖాతాలకు జమచేస్తారు. పారదర్శక పద్ధతులు పాటిస్తారు. నాణ్యత ప్రమాణాలు పాటించడానికి ఇన్సులేటెడ్ బాక్సుల ద్వారా సరకు రవాణా చేస్తారు. ఆక్వా ఉత్పత్తులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ప్రాసెసింగ్ ప్లాంట్లు నెలకొల్పడానికి ఎన్‌సీఈఎల్ ప్రతిపాదనలు చేస్తోంది

సంఘ సభ్యత్వం ద్వారా.. రైతులు విక్రయించే సరకు ద్వారా సంస్థకు ఎంత లాభం వస్తుందో దానిలో 50శాతం లాభం కూడా తిరిగి వారికి జమవుతుందని మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు. సంఘంగా ఏర్పడితే సంస్థ వార్షికాదాయంలో 20 శాతం డివిడెండ్ సంఘానికి ఏటా జమవుతుందంటున్నారు. సభ్యత్వం పొందాలంటే రూ.10,500 మూలధన పెట్టుబడిగా చెల్లించాల్సి ఉంది.

**ఉపాధి అవకాశాలు..** సంస్థ కార్యకలాపాల్లో స్వయం సహాయక సభ్యులను చేర్చాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. అదే జరిగితే ఆక్వా విక్రయాల్లో తూకాల దగ్గర, సరకు ఎగుమతుల్లోనూ డ్వాక్రా మహిళలకు ఉపాధి లభించనుంది. దీనిపై జిల్లా మత్స్యశాఖ ఏడీ ఎల్.ఎల్.ఎన్. రాజును సంప్రదించగా ఎన్‌సీఈఎల్ సంస్థ ప్రతినిధులు జిల్లాలో పర్యటిస్తున్నారన్నారు. కార్యకలాపాలు ప్రారంభమైతే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు.

## కొల్లేరు కమ్మేస్తూ.. మత్స్యకారులను కుంగదీస్తూ..

మండవల్లి : కొల్లేరులో ఎంతో గడ్డు పరిస్థితులను సైతం తమకు అనుగుణంగా మార్చుకుని మనుగడను సాధించే ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్, రాక్షస జాతి(సైల్ఫిన్ క్యాట్‌ఫిష్) చేపలు నానాటికి పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కొల్లేరులో ఎక్కువగా లభ్యమయ్యే చేపల్లో మొదటి స్థానం రాక్షస జాతి, రెండో స్థానం క్యాట్‌ఫిష్‌ది. అతి తక్కువ నీరు, ఎక్కువ వ్యాధి నిరోధక శక్తి, భయంకరమైన మాంసాహారులుగా పేరొందిన ఈ రెండు జాతులు ఇతర చేపల్ని వేటాడి తినడం వల్ల కొల్లేరులో ఇతర జాతులకు మనుగడకు ముప్పు వాటిల్లుతుంది.

క్యాట్‌ఫిష్ సాగు వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పుతోపాటు మనుషుల్లో అనేక వ్యాధులు వస్తున్నాయని 1995 పర్యావరణ వేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. 1997లో వీటి సాగుపై కేంద్రప్రభుత్వం నిషేధాన్ని విధించింది. అప్పటి నుంచి సాగు లేకపోయినా కొల్లేరులోని ఇతర మత్స్య జాతులను వేటాడుతూ తన ఉనికిని చాటుకుంటోంది. రాక్షస జాతి చేపలు ఆక్వేరియంలో నాచుని తగ్గించుకోవడానికి వృద్ధి చేశారు. పదేళ్లుగా వీటి సంతతి పంట కాలువలు, చేపల చెరువుల్లో,



ప్రస్తుతం పెద్దఎత్తున కొల్లేరులో దర్శనమిస్తున్నాయి.

**తీవ్రంగా నష్టపోతున్న మత్స్యకారులు..**

2006 కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఎక్కువ మంది మత్స్యకారులు కొల్లేరులో వేటను సాగిస్తూ జీవనాన్ని గడుపుతున్నారు. కానీ గత నాలుగేళ్లుగా క్యాట్‌ఫిష్ జాతి పెరిగి పోవడంతో ఇతర జాతులు లభ్యత క్రమంగా తగ్గుముఖం పట్టింది. అరుదైన జాతులు కనుమరుగవటం క్యాట్‌ఫిష్ స్థాయి పెరిగిపోవడంతో మత్స్యకారులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.అంతరించిపోయే దశలో నల్లజాతి చేపలు.. కొల్లేరులో 126 రకాల చేపలు పెరుగుతుంటాయి. కొన్నేళ్లుగా వేసవిలో కొల్లేరు తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులు ఎదుర్కొంటోంది. దీంతో కొల్లేరులో ఏటా నల్లజాతి మత్స్య సంపద తరిగిపోతూ వస్తోంది. కానీ తీవ్ర నీటి ఎద్దడిని తట్టుకుని, బురదలో బతికే స్వభావం ఉన్న ఈ రెండు జాతులు మాత్రం పిల్లలను పెడుతూ దాన్ని వృద్ధి చెందుతున్నాయి.

**చాలా ప్రమాదకరం..** క్యాట్‌ఫిష్ జాతులు చాలా ప్రమాదకరమైనవిగా గుర్తించి ప్రభుత్వం దీన్ని నిషేధించింది. కొల్లేరులో పెరుగుతున్న సైల్ఫిన్ క్యాట్‌ఫిష్, క్యాట్‌ఫిష్‌ను అడ్డుకోవడం సాధ్యమయ్యే పనికాదు. రసాయనాలను వినియోగిస్తే ఇతర జాతులకు ముప్పు. క్యాట్‌ఫిష్ జాతులు దొరికినప్పుడు వాటిని నాశనం చేసేలా మత్స్యకారులే చర్యలు తీసుకోవాలి.– రాజ్‌కుమార్ ఇన్‌చార్జి ఏడీ, మత్స్యశాఖ

# ఆ ప్లానింగ్ లోనే స్మాల్ స్క్రీన్ తళుకులా..?

ఒకప్పటి హీరోయిన్స్ అంతా కూడా ఇప్పుడు మళ్లీ తెర మీద రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇప్పుడు హీరోయిన్స్ రోల్స్ చేయడం కష్టం కాబట్టి వారికి తగిన పాత్రలను చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఈమధ్యనే మన్మథుడు సినిమా అన్షు మజాకా సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఆమె దారిలోనే ఒకప్పటి స్టార్ హీరోయిన్ లయ కూడా సిల్వర్ స్క్రీన్ రీ ఎంట్రీ ఇస్తుంది. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న తమ్ముడు సినిమాలో లయ సిస్టర్ రోల్ చేస్తుంది. ఈ సినిమాలో ఆమెది ప్రధాన పాత్ర అని తెలుస్తుంది. దిల్ రాజు బ్యానర్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నితిన్, లయ మధ్య ఎమోషనల్ సీన్స్ ఆడియన్స్ ని కట్టిపడేస్తాయని అంటున్నారు. ఐతే రీ ఎంట్రీ ఇచ్చే టైం లో లయ ముందు స్మాల్ స్క్రీన్ పై ఆడియన్స్ కి టచ్ లోకి వచ్చింది. సూపర్ హిట్ కామెడీ షో జబర్దస్త్ షోలో ఆమె ప్రస్తుతం జడ్జిగా కొనసాగుతుంది. అక్కడ శివాజీతో పాటు లయ జడ్జిగా చేస్తుంది. అక్కడ ఆమె పొజిషన్ పర్మినెంటా లేదా టెంపరరీనా తెలియదు కానీ శివాజీ, లయ ఆ జడ్జి సీట్లో కూర్చుంటే చూడటానికి బాగుంది. ఐతే సిల్వర్ స్క్రీన్ రీ ఎంట్రీ ముందే స్మాల్ స్క్రీన్ పై



ఆడియన్స్ కి దగ్గరైతే కెరీర్ మళ్లీ ఊపందుకునే ఛాన్స్ ఉంటుందని లయ ఇలా జబర్దస్త్ షోలో జడ్జిగా చేస్తుంది. తమ్ముడు ఆఫర్ రాగానే ఆమె ముందు ఆలోచించి చేస్తానని చెప్పినా ఎలాగు చాలామంది హీరోయిన్స్ ఈమధ్య రీ ఎంట్రీ చేసి అలరిస్తున్నారనే కారణంతో లయ కూడా ఆ సినిమాకు ఓకే చెప్పింది. ఐతే లయ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వల్ల తమ్ముడు సినిమాకు కొంత స్పెషల్ క్రేజ్ ఏర్పడింది. జబర్దస్త్ లో జడ్జిగా ఆ్రలేడీ ప్రేక్షకులతో సూపర్ అనిపించుకుంటున్న లయ నెక్స్ట్ తమ్ముడు సినిమాతో మరోసారి తన సిల్వర్ స్క్రీన్ పర్ఫార్మెన్స్ తో అలరించాలని చూస్తుంది. తమ్ముడు సినిఒమా మీద నితిన్ కూడా సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. రాబిన్ హుడ్ అంచనాలను అందుకోలేదు కాబట్టి తమ్ముడు సినిమాతో సూపర్ హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఉంటుందా లేదా అన్నది చూడాలి. షూటింగ్ చివరి దశలో ఉన్న తమ్ముడు సినిమా త్వరలోనే రిలీజ్ ఎప్పుడన్నది ఎనౌన్స్ చేస్తారని తెలుస్తుంది.

# అనసూయ గోల్డెన్ రాయల్ లుక్.. స్టన్నింగ్!


అనసూయ భరద్వాజ్.. నాన్ గ్లామర్ లుక్‌లో కూడా తనదైన స్టైల్‌తో కట్టిపడేస్తుంటుంది. ఎప్పుడూ ట్రెండీ లుక్స్‌లో దర్శనమిచ్చే ఈ భామ ఈసారి సంప్రదాయ వస్త్రధారణలో కనిపించింది. ఆకుపచ్చ-బంగారు రంగుల పట్టు చీరలో, జరీ అంచుతో మెరిసిపోతూ, విలక్షణమైన ఆభరణాలతో, గజ్జెలు, బిగిన గాజులతో సంప్రదాయాన్ని చాటింది. ఈ ఫోటోషూట్‌లో అనసూయ తన ఎక్స్‌ప్రెషన్స్‌తో, హావాభావాలతో మరోసారి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. రెడ్ బ్యాక్‌డ్రాప్ ముందు కూర్చొని, ఖద్దరు సెట్‌లో రాజసంగా కనిపించిన అనసూయ.. తన హుందాతనాన్ని, సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించేలా కనిపించింది. వెండితెరపై ఎప్పుడూ స్టైలిష్ లుక్స్‌లో కనిపించే ఆమె ఈసారి రాయల్ లుక్‌లో సరికొత్త అందాన్ని చూపించింది. క్లాసిక్ డిజైన్ బ్లౌజ్, మట్టి రంగుల్లో తళుకులీనే నాజూకైన నగలు ఆమె



అందాన్ని మరింత పెంచాయి. కెమెరా ముందు అనసూయ ఇచ్చిన స్టిల్స్ చూస్తుంటే ఆమె స్టైలింగ్‌కు ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టిందని అర్థమవుతోంది. ఆమె చూపులు, హుందాతనం కలిగిన భంగిమలు.. ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫోటోషూట్‌ను షేర్ చేసిన అనసూయపై అభిమానులు కామెంట్స్, లైక్స్‌తో ఓ రేంజ్‌లో స్పందిస్తున్నారు. ట్రెండీ దుస్తులు, మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌తోనే కాకుండా.. ఇలాంటి సంప్రదాయ సాంప్రదాయ దుస్తుల్లో కూడా అనసూయకు ఎంతలా కుదిరిందో ఈ ఫోటోలు చెబుతున్నాయి. ఆమె ఎక్కడి లుక్ అయినా ఒంటి చేసుకుని మెరిసిపోవడం ఆమె ప్రత్యేకత. మరీ ముఖ్యంగా ఈ పట్టు చీరల లుక్‌లో అనసూయ ఎంతో గ్రేస్‌తో కనిపించడం విశేషం. సినీ రంగంలో నటిగా, యాంకర్‌గా, సోషల్ మీడియాలో ఫ్యాషన్ ఐకాన్‌గా మారిన అనసూయ.. ఈ ఫోటోషూట్ ద్వారా మరోసారి తన ట్రెండ్ సెట్టింగ్ స్టైల్‌ను నిరూపించింది. ఆమె అందాన్ని పొగుడుతూ అభిమానులు కామెంట్స్‌తో హోరెత్తిస్తున్నారు. ఇక ప్రస్తుతం ఆమె తెలుగులో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.




# వీరమల్లు మౌనం..బయ్యర్స్‌లో డేంజర్ బెల్స్



కొన్ని సినిమాలు ఊహించని విధంగా పూర్తయి థియేటర్లలోకి వచ్చేస్తాయి. మరి కొన్ని సినిమాలు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావు. అంతేనా థియేటర్లలోకి ఎప్పుడొస్తాయనే క్లారిటీ ఉండదు. ఇప్పుడు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటూ అభిమానుల సహనాన్ని పరీక్షిస్తోంది హరి హర వీరమల్లు. జాగర్లమూడి క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని భారీ చిత్రాల నిర్మాత ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఏ ముహూర్తాన మొదలు పెట్టారో కానీ మేకర్స్‌కి కాలం కలిసి రావడం లేదు. చాలా కాలంగా ఆగుతూ సాగుతూ వున్న ఈ మూవీ షూటింగ్ పవన్ నాలుగైదు రోజుల షూటింగ్ మినహా చిత్రీకరణ మొత్తం పూర్తయింది. పవన్ ఆ డేట్స్ ఇస్తే బ్యాలెన్స్ షూటింగ్‌ని పూర్తి చేసి సినిమాని ప్రేక్షకుల ముందుకు భారీ స్థాయిలో తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కానీ కాలం కలిసి రావడం లేదు. కారణం పవన్ క్రియాశీల రాజకీయాల్లో బిజీగా ఉండటమే. అంతే కాకుండా ఏపీ డిప్యూటీ సీఎంగా కీలక బాధ్యతల్లో ఆయన బిజీగా ఉండటం వల్ల డేట్స్ కేటాయించలేకపోతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్ రిలీజ్ ఎప్పుడన్నది ప్రశ్నార్థకంగా మారింది. పవన్‌కు సంబంధించిన షూటింగ్‌ని చకచకా పూర్తి చేసి మే 9న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ అది జరిగడం ప్రస్తుత పరిస్థితుల్లో అసాధ్యం. దీంతో సినిమా రిలీజ్ మరోసారి వాయిదా పడింది. దీంతో ఈ మూవీ స్థానంలో శ్రీవిష్ణు సింగిల్, సమంత నిర్మించిన శుభం వచ్చేస్తున్నాయి. కానీ వీరమల్లు రిలీజ్‌పై మాత్రం ఇప్పటి వరకు క్లారిటీ రాలేదు. ముందు అనుకున్న దానికి అటు ఇటుగా అంటూ రెండు మూడు వారాల్లో వచ్చే అవకాశం ఉందా? అంటే దానిపై కూడా స్పష్టతలేదు. టీమ్ మౌనం పాటిస్తోంది. దీంతో అభిమానుల్లో విరమల్లు రిలీజ్‌పై గందరగోళం నెలకొంది. పవన్ వరుస మీటింగ్‌లతో బిజీగా ఉండటం వల్ల ఈ మూవీ బ్యాలెన్స్ షూటింగ్‌కి డేట్స్ కేటాయించలేకపోతున్నారు. దీంతో సినిమా ఎప్పటికి పూర్తవుంది? ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే దానిపై స్పష్టతకొరవడుతోంది. మేకర్స్ కూడా ఏం చేయలేని పరిస్థితి ఉండటంతో ఫ్యాన్స్‌లో ఆందోళన మొదలైంది. పవన్ డేట్స్ ఇస్తే తప్ప ఈ మూవీ రిలీజ్ పై స్పష్టత వచ్చే అవకాశం లేదు. దీంతో సినిమాపై బజ్ కనిపించకపోవడంతో బయ్యర్లలో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. పోనీ తాజా పరిస్థితిని కూల్ చేయడానికి మేకర్స్ ఏదైనా చేస్తున్నారా? అంటే అదీ లేదు. క్రిష్ తప్పుకోవడంతో ఆ బాధ్యతల్ని ఏ.ఎం.రత్నం తనయుడు జ్యోతికృష్ణ చూసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన దృష్టి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పైనే ఉంది. ఇతర విషయాలు, సినిమా రిలీజ్‌పై వస్తున్న వార్తలని ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదు. ఏ.ఎం.రత్నం పరిస్థితి కూడా అంతే. ఏదైనా కొత్తగా ట్రైలర్‌ని రిలీజ్ చేసి వార్తలకు చెక్ పెడతారా అనుకుంటే అదీ లేదు. టీమ్ అంతా మౌనాన్ని పాటిస్తున్నారు. దీంతో అటు బయ్యర్లకు, ఇటు ఫ్యాన్స్‌కు మెంటలెక్కిపోతోంది. మే లో రావడం లేదు సరే కనీసం జూన్‌లో అయినా వస్తుందా? అని అంతా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో కన్నప్ప, కుబేర వస్తున్నాయి. వాటితో రిలీజ్ అంటే వాటికి ఇబ్బంది. అలా చేయరు. దీంతో జూన్ ఫస్ట్ లేదా సెకండ్ వీక్‌లోనే రావాలి. కానీ టీమ్ నుంచి ఎలాంటి క్లారిటీ లేదు. ఫస్ట్ పార్ట్‌కే ఇలా ఉంటే ఇక పార్ట్ 2 పరిస్థితి ఏంటో అని అంతా పెదవి విరుస్తున్నారు.

# సౌండ్ లేకుండా 70 కోట్లు కొట్టేసిన సినిమా




ఇప్పుడు సినిమా విడుదల అంటే సోషల్ మీడియాలో హడావుడి, ఇంటర్వ్యూల హడావుడి, యూట్యూబ్, బిల్‌బోర్డ్స్, ప్రీ రిలీజ్ ఈవెంట్ల దాకా వెళ్లకపోతే ఆ సినిమాకే రిలీజ్ లేదనిపించే రోజులు వచ్చాయి. కానీ ఈ గ్లామర్ ప్రమోషన్ పక్కన పెట్టేసి, కేవలం కథే ప్రమోషన్ అనే ఫార్ములాతో ఊపిరి పీల్చకుండా విజయాన్ని వేటాడుతున్న సినిమా 'తుడరుమ్'. తెలుగు రాష్ట్రాల్లో పెద్దగా ఎవరూ అంచనా వేయని ఈ మలయాళ థ్రిల్లర్ ఇప్పుడు దేశవ్యాప్తంగా ట్రేడ్ వర్గాల్లో సీరియస్‌గా చర్చనీయాంశమవుతోంది. వారం కూడా కాకుండా రూ.70 కోట్లు వసూలు చేసి, వంద కోట్లు టార్గెట్ చేస్తోందంటే.. అది కంటెంట్ వల్ల వచ్చిన క్రేజ్ తప్ప, స్టార్ పవర్ వల్ల కాదనడానికి ఇదే ఉదాహరణ కావాలి. మోహన్ లాల్ వంటి నటుడు ప్రెస్ మీట్లు, ప్రోమో షోలూ లేకుండా ఇలా థియేటర్లలో నిలబెట్టడం నిజంగా అరుదైన విషయం. అసలు ఈ సినిమా కోసం ఓ ఇంటర్వ్యూకైనా మోహన్ లాల్ వెళ్లారా? డైరెక్టర్ తరుణ్ మూర్తి ఎక్కడైనా ప్రచారం చేశారా? కనీసం యూట్యూబ్ షార్ట్ ఇంటర్వ్యూలు కూడా రాలేదు. కానీ కేరళలో థియేటర్ల పరిస్థితి చూస్తే, ప్రీమియర్ షోల దగ్గరి నుంచే హౌస్ ఫుల్స్. అటు తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా సైలెంట్ గా రిలీజ్ అయ్యినా, కొన్ని చోట్ల మంచి ఆక్యుపెన్సీకి చేరుకోవడంతో ఈ సినిమా కలెక్షన్స్ పెరుగుతున్నాయి. కథ పరంగా చూస్తే ఇది 'దృశ్యం'కు దగ్గరగా అనిపించొచ్చు. కానీ స్క్రీన్‌ప్లే, ఎమోషన్, ఫ్యామిలీ లేయర్స్, పోలీసుల నేపథ్యాన్ని కలిపి దర్శకుడు కొత్తగా మలిచాడు. ముఖ్యంగా రంగస్థలంలోని చివరి ట్విస్ట్‌ని తీసుకుని, అది ఒక కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేస్తుందన్న కోణంలో చూపించారు. కథన శైలి చాలా సూటిగా, ఎక్కడా చెదరకుండా సాగిపోవడం ప్రేక్షకుల్ని ఎమోషనల్‌గా కలిపేసింది.

జెక్స్ బిజోయ్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కథకి కొత్త ఊపును అందించింది. ఇప్పుడు ఈ సినిమా హవా చూసి ట్రేడ్ వర్గాల్లో ఓ చర్చ మొదలైంది స్టార్ ప్రమోషన్ అవసరమేనా? ఒక సినిమా నమ్మకంగా తయారు చేస్తే, కంటెంట్‌నే నమ్మితే.... ఆడియన్స్ ఎప్పుడూ అద్భుతంగా స్పందిస్తారు. ఇక్కడ 'తుడరుమ్' చేసినదే అదే. పాన్ ఇండియా సినిమా అంటే 200 కోట్ల బడ్జెట్ కావాలి అనే కాన్సెప్ట్‌కు ఇది షాక్ లాంటి ఉదాహరణ. చిన్న బడ్జెట్, పెద్ద విజయం. అంతే కాదు, ఇప్పుడు తుడరుమ్ సక్సెస్ చూసి, రెండో పార్ట్ సిద్ధం అవుతోంది. మొత్తానికి చెప్పాలంటే, 'తుడరుమ్' పాఠం స్పష్టం – ప్రేక్షకుల్నీ, థియేటర్లనీ ఒక గొప్ప కథలే నడుపుతాయి. ప్రమోషన్ గొడవలూ, ఫ్యాన్స్ షోలూ లేని సినిమాలు కూడా గొప్ప విజయం సాధించగలవని మళ్లీ రుజువైంది. ఇక ఈ సినిమాతో కొత్త ఫ్రాంచైజ్ రూపుదిద్దుకుంటుందన్న మాట కూడా ఆసక్తికరంగా మారింది.

# 25 ఏళ్లలో స్టార్ హీరోయిన్ ఆర్జన షాకిస్తోందే!

తెలుగు, తమిళంలో అగ్ర కథానాయికగా కొనసాగుతున్న త్రిష తన రెండున్నర దశాబ్దాల కెరీర్ లో ఏ మేరకు ఆస్తుల్ని సంపాదించింది? ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే... జాతీయ మీడియా వివరాల ప్రకారం.. త్రిష రూ.90 కోట్ల ఆస్తులను కూడగట్టిందని సమాచారం. 1999లో జోడి అనే చిత్రంతో నటిగా పరిశ్రమలో అడుగుపెట్టిన త్రిషకు టాలీవుడ్ గొప్ప గుర్తింపును ఇచ్చింది. ప్రభాస్ సరసన వర్షం త్రిష కెరీర్ గేమ్ ఛేంజర్. ఆ తర్వాత కెరీర్ జర్నీ గురించి తెలిసిందే. నిన్న మొన్నటి పొన్నియన్ సెల్వన్%-% ఫ్రాంఛైజీ సినిమాల వరకూ త్రిష అజేయమైన ప్రయాణాన్ని సాగించింది. త్రిష ఒక్కో సినిమాకు రూ.3 కోట్లకు పైగా పారితోషికం అందుకుంటోంది. వాణిజ్య ప్రకటనల ఏడాది కాంట్రాక్ట్ కోసం రూ.9



కోట్లకు పైగా సంపాదిస్తుంది. పొన్నియిన్ సెల్వన్: 1 విజయం తర్వాత లియో కోసం రూ.5 కోట్లకు పారితోషికాన్ని పెంచిందని కథనాలొచ్చాయి. త్రిషకు పలు నగరాల్లో ఆస్తులు ఉన్నాయి. హైదరాబాద్ లో 6 కోట్ల ఖరీదు చేసే ఇల్లు, చెన్నైలో 10 కోట్ల విలువ చేసే విలాసవంతమైన ఇల్లు ఉన్నాయి. త్రిష కార్ల గ్యారేజీలో కోట్లాది రూపాయల విలువ చేసే లగ్జరీ కార్లు ఉన్నాయి. రూ.63 లక్షల నుండి రూ.80 లక్షల రేంజులో పలు బ్రాండెడ్ కార్లను కొనుగోలు చేసింది. మరో రెండు మూడేళ్లలో పెరుగుతున్న ధరలు, మార్కెట్ విలువ దృష్ట్యా త్రిష 100 కోట్ల నికర ఆస్తుల క్లబ్ లో చేరుతుందని అంచనా. త్రిష చివరిసారిగా అజిత్ చిత్రం విదాముయార్చిలో కనిపించింది. ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. తదుపరి మెగాస్టార్ విశ్వంభరలో నటిస్తోంది. పలువురు సీనియర్ హీరోలకు త్రిష బెస్ట్ ఆప్షన్ గా ఉంది. 41 ఏజ్‌లోను నేటితరం కథానాయికలతో పోటీపడుతూ త్రిష కెరీర్ జర్నీని విజయవంతంగా కొనసాగిస్తోంది.

# పవన్ కళ్యాణ్ హీరోయిన్ స్టైలిష్ అవతార్

కన్నడ మూవీ 'పోర్కి' తో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రణిత సుభాష్. రెండో సినిమానే తెలుగులో చేసింది. 'ఏమ్ పిల్లో ఏమ్ పిల్లాడో' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన అందంతో ఆకట్టుకుని గుర్తింపు సొంతం చేసుకుంది. ఆ వెంటనే సిద్దార్థ్ హీరోగా నటించిన 'బావ' సినిమాలోనూ పల్లెటూరు అమ్మాయిగా నటించి పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు నటనతో అలరించడం వల్ల హీరోయిన్‌గా మంచి పేరు సొంతం చేసుకుంది. అయితే లక్ కలిసి రాక పోవడంతో స్టార్ హీరోయిన్‌గా ఇమేజ్‌ను దక్కించుకోవడంలో విఫలం అయింది. పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించడం ద్వారా మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ప్రణిత ఆ వెంటనే ఎన్టీఆర్‌తో కలిసి ఒక సినిమాలో నటించింది. స్టార్ హీరోల సినిమాల్లోనూ నటించిన ప్రణితకి సరైన బ్రేక్ దక్కలేదు. దాదాపు పదేళ్ల పాటు ఇండస్ట్రీలో వరుసగా సినిమాలు చేస్తూ వచ్చిన ప్రణిత ఈమధ్య కాలంలో కాస్త స్లో అయింది. పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా సినిమాల్లో



నటించేందుకు ఈమె రెడీగా ఉంది. గత సంవత్సరం ఈమె నటించిన రెండు సినిమాలు ప్రేక్షకలు ముందుకు వచ్చాయి. ప్రస్తుతం కూడా ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి 15 ఏళ్లు దాటినప్పటికీ అందం విషయంలో ఇంకా కొత్త హీరోయిన్స్‌కి పోటీ అన్నట్లుగా ఉంటుంది. మూడు పదుల వయసులో పడ్డా కూడా ప్రణిత ఆకట్టుకుంటుంది. 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగానే ఇప్పటికీ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఈమె స్టైలిష్ డ్రెస్‌లో ట్రెండీ డ్రెస్‌ల్లో ఎక్కువగా అలరిస్తూ ఉంటుంది. ప్రతి సందర్భంలోనూ ప్రణీత సుభాష్ షేర్ చేసే ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా ఈమె మరోసారి స్టైలిష్ అవతార్‌లో కనిపించింది. విభిన్నమైన ఔట్ ఫిట్‌లో డిఫరెంట్ లుక్, స్టైల్‌తో అలరించిన ఈ అమ్మడు మరోసారి అలరించింది. క్యూట్ లుక్‌తో స్కిన్ షో చేయకుండానే ప్రణిత చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రణిత అందంకు స్టార్ హీరోలకు జోడీగా ఇప్పటికి వరుసగా సినిమాలు చేయాల్సి ఉంది. సమంత స్థాయిలో స్టార్‌డంను సొంతం చేసుకోవాలి. కానీ ఆ స్థాయిలో ప్రణితకు ఆఫర్లు రాలేదు. లక్ కలిసి రాకపోవడంతో ఈమెకు దక్కాల్సిన గౌరవం, గుర్తింపు దక్కలేదు అనేది కొందరి అభిప్రాయం. ముందు ముందు అయినా ప్రణిత తన అందంతో అలరించి సీనియర్ స్టార్ హీరోలకు జోడీగా అయినా నటించే అవకాశాలు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536